

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 47 • పేజీలు:12+16 • వెల: రూ.5 | గురువారం • 18-1-2018 | www.manamnews.com | /manamnews



మానవాళికే మహా ప్రవక్త

మహాత్మునికి ఇజ్రాయెల్ ప్రధాని నివాళి

సబర్మతి ఆశ్రమ సందర్శనలో నెతన్యాహు

బాపూ గదిలో రాట్నం తిప్పిన దంపతులు

అహ్మదాబాద్ నుంచి అట్టహాసంగా రోడ్ షో

7 లో..



సుఖోయ్‌లో నిర్మల!



టాలీవుడ్‌కు ఐటీ షాక్

8 మంది నిర్మాతలపై సోదాలు

పన్ను కట్టకపోవడమే కారణం

సోదాలు కావు.. సర్వే మాత్రమే

బడా నిర్మాణ సంస్థల వాదన

భారీ బడ్జెట్లతో సినిమా నిర్మాణం

పన్ను చెల్లింపు అంతంతమాత్రం

6 లో..

వైద్యానికి నిధుల పెంపు



వచ్చే బడ్జెట్‌లో భారీగా కేటాయింపు.. ప్రజారోగ్యంపై పెరుగుతున్న నమ్మకం

దానిని నిలబెట్టుకోవాలి

ముఖ్యమంత్రి కేసీఆర్

102 వాహనాలు, బైక్ అంబులెన్సులకు పచ్చజెండా

తూప్రాన్‌లో 50 పడకల ఆస్పత్రి ప్రారంభం

పట్టణవాసులపై వరాల జల్లు..

డిగ్రీ కాలేజీకి హామీ

సీసీ రోడ్లకు రూ.5 కోట్లు..

షాదీఖానాకు 20 లక్షలు

గజ్వేల్‌లో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటుపై పరిశీలన

నియోజకవర్గంలో త్వరలోనే బస్సు యాత్ర



హైదరాబాద్/మెదక్/ గజ్వేల్, జనవరి 17 (మనం ప్రతినిధి):

కేసీఆర్ కిట్ పథకం అమలు, ప్రభుత్వ ఆస్పత్రులను మెరుగుపర్చడంతో ప్రజా వైద్యంపై నమ్మకం కుదిరిందని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సీఎం కేసీఆర్ సూచించారు. ప్రజా వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ఇకపై వైద్య ఆరోగ్య శాఖకు మరిన్ని నిధులు కూడా అవసరం అవుతాయన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలే కాకుండా వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై కూడా అంచనాకు వచ్చి బడ్జెట్‌లో నిధుల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. 2018-19 బడ్జెట్‌లో వైద్య ఆరోగ్య **మిగతా 3లో..**



ఉన్నదే వంద.. లీటర్ పోసి బైక్‌మీద పోవడం బెటరా.. క్వార్టర్ తాగి నడుచుకుంటూ పోతే బెటరా..!

వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో గురువారం పొడి వాతావరణం నెలకొంటుంది. రాత్రి ఉష్ణోగ్రత స్వల్పంగా తగ్గుతుంది. చలి తీవ్రత పెరుగుతుంది. గంటకు 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 31 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 15 డిగ్రీలు

గాలిలో తేమ: 49 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: పాడ్యమి ఉ.10.13 తదుపరి విదియ; నక్షత్రం: శ్రవణం రా.12.59 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: తె.5.24 నుంచి; దుర్ముహూర్తం: మ.3.02-4.31; రాహుకాలం: మ.1.50-3.13; అమృతఘడియలు: మ.1.27-3.14; శుభసమయం: మ.1.00-1.30;

సూర్యోదయం: 6.53

సూర్యాస్తమయం: 6.00

మందకృష్ణను విడుదల చేయాలి



తక్షణమే అక్రమ కేసులు ఎత్తివేయాలి

జైల్లో పెట్టడం అన్యాయం: జిగ్నేశ్ మేవాని

జైల్లో ఎమ్మార్పీఎస్ నేతను కలిసిన గుజరాత్ ఎమ్మెల్యే



హైదరాబాద్, జనవరి 17 (మనం ప్రతినిధి):

దళితుల హక్కుల కోసం పోరాడుతున్న మందకృష్ణ మాదిగను జైల్లో పెట్టడం అన్యాయమని గుజరాజ్ ఎమ్మెల్యే, దళిత నేత జిగ్నేశ్ మేవాని పేర్కొన్నారు. మందకృష్ణను జైల్లో పెట్టడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని పేర్కొన్నారు. చంచల్‌గూడ జైలులో ఉన్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక నేత మందకృష్ణను బుధవారం మేవాని కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. దళితుల **మిగతా 6లో..**

మీరేం చేశారు?

40 వేల టీచర్ పోస్టులు ఖాళీ .. ఒక్కటీ భర్తీ చేయలేదు ఎందుకు?

5 వేల సర్కారీ బడులను మూసేశారు

విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారు

కార్పొరేట్‌కు కొమ్ము కాస్తున్నారు

అయినా.. కేంద్రంపై విమర్శలా?

మంత్రి కడియంపై లక్ష్మణ్ ఆగ్రహం



హైదరాబాద్, జనవరి 17 (మనం న్యూస్):

మూడున్నర సంవత్సరాల కాలంలో ప్రాథమిక విద్య నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు ఒక్క ఖాళీ కూడా భర్తీ చేయని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు **మిగతా 6లో..**

ముప్పు.. ముంచుకొస్తోంది!

ఆసియాలో భారీ వరద ప్రమాదం.. 2040 నాటికి 15.6 కోట్ల మందిపై ప్రభావం

రెండు దశాబ్దాల్లో ప్రజా జీవనంపై భూతాపం పెరుగుదల దుష్ఫలితం



కాలక్రమేణా మారుతున్న వర్షపాతం తీరు

జర్మనీ పరిశోధకుల తీవ్ర హెచ్చరికలు

బెర్లిన్, జనవరి 17:

నదులు పొంగుతాయి.. వర్షాలు పెరుగుతాయి.. వర్షపాతం తీరుతెన్నులు మారిపోతాయి.. వరదలు ముంచెత్తుతాయి.. ఇవన్నీ జరగడానికి ఎంతో కాలం పట్టేలా లేదు. రాబోయే రెండు దశాబ్దాలలో పరిస్థితులు ఘోరంగా తయారవుతాయి. భూతాపం పుణ్యమాని వరదలు భారీగా ముంచెత్తుతాయని జర్మన్ పరిశోధకులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. ఇన్నాళ్లూ భూతాపం గురించి ఎంత చెబుతున్నా రిఫ్రిజిరేటర్లు, ఏసీల **మిగతా 6లో..**



తలైవా.. తలెత్తలేడు

ఇండియాటుడే-కార్వీ సర్వేలో తమిళ తంబిల మాట

పార్టీ పెడితే 16 శాతం ఓట్లు... 33 సీట్లకే పరిమితం

డీఎంకే కూటమికి 34 శాతం ఓట్లతో 130 స్థానాలు

వెంటనే ఎన్నికలు పెడితే ఫలితం ఇలాగే ఉంటుందట!

చెన్నై, జనవరి 17: తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయడం వల్ల ఎవరికి ప్రయోజనం? శాసనసభకు 2021లో జరిగే ఎన్నికల్లో తమ పార్టీ **మిగతా 6లో..**

మహిళా వ్యాపారికి టోకరా

● 450 కిలోల వెండి ఆభరణాలతో పరార్

హైదరాబాద్, జనవరి 17: నగరంలోని ఓ మహిళా వ్యాపారిని రాజస్థాన్ వాసి నమ్మించి మోసం చేశాడు. వ్యాపార లావాదేవీల పేరుతో కోటి న్నరకు టోకరా ఇచ్చాడు. ఆభరణాలను అమ్మిపెడతానని చెప్పి అవి అం దాక ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి తప్పించుకు తిరుగుతున్నాడు. హైదరాబాద్ యూసుఫ్‌గూడ సమీపంలోని శ్రీకృష్ణ నగర్‌లో మహిళా వ్యాపారి ధర్మిష్ట జైన్(34) మూడేళ్లుగా శ్రీ నకోడా సిల్వర్ పేరుతో వెండి ఆభరణాల షాప్ నడుపుతున్నారు. బులియన్ మార్కెట్‌లో కొన్న వెండి బిస్కెట్లతో ఆభర ణాలు తయారు చేసి క్రెడిట్ పద్ధతిలో సరఫరా చేస్తున్నారు. ఆమెకు రాజ స్థాన్‌లోని నర్పత్ పట్టణానికి చెందిన జాలారామ్ అలియాస్ బాగ్దారామ్ అలియాస్ భరత్ ఆభరణాల వ్యాపారిగా పరిచయమయ్యాడు. తనకు వెండి ఆభరణాలు ఇస్తే వాటిని విక్రయించి ఎప్పటికప్పుడు డబ్బులు చెల్లి స్తానని నమ్మించి 10 నెలలుగా ఆమెతో వ్యాపార లావాదేవీలు నిర్వ హిస్తున్నాడు. జూన్‌లో 450 కిలోల వెండి ఆభరణాలు కావాలని.. వాటిని అమ్మి డబ్బులు చెల్లిస్తానంటూ ఆమెతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆభరణాలు తీసుకున్న తర్వాత డబ్బులు చెల్లించకపోగా ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో మోసపోయానని తెలుసుకున్న ఆమె మంగళవారం పోలీ సులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన పోలీసులు ఓ బృందాన్ని రాజస్థాన్ పంపించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

అమెరికాలో తెలంగాణ టెక్కీ మృతి



హైదరాబాద్, జనవరి 17: అమెరికాలోని సౌత్‌ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కరీంనగర్ వాసి మృతి చెందారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న భరత్‌రెడ్డి ఈ ఘట నలో ప్రాణాలు కోల్పోయారు. కరీంనగర్ మండలం మల్కాపూర్‌కు చెందిన నరహరి లక్ష్మారెడ్డి-లక్ష్మి దంపతులు కరీంనగర్‌లోని విద్యానగర్‌లో స్థిరపడ్డారు. ఈ దంపతుల రెండో కుమారుడు నరహరి భరత్‌రెడ్డి గత 13 ఏళ్లుగా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. అమెరికాలో ఏటా నిర్వహించే సైక్లింగ్లో ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో కొంతకాలంగా భరత్ రెడ్డి తీవ్రంగా కసరత్తు చేస్తు న్నారు. ఇందుకోసం ఓ ప్రత్యేక శిక్షకుడిని కూడా నియమించుకున్నారు. ఈ క్ర మంలో శనివారం సైక్లింగ్ మిత్రులతో కలిసి సాధన చేస్తుండగా ప్రమాద వశాత్తు ఒకరిపై మరొకరు పడిపోయారు. ఇందులో చివరగా ఉన్న భరత్ రెడ్డి రోడ్డుకు ఆవలివైపు పడిపోయాడు. అదే సమయంలో వేగంగా దూసుకొచ్చిన ట్రక్కు భరత్‌పై నుంచి వెళ్లింది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. మిత్రులు వెంటనే అక్కడి ఆసుపత్రికి తరలించారు. తల కు తీవ్రగాయాలు కావడంతో కోమాలోకి వెళ్లిన భరత్ బుధవారం శాశ్వ త నిద్రలోకి జారుకున్నాడని సమాచారం అందడంతో భరత్ రెడ్డి కుటుం బ సభ్యులు, మిత్రులు విషాదంలో మునిగిపోయారు?

నేటి నుంచి నేరస్తుల సమగ్ర సర్వే

హైదరాబాద్, జనవరి 17(మనం ప్రతినిధి): నేరరహిత రాష్ట్రమే లక్ష్యంగా తెలంగాణ పోలీసులు తలపెట్టిన వినూత్న కార్యక్రమం 'సకల నేరస్తుల సర్వే'కు గురువారం నుంచి శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకోసం గత పదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీసు స్టేషన్లలో నమోదైన నేరాలు, నేరస్తుల వివరాలతోపాటు రైల్వే పోలీసుల నుంచి కూడా సమాచారాన్ని సేకరించారు. ఈ సమాచారం సహాయంతో నేరస్తుల ఇంటింటికీ వెళ్లి వారి వేలిముద్రలు, ఫొటోలు, ఇతరత్రా పూర్తి వివరాలు జియో ట్యాగ్ చేయనున్నారు. గతంలో పాత నేరస్తులు ఇచ్చిన వివరాల ఆధారంగా ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేయనున్నారు. పోలీసులకు ఎప్పుడంటే అప్పుడు సమాచారం అందుబాటులో ఉండేలా టీఎస్ కాప్ యాప్, వెబ్‌సైట్‌లో ఈ కార్యక్రమంతో సేకరించిన పూర్తి వివరాలను పొందుపర్చనున్నారు. దీంతో నేర పరిశోధన సులువవడంతోపాటు, నేరస్తులను వేగంగా పట్టుకునే అవకాశాలు పెరగనున్నాయి. సమగ్ర నేరస్తుల సర్వే కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

బ్యాంకుల్లో కరెన్సీ నిల్వలు ఉంచాలి

● కేంద్రమంత్రి అరుణ్ జైట్లీకి పోచారం వినతి

హైదరాబాద్, జనవరి 17(మనం ప్రతినిధి): పెట్టుబడి పథకానికి రూ.4 వేలు అందించేందుకు బ్యాంకుల్లో తగినంత కరెన్సీ నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బుధవారం నార్త్ బ్లాక్‌లో అరుణ్ జైట్లీతో తెలంగాణ మంత్రులు పోచారం, ఈటల రాజేందర్‌తో పాటు చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. ఎకరానికి రూ.4 వేలు పంట పెట్టుబడి పథకాన్ని దేశంలోనే తొలిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి పంటకు రూ.6 వేల కోట్లు అవుతుందని అంచనా వేసినట్టు తెలిపారు. పంట పెట్టుబడిని చెక్కుల రూపంలోనే రైతులకు అందజేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. డ్రిప్, ఇరిగేషన్ పథకానికి తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలపై పడుతున్న జీఎస్టీ భారాన్ని తగ్గించాలని కోరినట్టు వివరించారు. దేశంలోనే రైతులకు అత్యధిక సబ్సిడీ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని మంత్రి పోచారం పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా ప్రచురణ ఎప్పుడు?

● ఎన్నికల అధికారిని కలిసిన కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్, జనవరి 17 (మనం ప్రతినిధి): ఓటర్ల జాబితా ముసాయిదా ఇప్పటివరకు ఎందుకు ప్రచురించలేదని పలువురు కాంగ్రెస్ నేతలు ఎన్నికల అధికారిని ప్రశ్నించారు. మర్రిశశిధర్ నేతృత్వంలో పలువురు కాంగ్రెస్ నేతలు బుధవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అనూప్‌సింగ్ కలిసి ఓటరు జాబితా ముసాయిదా ప్రచురించకపోవడం పట్ల అభ్యంతరం తెలియజేశారు. ఓటర్లు జాబితా ఇప్పటివరకు ప్రచురించకుండా వచ్చే నెలలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ఆయనను అడిగారు. జాబితాలో లక్షల సంఖ్యలో పేర్లు తొలగించారని, దానిపై ఇప్పటికే వినతి పత్రం ఇచ్చామని, ఇంత వరకు ఎలాంటి స్పందన లేదని మర్రిశశిధర్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న 8600 గ్రామ పంచాయతీలకు అదనంగా మరో నాలుగు వేలు పెంచుతామని ప్రభుత్వం చెబుతోందని, ఓటర్ల జాబితా లేకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ఆయన ప్రశ్నించారు.

ప్రజా సేవకే పోలీసు వ్యవస్థ

● డీజీపీ మహేందర్ రెడ్డి



జగిత్యాల క్రైం, వనపర్తి, జనవరి 17(మనం న్యూస్): విధి నిర్వహణలో కొంత కఠినంగా ఉన్నా పోలీసులు ఉన్నదే ప్రజా సేవకోసమని డీజీపీ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. శాంతి భద్రతలు కాపాడే విషయంలో, నిందితులలో మార్పు రావడం కోసం కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఈ విషయంలో పోలీసులకు సహకరించాలని కోరారు. బుధవారం జగిత్యాల జిల్లాలో డీజీపీ అకస్మిక తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్పీ కార్యాలయం భవన నిర్మాణ నమూనాను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పోలీసులు ఎప్పుడు ప్రజలకోసమే పనిచేస్తారని, పని విధానంలో గాంభీర్యంగా ఉన్నా.. నిజానిజాలను తెలుసుకోవడమే తప్ప ప్రజలను నొప్పిం చాలని కాదన్నారు. ఈ విషయాన్ని అర్థం చేసుకొని పోలీసులతో ప్రజలు మమేకం కావాలన్నారు. నూతన జిల్లాల ఏర్పాటు తర్వాత కొత్త జిల్లాల ఎస్పీ కార్యాలయాల నూతన భవనాల విషయంలో రాష్ట్ర వ్యాప్తంగా పటిష్టంగా ఉండేవిధంగా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని తెలిపారు. పోలీస్ వ్యవస్థ ఉన్నదే ప్రజలకోసమని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ వ్యవస్థ అనుక్షణం పనిచేస్తుందని చెప్పారు. ఇందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. ప్రజలందరికి ఉపయోగపడేలా పోలీస్ వ్యవస్థలో అన్నిరకాల నూతన ప్రణాళికలను రూపొందించి పౌరసేవలో ముందుండాలని ఆయన అధికారు లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐజీ నాగిరెడ్డి, కరీంనగర్ డీఐజీ ప్రమోద్ కుమార్, జగిత్యాల ఎస్పీ అనంతశర్మ, డీఎస్పీ ప్రతాప్, జిల్లా పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల గౌరవాన్ని కాపాడాలి..

దేశంలోనే తెలంగాణ పోలీసులు నెంబర్ 1గా ఉన్నారని, దీనిని కాపాడుకోవాలం టూ పోలీసు అధికారులకు డీజీపీ మహేందర్ రెడ్డి సూచించారు. బుధవారం వన పర్తి జిల్లా కార్యాలయంలో నూతనంగా నిర్మిస్తున్నా పోలీసు కార్యాలయ భవ నాన్ని ఆయన సందర్శించారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం నడుస్తోందని చెప్పా రు. ప్రజలు కట్టే పన్నులతోనే ప్రభుత్వం జీతాలందిస్తుందని చెబుతూ ప్రజా రక్షణే ప్రథమ ప్రాధాన్యంగా పనిచేయాలని చెప్పారు. ప్రజలతో మర్యాదగా మెలగాలని, పోలీసుల పట్ల గౌరవ భావం పెంపొందేలా ప్రవర్తించాలని పోలీసులకు కోరారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రజలను కించపర్చడం కానీ అవమానించడంకానీ చేయొద్దని డీజీపీ పేర్కొన్నారు.

అదుపుతప్పిన టిప్పర్.. ఇద్దరి మృతి

● వనస్థలిపురంలో దారుణం

● మీర్‌పేటకు చెందిన యువకుడి మృతి

● కుటుంబ సభ్యులకు తీవ్రగాయాలు

● విషమంగా ఓ మహిళ పరిస్థితి





వనస్థలిపురం, జనవరి 17(మనం న్యూస్): నగరంలో ఓ టిప్పర్ బీభత్సం సృష్టించింది. మితిమీరిన వేగం కారణంగా అదుపుతప్పి వాహనాలపైకి దూసుకెళ్లింది. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సుష్మ థియేటర్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. వనస్థలిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆటోనగర్ నుంచి ఎల్బీనగర్ వైపు వస్తున్న ఏపి 11 వి 6264 అనే నెంబర్ గల టిప్పర్ బ్రేకులు పేయిలవడంతో రోడ్డు ప్రక్కన ఆపి ఉన్న ఆటోలపైకి దూసుకొచ్చింది, అయినా అదుపుకాకపోవడంతో సిగ్నల్ దగ్గర ఆగి ఉన్న ద్విచక్రవాహనాలను ఢీ కొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న నరేష్(23), మహేష్(7) అనే ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో మీర్‌పేటకు చెందిన సునీల్ కుటుంబానికి తీవ్ర గాయాలయ్యాయి. సునీల్ కుమారుడు మహేష్ అక్కడికక్కడే మరణించాడు. సునీల్ భార్య రాధతో పాటు మరో కుమారుడు మనీష్ గాయాలపాలయ్యారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నల్గొండ జిల్లాలోని స్వగ్రామం శ్రీనాథపురం వెళ్ళి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సుష్మా థియేటర్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద నిలిపిన ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ వేగంగా ఢీ కొట్టింది. కాగా, క్షతగాత్రులను ఎల్బీనగర్ రక్షా ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన రాధ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

సచివాలయం పరిధిలో నిషేధాజ్ఞలు



హైదరాబాద్, జనవరి 17(మనం ప్రతి నిధి): తెలంగాణ సచివాలయం చుట్టూ 3 కిలో మీటర్ల పరిధిలో ఆంక్షలను విధిస్తూ నగర పోలీసు కమిషనర్ వి.వి.శ్రీనివాస రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పరిధిలో బహిరంగ సభలు, ధర్నాలు, నిరసనలు, ఆందోళనలు, ర్యాలీలు, ఇతర సమావేశాలు, కర్రలు పట్టుకుని తిరుగ డం, నలుగురికి మించి గుంపులుగా నిల బడడంపై నిషేధం విధించారు. ఈ ప్రాం తంలో ఏదైనా కార్యక్రమాన్ని నిర్వహించా లంటే తప్పనిసరిగా పోలీసు అధికారుల నుంచి రాతపూర్వకంగా అనుమతి పొందా లని సూచించారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్య లు తప్పవని హెచ్చరించారు. ఈ నిషేధా జ్ఞలు జనవరి 19 ఉదయం 6 గంటల నుంచి మార్చి 18వ తేదీ వరకు అమల్లో ఉంటాయని సీపీ వి.వి.శ్రీనివాస రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి 'పల్లెపల్లెకు టీడీపీ'

హైదరాబాద్, జన వరి17 (మనం ప్రతి నిధి): తెలంగాణలో టీడీపీకి పునర్ వైభ వం తెచ్చేందుకు ఆ పార్టీ రాష్ట్ర నేతలంతా పల్లెబాట పట్టనున్నారు. గురువారం నుం చి ప్రారంభమయ్యే 'పల్లెపల్లెకూ టీడీపీ' కార్యక్రమంతో తెలుగు తమ్ముళ్ల ఇంటి ఇంటికీ తిరిగి కార్యకర్తల్లో ఉత్సాహం నిం పనున్నారు. ఈ కార్యక్రమంతో వచ్చే ఎన్ని కల్లో 119 అసెంబ్లీ స్థానాలు, 17 పార్ లమెంట్ స్థానాల్లో పోటీ చేయడానికి పార్టీ యంత్రాంగాన్ని సిద్ధం చేస్తామని టీటీడీపీ ఉపాధ్యక్షుడు రామావత్ లక్ష్మణ్ నాయక్ తెలిపారు. టీడీపీ చేసిన అభివృద్ధి, సం క్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ.. టీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండ గట్టాలని కార్యకర్తలకు ఆయన పిలుపుని చ్చారు. 14 ఏండ్లుగా రాష్ట్రంలో టీడీపీ అధికారంలో లేకున్నా ఐదొందల మందికి పైగా పార్టీ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారని ఆయన వెల్లడించారు.

మూగ యువతులపై అత్యాచారం

ఇంట్లోకి చొరబడి యువకుడి దారుణం

పినపాక, జనవరి 17(మనం న్యూస్): మండలంలోని ఇద్దరు యువతులపై అత్యాచారం చేసిన ఘటనపై ఏడూళ్ళబయ్యారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం పాండురంగాపురం గ్రామానికి చెందిన ముత్యం చంద్రయ్య అనే పశువుల కాపరి ఆదే గ్రామానికి చెందిన గంగాదరి సుజాత, సునీత అనే అక్కాచెల్లెల్లపై అత్యాచారానికి పాల్పడా డు. ఈ ఇద్దరు అక్కా చెల్లెలు మూగవారు కావడంతో విషయాన్ని ఎవరికీ చెప్పుకోలేరనే యోచనతో ఈ దారుణానికి తెగబడ్డాడు. అయితే, బాధితుల అమ్మమ్మ ఇది గమనించి బంధువులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఏడూళ్ళబయ్యారం పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

కాచిగూడలో గ్యాంగ్‌వార్



హైదరాబాద్, జనవరి 17: బైక్ విషయమై తలెత్తిన వివాదం కాస్తా దాడులు ప్రతి దా డులకు.. ఆపై వీధిపోరాటానికి దారితీసింది. పట్టపగలు నడి రోడ్డుపై రెండు గ్యాంగ్‌లు తలపడ్డాయి. గొడవకు దిగి పరస్పరం పిడి గుద్దులు విసురుకున్నాయి. ఒకరినొకరు లక్ష్యంగా చేసుకుంటూ రెండు గ్యాంగుల సభ్యులు కొట్టుకున్నారు. నగరం లోని కాచిగూడలో జరిగిన ఈ ఘటన సంచలనం రేపుతోంది. కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లో నడిరోడ్డుపై ఈ వీధి పోరాటం తీవ్రస్థాయిలో జరిగి నట్టు తెలుస్తోంది. ఈ ఘటనను చూసి స్థానికులు, బస్తీవాసులు హడలి పోయారు. ఒక బైక్ విషయంలో ఇరు వర్గాల మధ్య గొడవ జరిగినట్టు తెలుస్తోంది. చిన్న గొడవగా మొదలై.. దాడులు, ప్రతి దాడులు, ఇటు కలు, రాళ్లతో కొట్టుకోవడం వరకు వెళ్లిం దని స్థానికులు అంటున్నారు. ఈ ఘటనపై ఇరువర్గాలు కాచిగూడ పోలీ స్స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. నడిరోడ్డుపై ఇంతపెద్ద గొడవ జరి గినా.. పోలీసులు పెట్టీ కేసు పెట్టి చేతులు దులుపుకోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ గ్యాంగ్‌వార్‌లో అంబర్‌పేట్‌కు చెందిన ముగ్గురు రౌడీషీటర్లు కూడా ఉన్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘట నపై కఠినంగా వ్యవహరించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు పోలీసులను కోరుతున్నారు. ఈ ఘట నపై కాచిగూడ ఇన్‌స్పెక్టర్ సత్య నారాయణ స్పందిస్తూ.. బైక్ విషయం లో గొడవ జరిగిందని తెలిపారు. ఈ ఘటనలో రౌడీషీటర్లు కూడా ఉన్నా రన్న వాదనను ఆయన తోసి పుచ్చారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేసిన ఇరువర్గాలు తిరిగి రాజీ చేసుకు న్నారని, దీంతో పెట్టీ కేసు చేసి నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వీఆర్ఏ హంతకులను అరెస్టు చేయరా?

● సాయిలు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

● కిషన్‌రెడ్డి డిమాండ్.. రోడ్డుపై బైఠాయింపు



కామారెడ్డి, జనవరి 17 (మనం న్యూస్): వీఆర్ఏను హత్య చేసిన వారిని అరెస్టు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇసుక మాఫియాను ప్రోత్సహిస్తోందని బీజేపీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ఆరోపించారు. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కారెగాంనకు చెందిన వీఆర్ఏ సాయిలు మరణానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్, యజమానిని ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కామారెడ్డిలో ఆయన రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ సాయిలు కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకో వాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న కిషన్‌రెడ్డిని పోలీ సులు అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై ఆయనను విడిచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి బీజేపీ అధ్యక్షుడు బాణాల లక్ష్మారెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇట్టం సిద్ధిరాములు, మర్రిరాంరెడ్డి, మురళీధర్ గౌడ్, మోతె కృష్ణగౌడ్, బిజెవైయం నాయకులు జూలురి సుధాకర్, నీలం రాజులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెలవు నిబంధనలు

మార్చొద్దు

కడియంకు టీఎస్‌పీఆర్‌టీయూ వినతి

హైదరాబాద్, జనవరి 17(మనం ప్రతినిధి): ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు సాధారణ సెలవులు (సీఎల్) మంజూరుకోసం రూపొందించిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరు తూ ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరికి తెలంగాణ పీఆర్‌టీ యూ (ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్) నేతలు బుధవారం నాడు వినతిపత్రం అందజేశారు. విద్యాశాఖ సూచించిన పద్ధతిలో సీఎల్ మంజూరు చేసుకోవడం సాధ్యంకాదని, పాత పద్ధతిలో సాధారణ సెలవు మంజూరుకు అనుమతి ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం అధ్యక్షుడు పి.నరోత్తం రెడ్డి తదితరులు ఉన్నారు.

'స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించండి'



హైదరాబాద్, జనవరి 17(మనం ప్రతినిధి): దేశవ్యాప్తంగా ప్రభు త్వ పథకాల్లో పని చే స్తున్న 'స్కీం వర్కర్ల' కు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వా లని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి బీవీ విజయలక్ష్మి డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లకు కనీస వేతనం, పెన్షన్, పీఎఫ్ తదితరాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు పలుకార్మిక సంఘాల ఆధ్వ ర్యంలో బుధవారం రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు ప్రదర్శనలు చేపట్టారు. సీఐటీయు, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని వీఎస్టీ చౌరస్తా నుంచి సుందరయ్య పార్కు వరకు కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ఆశా ఎన్ హెచ్‌ఎం, సర్వశిక్షా అభియాన్ వంటి ప్రభుత్వ పథకాల్లో ఏండ్లుగా తమ శ్రమను వినియోగించుకుంటున్న ప్రభుత్వాలు ఇకనైన ఆయా పథకాల్లో పనిచేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనం రూ. 18 వేలతోపాటు ఈయస్‌ఐ, పీఎఫ్ అమలు చేయాలని కోరారు. ఆయా పథకాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారికి రూ.3 వేలు పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్, నర్సింహ్మా, స్వరూప, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

అందరి అభివృద్ధే లక్ష్యం

● స్పీకర్ మధుసూధనాచారి



భూపాలపల్లి, జనవరి 17(మనం ప్రతినిధి): భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలంగాణ శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. భూపాలపల్లిలోని నాగారంలో బుధవారం జరిగిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసిన ఆయన, పలువురు లబ్ధిదారులకు గొ ర్రెల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను చేతల మనిషిన ని, ఎన్నికల హామీలకు సంబంధం లే కుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి ప థంలో నడిపిస్తున్నానని, ప్రజలు గమనించాలిని అన్నారు. గతంలో నియోజ కవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేలు ప్రజలు తమ ఇంటి ప్రహరీలను దాటి లోనికి రానిచ్చేవారు కా దని, కాని తన ఇంటి తలుపులు ప్రజ ల కోసం ఎప్పుడు తెరచే ఉంటాయని పేర్కొన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు వచ్చే ఏడాదికి ఇళ్లు ఇప్పిస్తామని హా మీ ఇచ్చారు. భీమ్ ఘనపూర్ చెరువు నుంచి ఎత్తిపోతల ద్వారా ఇతర చెరు వులను నింపే కార్యక్రమాన్ని గతంలో ఎవ్వరూ చేయలేదని ఆయన గుర్తు చేస్తూ, ఈ ఘనత మాకు మాత్రమే దక్కుతుందని అన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఉచిత గొర్రెల పం పిణీ కార్యక్రమాన్ని చేపట్టలేదని, లబ్ధిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామం లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.40 లక్షలు కేటాయించినట్లు ప్రకటించారు. అదేవిధంగా గ్రామంలోని మసీదు అ భివృద్ధికి రూ.5లక్షలు కేటాయించినట్లు ప్రకటన చేశారు. అనంతరం గ్రామం లోని ప్రాథమిక పాఠశాలలో తాగునీటి పథకాన్ని ప్రారంభించారు.

మేడారం జాతరకు రండి!

- ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంత్రుల ఆహ్వానం
- జాతర పోస్టర్, సిడి ఆవిష్కరించిన సీఎం

హైదరాబాద్, జనవరి 17: మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు హాజరు కావాలంటూ సీఎం కేసీఆర్‌ను ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రి చందూలాల్ ఆహ్వానించారు. ఆలయ ట్రస్టు చైర్మన్ లింగయ్య, ప్రధాన పూజారి జగ్గారావు, ఇతర పూజారులతో పాటుగా బుధవారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా మేడారం జాతర పోస్టర్‌ను, సీడీని సీఎం ఆవిష్కరించారు. మేడారం జాతరకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించాలని మంత్రులను సీఎం కోరారు. ఈ సందర్భంగా మేడారం జాతర కోసం



చేసిన ఏర్పాట్లను సీఎం కేసీఆర్‌కు కడియం వివరించారు. '2016లో నిర్వహించిన జాతర సందర్భంగా మేడారం జాతరకు సీఎం 140 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. ఈసారి 80 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో భక్తులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశాం. ఈ సారి పనులను శాశ్వత ప్రాతిపదికన చేపట్టాము. భూపాలపల్లి, పస్రా, తాడ్వాయి నుంచి మేడారం వచ్చే 3 ప్రధాన రహదారులను డబుల్ లేన్ రోడ్లుగా మార్చాం. టాయిలెట్లు, బట్టలు మార్చుకునే గదులను శాశ్వత ప్రాతిపదికన నిర్మించాం. కొత్తగా హరిత హోటల్ నిర్మించాం. సమ్మక్క సారలమ్మ జాతరతో పాటు ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబించే మ్యూజియం ఏర్పాటు చేశాం' అని కడియం తెలిపారు.



డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ మాతృమూర్తి నేతి రాధమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీఎం కేసీఆర్



గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు





వైద్యానికి నిధుల పెంపు

(మొదటిపేజీ తరువాయి)

శాఖకు ఎక్కువ నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. ప్రస్తుతం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఎక్కువ నిధులు కేటాయిస్తున్నామని, ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత పేద ప్రజలకు అత్యవసరమైన వైద్యం, విద్య కోసమే అధిక నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. బుధవారం నెక్లెస్ రోడ్‌లో బుధవారం 102 వాహనాలు, బైక్ అంబులెన్సులను ప్రారంభించారు. అనంతరం గజ్వేల్ నియోజకవర్గంలోని తూప్రాన్‌లో 50 పడకల ఆసుపత్రిని ప్రారంభించారు. తదుపరి గజ్వేల్ లో నిర్మిస్తున్న 100 పడకల ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. ''గతంలో ప్రజా వైద్యం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. డబ్బులున్న వారు తమకు నచ్చిన పెద్దాసుపత్రుల్లో వైద్యం చేయించుకోగలరు. కానీ పేదవారికి ప్రభుత్వ ఆస్పత్రులే పెద్ద దిక్కు. కాబట్టి పేద ప్రజలను ద ష్టిలో ఉంచుకుని, వారికి మెరుగైన సేవలు అందించడానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. అన్ని రకాల వైద్య శాలల్లో సదుపాయాలు పెంచింది. 108, 102, 104 సర్వీసులను ఎంతో మెరుగుపర్చింది. కేసీఆర్ కిట్స్ లాంటివి గొప్ప పథకాలు అమలవుతున్నాయి. ప్రభుత్వ చిత్తశుద్ధికి తోడు వైద్య అధికారులు, సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తున్నారు. దీని వల్ల ప్రజలకు ప్రభుత్వ వైద్యశాలల పట్ల నమ్మకం పెరిగింది. ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగుల





సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రజల నమ్మకం నిలబెట్టేలా వైద్య ఆరోగ్య శాఖ భవిష్యత్తు కార్యాచరణ ఉండాలి. ఇప్పటి కన్నా పరిస్థితి మరింత మెరుగుపడాలే తప్ప తగ్గొద్దు. ప్రజావైద్యాన్ని మెరుగుపర్చడానికి అవసరమైన నిధులు కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా వుంది. వచ్చే ఏడాది బడ్జెట్ లోనూ వైద్య ఆరోగ్య శాఖకు నిధులు పెంచుతాం. పేదవారికి మెరుగైన వైద్యం, మంచి చదువు అందించడానికి మించిన ప్రాధాన్యం మరొకటి ఉండదు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలను అంచనా వేసి ప్రణాళిక రచించాలి. అందుకనుగుణంగా ప్రభుత్వం నిధుల కేటాయింపు చేస్తుంది. వైద్యశాలల నిర్వహణను వికేంద్రీకరణం చేయడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి. ఆయా ఆసుపత్రుల సూపరింటెండెంట్‌లకే నిర్వహణ బాధ్యతలు అప్పగించాలి. అందుకోసం నేరుగా వారికే నిధులు ఖర్చుపెట్టే అవకాశం ఇవ్వాలి'' అని అన్నారు.

గజ్వేల్‌లో 100 పడకల ఆస్పత్రి సందర్శన..

తూప్రాన్‌లో పర్యటన అనంతరం నేరుగా తన సొంత నియోజకవర్గ కేంద్రమైన గజ్వేల్‌కు వెళ్లిన సీఎం కేసీఆర్.. అక్కడ నిర్మిస్తున్న 100 పడకల ఆస్పత్రి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి లక్ష్మారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి శాంత కుమారి, మెడికల్ అండ్ హెల్త్ డైరెక్టర్ వాకాటి కరుణ, ఎంపీప్రభాకర్ రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి, మెదక్, సిద్దిపేట కలెక్టర్లు, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





సీఎం కేసీఆర్ బుధవారం బైక్ అంబులెన్సును ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే.. ఓ బైక్‌లో పెట్రోల్ అయిపోవడంతో మధ్యలోనే ఆగిపోయింది. దాంతో.. వెంటనే అక్కడున్న సిబ్బంది ఓ ఖాళీ బాటిల్‌లో పెట్రోల్ తీసుకొచ్చి ఇలా పోశారు.

తొలిసారి తూప్రాన్‌కు..

మెదక్ జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని తూప్రాన్ పట్టణంపై తన పర్యటన సందర్భంగా సీఎం కేసీఆర్ వరాల జల్లు కురిపించారు. సీఎం పదవిని చేపట్టిన తర్వాత తూప్రాన్‌లో సీఎం పర్యటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. రూ.11 కోట్లతో తూప్రాన్‌లో నిర్మించిన 50 పడ కల ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం సీఎం మాట్లాడారు. తూప్రాన్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 5 కోట్లు, షాదిఖానాకు రూ. 20 లక్షలు, ఖబరస్థాన్ ప్రహరీ నిర్మాణానికి రూ.15 లక్షలు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే, పెద్ద చెరువు సుందరీకరణకు, వైకుంఠధామం నిర్మా ణానికి అవసరమయ్యే నిధులను మంజూరు చేస్తామన్నారు.

స్థానిక ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు తూప్రాన్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. త్వరలో గజ్వేల్ నియోజకవర్గంలో రెండు రోజులు బస్సు యాత్ర చేస్తానని, సమస్యల న్నింటినీ పరిష్కరిస్తానని తెలిపారు. ప్రజాసేవలో ఉండడం వల్ల తూప్రాన్ రాలేకపోయాయని ముగించారు. ప్రజల ఆరోగ్యంపట్ల అవసరమయ్యే అన్ని హంగులతో 50 పడకల ఆస్పత్రికి నిర్మించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

జపాన్‌లో కేటీఆర్ పర్యటన

- పెట్టుబడులే లక్ష్యంగా వివిధ కంపెనీలతో భేటీ
- తెలంగాణలో అపార అవకాశాలు ఉన్నాయని వివరణ



హైదరాబాద్, జనవరి 17 (మనం న్యూస్): జపాన్‌లో రాష్ట్ర మంత్రి కేటీఆర్ పర్యటన బుధవారం ప్రారంభమైంది. దక్షిణ కొరియా పర్యటన ముగించుకుని నేరుగా టోక్యోకు చేరుకున్న కేటీఆర్ బృందం పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశమైంది. తొలుత జపాన్‌లో భారత రాయబారితో సుజన్ చినోయ్ తో పరిశ్రమల శాఖ మంత్రితో కేటీఆర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా ఈ పర్యటన చేస్తున్నట్లు, పెట్టుబడులతో పాటు పలు రంగాల్లో జపాన్ సాధించిన సాంకేతిక ప్రగతి, పారిశ్రామిక, వేస్ట్ మేనేజ్‌మెంట్ రంగాల్లో జపాన్ అనుసరిస్తున్న పద్ధతులను అదర్శంగా తీసుకుంటామని ఐ తొలుత జపాన్‌లో భారత రాయబారి సుజన్ చినోయ్‌తో కేటీఆర్ సమావేశమయ్యారు. జపాన్, తెలంగాణల మధ్య మరింత బలమైన అర్థిక, వ్యాపార భాగస్వామ్యాలను నెలకొల్పేందుకు సహకారం అందించాలని రాయబారిని మంత్రి కోరారు. ముఖ్యంగా జపాన్ ఆర్థిక సంస్థలు(జైకా వంటివి) తెలంగాణలోని పలు ప్రాజెక్టులకు ఇప్పటికే రుణ సహాయం అందించాయని, తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న మరిన్ని ప్రాజెక్టులకు ఈ ఆర్థిక భాగస్వామ్యాన్ని ఆశిస్తున్నట్లు, ఈ దిశగా రాష్ట్రానికి సహకారం కావాలన్నారు.

పన్నెండు సంస్థల ప్రతినిధులతో భేటీ

మంత్రి కేటీఆర్ బృందం 12 కంపెనీల ఉన్నతస్థాయి ప్రతినిధులతో సమావేశం అయింది. ముందుగా టకుమా కంపెనీ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి వేస్ట్ మేనేజ్‌మెంట్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు సగం పట్టణ ప్రాంతమని, పెరుగతున్న నగరీకరణ, పట్టణీకరణ నేపథ్యంలో తమ ప్రభుత్వం వేస్ట్ మేనేజ్ మెంట్ రంగానికి ప్రాధాన్యత ఇస్తుందని, ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వేస్ట్ మేనేజ్ మెంట్ పరిష్కారాల కోసం చూస్తున్నామన్నారు. ఈ విషయంలో టకుమ కంపెనీతో భాగస్వాములు అయ్యేందుకు సిద్దంగా ఉన్నామని తెలిపారు. ప్రముఖ ఇంజనీరింగ్ కంపెనీ జెయఫ్ఈకి చెందిన ఇజుమి సుగిబయాషితో మంత్రి సమావేశం అయ్యారు. మరో ప్రముఖ ఇంజనీరింగ్ కంపెనీ మినెబీయాతో చర్చలు జరిపారు. ఈ కంపెనీ ప్రపంచంలోని సూమారు 59 ప్రాంతాల్లో నుంచి తమ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. మినెబీయా కంపెనీ విస్తరణలో తెలంగాణ రాష్ట్రాన్ని పరిశీలించాలని కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఐయస్ఈ ఫూడ్స్ చైర్మన్ హికోనోబు ఐసె తో జరిగిన సమావేశంలో కోరారు. తెలంగాణలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఉన్న అవకాశాలను వివరించారు. మేయిజి షిఈకా ఫార్మా కంపెనీ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి, వ్యవసాయ, వెటర్నరీ మందుల తయారీ కోసం తెలంగాణకు రావాలని కోరారు. సుమిటోమో ఫారెస్ట్రీ కంపెనీ, టోరే ఇండస్ట్రీస్ వంటి పలు కంపెనీల ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు.



టీ హబ్‌కు అభినందనలు

జపాన్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ బృందంతో కేటీఆర్ భేటీ అయ్యారు. జపాన్ కంపెనీలు, ప్రపంచ ఇన్నోవేషన్ కమ్యూనిటీలను ఈ జపాన్ ఇన్నోవేషన్ నెట్ వర్క్ కలుపుతుంది. దీంతో కంపెనీలకు, ఇన్నోవేషన్‌కు మధ్య ఒక వారధిగా ఇది పనిచేస్తుంది. ఈ చర్చలో భాగంగా తెలంగాణ ప్రభుత్వ టీ హబ్, టీ ఫైబర్‌లను వారికి మంత్రి వివరించారు. ఈ రెండు కార్యక్రమాలకు నెట్ వర్క్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. మంత్రి వెంట తెలంగాణ ప్రభుత్వ సలహాదారు జి .వివేక్, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ ఇతర అధికారులున్నారు.

కృష్ణాలో నీళ్లేవి?

తెలంగాణకు గోదావరే దిక్కు.. మా వాటా మాకు ఇవ్వండి

- సమావేశంలో మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జనవరి 1(మనం ప్రతినిధి): కృష్ణా నదిలో రోజురోజుకు నీటి లభ్యత తగ్గిపోతున్నందున తెలంగాణకు గోదావరే దిక్కని మంత్రి హరీశ్‌రావు ఉద్ఘాటించారు. అంతరాష్ట్ర నదుల అనుసంధానం కార్యక్రమంలో కాళేశ్వరంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో చర్చించిన అనంతరం మంత్రి హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. నీటి లభ్యతకు సంబంధించి సీడబ్ల్యూసీ, ఎన్‌డబ్ల్యూడీఏ, రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులతో ఒక సాంకేతిక కమిటీని ఏర్పాటు చేయాలని కోరామని వెల్లడించారు. నదుల అనుసంధానంపై తెలంగాణ తరపునా తాము నాలుగు అభ్యంతరాలు కేంద్రం వద్ద ప్రస్తావించామని చెప్పారు. కేంద్రం లెక్క ప్రకారం 3వేల టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తుందని అంచనా ఉందన్నారు. ఒకవేళ అదే నిజమైతే నదుల అనుసంధానానికి తెలంగాణ అనుకూలమేనని ఆయన స్పష్టంచేశారు. గోదావరిపై కాళేశ్వరం ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. గోదావరిలో తెలంగాణకు 954 టీఎంసీల హక్కు ఉందని, అయినా ఉమ్మడి రాష్ట్రంలో ఈ నీటిని పొందే అవకాశం దక్కలేదని పేర్కొన్నారు. అందుకే సీఎం కేసీఆర్ నీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టారన్నారు. దేవాదుల ప్రాజెక్టు 100 టీఎంసీలతో వరంగ ల్‌ను సస్యశ్యామలం చేయబోతున్నట్టు ఆయన వెల్లడించారు. అంతర్‌రాష్ట్ర నదుల అనుసంధానానికి సీతారామ ప్రాజెక్టు నిదర్శనంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఖమ్మంలోని కృష్ణా ఆయకట్టుకు కూడా నీరందుతుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన 1600 టీఎంసీలు కేటాయించి, మిగిలిన నీటిని అనుసంధానం చేసుకోవచ్చునని అన్నారు. అక్కనపల్లిలో నీటిని మళ్లిస్తే సీతారామ ప్రాజెక్టుకు ఇబ్బంది కలుగుతుందన్నారు. కాళేశ్వరం, కంతనపల్లి అనుమతికి 40 ఏళ్ల సరాసరిని సీడబ్ల్యూసీ పరిశీలించిందని మంత్రి తెలిపారు. నదుల అనుసంధానానికి 110 ఏళ్ల సరాసరి తీసుకోవడం సరికాదని అన్నారు. నీటి లభ్యతపై సీడబ్ల్యూఎన్, ఎన్డబ్ల్యూడీఏ, రాష్ట్ర అధికారులతో కమిటీ వేయాలని ఆయన కోరారు. అయితే, కాళేశ్వరం ప్రాజెక్టు పనితీరును కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసించారని తెలిపారు.

వచ్చే ఏడాది నుంచి మామనూరు
వెటర్నరీ కాలేజీలో అడ్మిషన్లు

- అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి: కడియం

హైదరాబాద్, జనవరి 17 (మనం ప్రతినిధి): వచ్చే ఏడాది విద్యా సంవత్సరం నాటికి ములుగు జాకారంలో గిరిజన యూనివర్శిటీ, వరంగల్ లోని మామునూరులో వెటర్నరీ కాలేజీ ప్రారంభించాలని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. తెలంగాణలో కొత్త విశ్వవిద్యాలయాలు...కాలేజ్‌ల విషయంపై ఆయన బుధవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ రెండింటికి గానూ వచ్చే ఏడాది విద్యా సంవత్సరం జూన్ నుంచి తరగతులు ప్రారంభించేందుకు చేపట్టాల్సిన చర్యలపై వివిద శాఖల అధికారులతో కడియం సమీక్షించారు. కాగా, వచ్చే విద్యా సంవత్సరం నుంచి మామునూరు వెటర్నరీ కాలేజీలో అడ్మిషన్లు తీసుకోనున్నట్లు అధికారులు చెప్పారు. అందుకుగానూ అడ్మిషన్లు తీసుకునేందుకు వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు లెటర్ రాసిన విషయాన్ని అధికారులు కడియం శ్రీహరి దృష్టికి తీసుకొచ్చారు. వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధికారులు కూడా మామునూరు వెటర్నరీ కాలేజీని సందర్శించారని ఆయన అన్నారు. కాలేజీ కోసం 2016లో తెలంగాణ ప్రభుత్వం, పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ కాలేజీకి రూ.6 కోట్లకు అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఇచ్చారని కడియం తెలిపారు. ఆ తర్వాత కాలేజీ భవనాలు, మౌలిక వసతులు, ల్యాబ్‌ల నిర్మాణం కోసం తమ ప్రభుత్వం 2017లో రూ.109. 69 కోట్లు మంజూరు చేసిందన్నారు.

ఆంధ్రా బ్యాంక్

6-3-891 & 892, రాజ్‌భవన్ రోడ్డు, సోమాజిగూడ, హైదరాబాద్-500 082. ఫోన్: 040- 2342 1174, 2342 1177, ఫ్యాక్స్: 040-2342 1176. ఇ-మెయిల్ ఐడి: bmhydm1006@andhrabank.co.in

అమ్మకం గురించి తెలియజేస్తూ రుణగ్రహీతకు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 6(2) / 8(6))

[illegible] ... 8-2-684/2, ఫ్లాట్ నెం. 106 ... హైదరాబాద్-500033 ... 6-3-900/6-9, ఫ్లాట్ నెం. 203 ... హైదరాబాద్-500016 ... హైదరాబాద్- 500073 ... గుంటూరు-522006 ... 4-20-14/1 ... సర్వే నెం. 301, 302 & 303 ... 5-91-25, 4వ లేన్ ... 6-4-101, 4/2-3వ లేన్ ... [illegible]

01.01.2016 తేదీన సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీస్ ... [illegible] ... 14.12.2017 ... [illegible] ... రూ. 1,25,00,000/- ... [illegible] ... 01.01.2016 ... సెక్షన్ 13(8) ... [illegible]

షెడ్యూల్ ఆస్తి

[illegible] ... 914.16 ... సెక్టార్-12, ఫ్లాట్ నెం.7 ... ఫ్లాట్ నెం. 801 ... [illegible]

తేది : 30-12-2017
ప్రదేశం: హైదరాబాద్
సం/- ([illegible]), చీఫ్ మేనేజర్, అధీకృత అధికారి, ఆంధ్రా బ్యాంక్, స్పెషలైజ్డ్ కార్పొరేట్ ఫైనాన్స్ శాఖ

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
గురువారం, జనవరి 18

చెలిమే కలిమి


ఇజ్రాయెల్‌తో చెలిమి నరేంద్ర మోదీ ప్రభుత్వం వరంగా భావిస్తుంటే, వామపక్షాలు, ప్రజాతంత్ర శక్తులు శాపమని ఆక్షేపిస్తూ నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆరు రోజుల భారత పర్యటన వివాదాస్పదంగా తయారైంది. భారత్–ఇజ్రాయెల్ మైత్రీ బంధాన్ని నెతన్యాహు 'దేవుడు చేసిన పెళ్లి'గా అభివర్ణిస్తే, 'ఇరు దేశాలు మరెంతో సాధించాలన్న తపనతో కూడిన చర్చలు'గా మోదీ వ్యాఖ్యానించారు. 1992లో పీవీ నర్సింహారావు ప్రధానిగా ఉన్నపుడు ఏర్పడిన దౌత్య సంబంధాలు మోదీ హయాంలో పతాక స్థాయికి చేరుకున్నాయి. గత జులైలో ఇజ్రాయెల్‌లో భారత ప్రధాని పర్యటించినపుడు లభించిన స్వాగత సత్కారాలకు దీటుగా అధికారిక లాంఛనాలను సైతం పక్కనబెట్టి నెతన్యాహూకు అపూర్వ స్వాగతం చెప్పేందుకు నరేంద్ర మోదీ పరుగులు పెట్టారు. ఇజ్రాయెల్ ప్రధాని పర్యటన సందర్భంలోనే హజ్ సబ్సిడీని మోదీ ఎత్తివేయడం ఇరు దేశాల చెలిమికి కానుకలాగా కొందరు అభివర్ణిస్తున్నారు. ఇద్దరు ప్రధానుల ఆలోచనలూ, ఆశయాలూ, లక్ష్యాలూ ఒక్కటే కావడం ఈ మైత్రీ బంధం బలపడడానికి కారణమని భావించడం రాజకీయ అమాయకత్వమే అవుతుంది. మనుషులు చరిత్ర నిర్మాతలే అయినా వారు తమ ఇష్టం వచ్చినట్లు చరిత్రను నిర్మించలేరు. గతం నుంచి తమకు అందిన పరిస్థితుల నుంచి, పాదార్థిక, బౌద్ధిక అంశాల వారసత్వం నుంచి, సమకాలీన పరిస్థితులు కల్పించిన అవసరాలు, అవకాశాల ప్రేరణ నుంచి మాత్రమే వారు చరిత్రను నిర్మించగలరు. రెండు దేశాల్లోని రాజకీయ, ఆర్థిక విధానాలు ఏమైనప్పటికీ, భౌగోళిక ఆధిపత్య రాజకీయ వ్యూహంలో భాగంగా అమెరికాకు భారత్‌తో సాన్నిహిత్యం పెరగడం, ముస్లింల పట్ల ఒకే వైఖరి కలిగి ఉండడం అనేది భారత్–ఇజ్రాయెల్‌ల మైత్రి బంధానికి ప్రధాన ప్రాతిపదికగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో యూదు జాత్యహంకార పాలకులకు, మెజారిటీ మతతత్వ ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత పాలకులకు మధ్య సహజమైత్రి ఏర్పడడం ఊహించినదేనని వామపక్షీయులు వాఖ్యానిస్తున్నారు.

నెతన్యాహూ పర్యటన సందర్భంగా రెండు దేశాల మధ్య సైబర్ సెక్యూరిటీ నుంచి హోమియోపతి పరిశోధన వరకూ కుదిరిన ఒప్పందాలు ఏమంత కీలకమైనవి కావు. అయితే ఇరుదేశాల మధ్య వ్యవసాయం, సైన్స్, టెక్నాలజీ, డిఫెన్స్, సెక్యూరిటీ, నవీకరణ ఇత్యాది రంగాల్లో ఇప్పటికే కుదిరిన ఒప్పందాలు అమలు, కానసాగింపు చకచకా సాగిపోతున్నాయి. వ్యవసాయం, జల సంరక్షణ, ఆరోగ్యం అంశాల్లో నవీకరణ కోసం సాగుతున్న ఉమ్మడి భాగస్వామ్య ప్రాజెక్టులు ముందుకు పోతున్నప్పటికీ వాణిజ్యంలో మరింత పురోగతి సాధించాలన్న లక్ష్యంతో నెతన్యాహూతో పాటు ఇజ్రాయెల్ పారిశ్రామికవేత్తల బృందం మన దేశం వచ్చింది. వ్యవసాయం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, రక్షణ రంగాలకు సంబంధించి 9 కీలక ఒప్పందాలు జరిగాయి. అదే సమయంలో స్వేచ్ఛాయుత విదేశీ ప్రత్యక్ష మదుపులు (ఎఫ్‌డీఐ) పెట్టవలసిందిగా నరేంద్ర మోదీ ఆహ్వానించడంపై ఇజ్రాయెల్ పారిశ్రామికవేత్తలు సానుకూలంగా స్పందించారు. ఇజ్రాయెల్ రాజధానిగా జెరూసలేంను గుర్తించాలని అమెరికా ప్రతిపాదనను ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో భారత్ వ్యతిరేకించడం, ఇజ్రాయెల్ యుద్ధ విమానాల కొనుగోలు నిర్ణయాన్ని మోదీ ప్రభుత్వం ఉపసంహరించుకున్న నేపథ్యంలో నెతన్యాహూ భారత్ పర్యటన అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.

చైనా భౌగోళిక రాజకీయ, ఆర్థిక దూకుడు ధాటికి తట్టుకోవాలంటే అంతర్జాతీయంగా బలమైన ఆర్థిక శక్తి అండదండల కోసం ఎదురు చూస్తున్న భారత్‌కు, అమెరికా తప్ప మరొక దేశమేదీ అండగా దొరకలేదు. అదే సమయంలో అంతర్జాతీయంగా ఈయూ, రష్యా దేశాల అండతో తన ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ ఒక నూతన సామ్రాజ్యవాద శక్తిగా ఎదుగుతున్న చైనాను అడ్డుకునే 'తూర్పు ప్రాధాన్యం' అనే విధానం అమలుకు ఆసియా దేశాలలో భారత్ తప్ప అమెరికాకు వేరే గత్యంతరం లేదు. అమెరికా, భారత్ దేశాల ఉమ్మడి అవసరాల నేపథ్యంలో భౌగోళిక రాజకీయాలలో సంప్రదాయక వైఖరిని విడనాడవలసిన పరిస్థితి. దాంతో అమెరికా పాక్‌తో తెగదెంపులు చేసుకొని భారత్‌ను తన ప్రాంతీయ ప్రతినిధిగా ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగానే ఇజ్రాయెల్‌తో భారత్ మైత్రి సాకారమైంది. స్వాతంత్ర్యానంతర ప్రపంచ పరిస్థితులు, దేశ అవసరాల నేపథ్యంలో అమెరికాపై నెహ్రూకు ఎంత మోజున్నప్పటికీ సోవియట్ రష్యా అగ్రరాజ్యంతో చెలిమి చేయక తప్పని పరిస్థితి. ఇందిరా గాంధీ హయాంలో భారత్–రష్యాల చెలిమి పరాకాష్ఠకు చేరింది. సోవియట్ రష్యా–అమెరికా అగ్రరాజ్యాల మధ్య సాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధకాలంలో ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా పాలస్తీనా విమోచన వైఖరిని భారత్ బలపరిచింది. అయితే సోవియట్ అగ్రరాజ్యం కుప్పకూలి అమెరికా ఏక ధ్రువ ప్రపంచ పరిస్థితుల్లో పీవీ హయాంలో అమెరికాను ప్రసన్నం చేసుకోవడంలో భాగంగా ఇజ్రాయెల్‌తో చెలిమి చేయవలసిన అగత్యం ఏర్పడింది. అప్పటి నుంచి మారిన భౌగోళిక రాజకీయ సమీకరణల్లో భాగంగా చైనాకు ప్రధాన పోటీదారుగా ఎదిగేందుకు అంకుల్ శాంను భారత్ ఆశ్రయించింది.


అయితే ప్రపంచ ఆర్థిక సంక్షోభంతో అగ్రరాజ్యంగా అమెరికా బలహీనపడటంతో భారత్ అంతర్జాతీయంగా తన ఆర్థిక అవసరాల నేపథ్యంలో జెరూసలేం రాజధానిగా గుర్తించడం వంటి అంశాల్లో స్వతంత్రంగా వ్యవహరిస్తున్నట్లు కనపడినా, ఆచరణలో అమెరికాతో వాణిజ్య, రాజకీయ సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటోంది. ఆఫ్ఘనిస్థాన్ తదితర దక్షిణాసియా దేశాల్లో అమెరికా భౌగోళిక రాజకీయ ప్రతినిధిగా భారత్ క్రియాశీలంగా వ్యవహరిస్తున్నది. ఇజ్రాయెల్ నుంచి ఆయుధాల కొనుగోలు, సైబర్ భద్రత, అంతరిక్షం, చమురు, సహజ వాయురంగాల్లో సహకారం వంటి పలు ఒప్పందాల ద్వారా గట్టిపడిన చెలిమి భారత్‌కు ఆర్థికం లాభసాటిగా మారుతుందనడంలో సందేహం లేదు. అయితే అంతర్జాతీయంగా అమెరికా, ఇజ్రాయెల్‌ను వ్యతిరేకిస్తున్న మిలిటెంట్ రాజకీయ ఇస్లామిక్ వర్గాల్లో భారత్‌పై కూడా వ్యతిరేకత పెరిగే అవకాశమూ లేకపోలేదు. కొన్ని చెలిములు కలిమిని కలిగించినా దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా ఒకింత అప్రమత్తంగా ఉండక తప్పదు.

రుద్రనేత్రుడు



విధి పగబూని – జీవితాన్ని
కష్టాలకు అక్షయపాత్రగా మారుస్తూన్నా
చలించని ధైర్యపర్వతుడు పేదవాడు!
నిత్య జీవనపోరాటంలో
అనుక్షణం గాయపడుతూన్న
క్షతగాత్రుడు – పేదవాడు!
అయినా – ఎప్పుడూ అలసిపోకుండా
తాను ఎదురుకొనే ప్రతీసమస్యను
తన తీక్షణ సంకల్ప దీక్షతో భస్మం చేస్తూ
ముందుకే నడుస్తున్న రుద్రనేత్రుడు పేదవాడు!

– **రఘువర్మ**, జగిత్యాల
9290093933



మంచిమాట



'ఒక లక్ష్యం కోసం ఒకవ్యక్తి మరణించవచ్చు. అయితే, అతని మరణం తరువాత మరో వేయి జీవితాల్లో ఆ లక్ష్యం పునరుజ్జీవం పొందుతుంది.'

- సుభాష్ చంద్రబోస్


అసలు సిసలు పాలకుడు

'జన సంరక్షణకు ఎంత ప్రాధాన్యత ఇస్తాడో జలరక్షణకు కూడా అంతే ప్రాధాన్యతనిచ్చిన వాడు అసలు సిసలు పాలకుడు' అని ఆకాలంలోనే 'వేమన' చెప్పిన మాటలు సజీవ సత్యాలు. 'భవిష్యత్తు జగడాలు జలం కోసమేనన్న' ఐరాస వ్యాఖ్యలు అప్పట్లో ఆశ్చర్యానికి గురిచేసినా నేడు అది నిత్యకృత్యమైపోయింది. ముఖ్యంగా రెండు దశాబ్దాల క్రితం వరకు కాసింత మట్టి(ఇసుక) తొలగిస్తేనే 'చెలిమెల' నుంచి ఉబికి వచ్చిన జలం నేడు వందల నుంచి వేల ఫీట్లు లోనికి వెళ్లినా చుక్కనీరు కానరాని పరిస్థితి నిజంగా ఘోరం. 'ప్రకృతి మనిషి అవసరాలను తీర్చగలదే కానీ మనిషి కోరికలు తీర్చలేదు' అన్న మాటలు పెడచెవిన పెట్టి ఆధునికత ప్రభావంతో భవిష్యత్ తరాలపై ప్రభావం లెక్కచేయక ప్రకృతి ప్రసాదించిన చక్కటి అవకాశాన్ని మనిషి చేస్తున్న అనేక తప్పుల ఫలితంగా నేడు చుక్కనీరుకై పోరు చేయాల్సిన దుర్భర పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

వాస్తవానికి పారిశ్రామికీకరణ ఫలితంగా కాలుష్యం పెరగడం సహజమే అయినా ఇబ్బడిముబ్బడిగా పరిశ్రమల స్థాపన, వ్యర్థ పదార్థాల తొలగింపుపై అలసత్వం, క్షీణిస్తున్న అడవులపై దృష్టి పెట్టకపోవడం, అంతా 'కాంక్రీట్ జంగిల్'గా మారిన నగర జీవనం, విచ్చలవిడిగా భూకబ్జాలు, మితిమీరిన ప్లాస్టిక్ వినియోగం, మోటారు వాహనాల ద్వారా విడుదలవుతున్న కాలుష్యం, వ్యర్థాల నిర్వహణ లోపం, నగరాలకు జలవసతిని కల్పించే నగరపు నీటి వనరులను మాయం చేసేశాయి. గతంలో దరిదాపుగా '1000 చెరువులు/సరస్సులు (చిన్నా పెద్దా జలవనరులు) కల నగరంగా' విలసిల్లిన మన 'భాగ్యనగరం' నేడు వేళ్లతో లెక్కించే స్థాయికి చెరువుల సంఖ్య కుచించుకుపోయింది.

మరొకవైపు గ్రామాలలో కూడా చెరువుల నిరాదరణ, పూడిక పేరుకు పోవడం, మరమ్మతులపై అలసత్వం, నిర్మాణ లోపాలు, చెరువుల భూముల ఆక్రమణ, వాగులలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు, చెరువులకు నీరు తెచ్చే నీటి ప్రవాహ మార్గాల ఆక్రమణ, చెరువులను మట్టితో నింపేయటం, వరద నీటికి అడ్డు కట్టలు, సమర్థ నీటి యాజమాన్యం లేకపోవడం, వంటచెరుకుకే కా కుండా అటవీ వనరులు ఆర్థిక లాభాల దృష్ట్యా అమ్మేయడం, అటవీ (చెట్ల) సంరక్షణపై నిర్లిప్తత, భూగర్భ జలసంరక్షణకు కార్య క్రమాలు చేపట్టక పోవడం, వాటర్షెడ్ కార్యక్రమాలు సక్ర మంగా నిర్వహించకపోవడం, రియల్ ఎస్టేట్ విస్తరణ, గుట్టల వాలులపై చిన్న నీటి పథకాలు అమలు చేయక పోవడం, భూగర్భజలంపై విపరీతంగా ఆధారపడాల్సిన దుస్థితికి రైతులను నెట్టివేయడం లాంటి వాటి ఫలితంగా ఉపరితల నీరే కాకుండా భూగర్భజలం సైతం దొరకని దుస్థితి నేడు పల్లెల్లో దాపురించింది. వేసవికాలం వచ్చిం దంటే చాలు అష్టకష్టాలు పడైనా నీరు దొరకబుచ్చుకోవా లని పట్టణాల్లో అయితే బస్తీల్లో, పల్లెల్లో మహిళలకు జల జగడాలు షరా మామూలే.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక రాజుల కాలం నాడు దూరదృష్టితో తవ్విన చెరువుల అభివృద్ధికై 'కాకతీయుల' పేరు స్ఫురించేలా చెరువుల అభివృద్ధికి 'మిషన్ కాకతీయ' పథకం చేపట్టడం హర్షణీయమే అయినా భూగర్భ జలసంరక్షణకు, చిన్న నీటి వనరుల సంరక్షణకు, పడిన ప్రతి చుక్కనీటి బొట్టును ఒడిసిపట్టేలా కార్యక్రమాన్ని మరింతగా మార్చితే సమర్థ నీటి సంరక్షణ జరిగి భవిష్యత్తు తరాలకు భరోసా ఏర్పడుతుంది. అలాగే సాధారణంగా వ్యాపిస్తున్న రోగాలలో ఎక్కువ శాతం అపరిశుభ్రమైన జల వాడకం ద్వారానే వ్యాపిస్తున్నాయనే విషయాన్ని గమనంలోకి తీసుకుని ప్రతి ఇంటికీ పరిశుద్ధ జలపంపిణీకై చేపట్టిన 'మిషన్ భగీరథ పథకం' కూడా ఫలితాలకు దగ్గరలోనే ఉన్నది. దీనితో



> భూగర్భ జలాల పెంపు, వనసంరక్షణ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించటం, నీటి కాలుష్యం తగ్గించే మార్గాలు, నీటి ప్రవాహ మార్గాల రక్షణ, కాలుష్యం తగ్గుదలకు కృషి చేయడం ద్వారా భావి తరాలకు భరోసా ఉండేలా తక్షణం చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వంపైనే భారం వేయకుండా ప్రజలు, మేధావులు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా సంస్థలు బాధ్యతాయుతంగా ఆలోచించి అందరూ సమిష్టిగా కృషిచేస్తే పాతాళ గంగ పైకి ఉబికి రావడం ఖాయం.

పాటుగా ప్రకృతి పరిరక్షణ కార్యక్రమం అయినటువంటి 'హరితహారం' కార్యక్రమం కూడా అత్యవసరమే అయినప్పటికీ ప్రజలలో మరింత అవగాహన రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వాస్తవానికి మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, హరితహారం లాంటి భవిష్యత్ తరాలకు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలను మిళితం చేసి సమన్వయంతో గ్రామగ్రామాన ప్రకృతి ప్రేమికులను 'ప్రకృతి మిత్ర' పేరుతో నియామకాలు చేపట్టాలి. వీరిని ఇతర శాఖలతో సమన్వయ పరుస్తూ ప్రకృతి సంరక్షణ చర్యలైన ఇంకుడు గుంతల తవ్వకం, వరద నీటి సంరక్షణ, చెట్ల సంరక్షణ లాంటి చర్యలు అప్పచెప్పాలి. వీరికి భూగర్భ జలమట్టం పెంపు, పెరిగిన వన(చెట్ల) సంరక్షణ ఆధారంగా ప్రోత్సాహకాలు, వేతనాల పెంపు ఉండేలా చర్యలు తీసుకోవాలి. వీటిపై నిరంతర పర్యవేక్షణ, ప్రజలకు అవగాహన కల్పన, భవిష్యత్ అవసరాల అంచనాలు, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేలా వ్యూహాలు, ప్రజలతో మమేకం కావడం లాంటి వాటితో పాటుగా వ్యవసాయ, రెవెన్యూ, వైద్య అధికారులతో కలిసి వ్యవసాయంలో రసాయనాలను, క్రిమి సంహారకాల వినియోగాన్ని తగ్గిస్తూ సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లేలా, వ్యాధుల నివారణపై అవగాహన పెరిగేలా కృషి చేయాలి. వీరికి ఉత్సాహవంతులైన గ్రామీణులను కూడా కమిటీలుగా ఏర్పరిచి వారి సహకారంతో (గంగ దేవిపల్లి మాదిరిగా) ముందుకు పోవాలి.

అలాగే విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు మరింత బాధ్యత గుర్తు చేసేలా నీటి సమర్థ వాడకం, నీటిని వృధా కానీయకపోవటం, వనసంరక్షణ – ప్రయోజనాలు, జలచక్రం ప్రక్రియ వివరంగా వివరించడం, ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా లాభాలు వంటి అంశాలపై అవగాహన పొంది బావిభారత పౌరునిగా తన విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చేలా పాఠశాలల నుంచి మరింత తర్ఫీదు ఇవ్వాలి. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు వారు పైవిషయాల గురించి బోధించేలా విద్యార్థులకు ప్రేరణ ఇవ్వాలి. అంతేగాకుండా జూలై మాసాన్ని వాననీటి సంరక్షణ మాసంగా ప్రకటించి వ్యాసరచన వక్తృత్వ పోటీలు లాంటివి జల సంరక్షణ అంశాన్ని ప్రాతిపదికగా చేసుకొని నిర్వహించాలి. సమాజంలో కూడా జల సంరక్షణ కోసం ఆలోచించే వారి నుంచి రచనలను ఆహ్వానించి వారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలి. రైతులకు ఫాంపాండ్ (నీటికుంటలు) నిర్మాణాలకు మరింత ప్రోత్సాహకాలు అందించైనా తప్పనిసరి చేయాలి. ప్రభుత్వాలు కూడా శాశ్వత ప్రాతిపదికన ఆలోచించి చిన్న నీటి వనరుల సమర్థ నిర్వహణకు 'రాజస్థాన్' రాష్ట్రం మాదిరిగా ప్రాధా న్యతనిచ్చి భవిష్యత్లో రాష్ట్రంలో మరల 'చెలిమెల' కాలం వచ్చేలా కృషి చేయాలి. సమైక్య పాలనలో సకల గోసలు పడ్డ తెలంగాణ రైతాంగానికి అవసరమైన నాణ్యత కలిగిన విద్యుత్ సరఫరా అదీ నిరంతరాయంగా 24 గంటలు సరఫరాకు ప్రభుత్వం తీసుఉకున్న చర్యలు హర్షణీయమే అయినప్పటికీ భూగర్భ జలాల ఆధారంగా నడుస్తున్న తెలంగాణ (అధికంగా) సేద్యంపై దాని ప్రభావంపై ప్రభుత్వం మరింత లోతుగా ఆలోచన చేయాలి . భూగర్భ జలాల పెంపు, వనసంరక్షణ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించటం, నీటి కాలుష్యం తగ్గించే మార్గాలు, నీటి ప్రవాహ మార్గాల రక్షణ, కాలుష్యం తగ్గుదలకు కృషి చేయడం ద్వారా భావి తరాలకు భరోసా ఉండేలా తక్షణం చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వంపైనే భారం వేయకుండా ప్రజలు, మేధావులు, స్వచేంద సంస్థలు, మీడియా సంస్థలు బాధ్యతాయుతంగా ఆలోచించి అందరూ సమిష్టిగా కృషిచేస్తే పాతాళంలో ఉన్న గంగ పైకి ఉబికి రావడం ఖాయం.

◆ **వినోద్‌కుమార్ సుద్దాల**
రీసెర్చ్ స్కాలర్, ఉస్మానియా యూనివర్సిటీ
9908312949

'హజ్' సరే...మరి 'మేళాల' మాట?

మత వివక్ష లేదంటూనే ఒక మతాన్ని ఒకరకంగాను, మరో మతాన్ని మ రో రకంగాను చూసేందుకు కేంద్ర, ఆ యా రాష్ట్రాలు వివక్షను పాటిస్తున్నాయి. ముస్లింలను బుజ్జగించేందుకే హజ్‌యాత్రకు ప్రభుత్వం సాయంచేస్తోందనే ఆరోపణలను తరచుగా బీజేపీ నేతలు చేస్తున్న నేపథ్యంలో హజ్‌యాత్రకు అందించే సబ్సిడీని రద్దుచేస్తున్నామని కేంద్రం ప్రకటించింది. మరోవైపు మరికొ న్ని మతాలకు (ముఖ్యంగా హిందువులకు) పండుగలకు, తీర్థయాత్రలకు సాయాన్ని మాత్రం రద్దుచేయలేదు. సబ్సిడీని రద్దుచేసినప్పటికీ ఈ ఏడు 1.75 లక్షల మంది ముస్లింలు హజ్‌యాత్రకు వెళ్తున్నారని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ముక్తార్ అబ్బా స్ నఖ్వీ ప్రకటించారు. భారత్ నుంచి నౌకల ద్వారా హజ్ యాత్రను సౌదీ అరేబియా ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిందని, ఈ అంశంపై త్వరలో చర్చలు జరపనున్నామని ఆయన చెప్పారు. ఎలాంటి బుజ్జగింపులతో సంబంధం లేకుండా మైనారిటీలు మరింత గౌరవంగా స్వయంప్రతిపత్తితో జీవిం చేందుకు వీలుగా సబ్సిడీ రద్దుపై తీసుకున్న విధాన నిర్ణయమని ఆయన వివరించారు. ఆరేళ్ల క్రితం అత్యున్నత న్యా యస్థానం ఇచ్చిన తీర్పు మేరకు ప్రభు త్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. 2012లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హజ్‌యాత్ర సబ్సిడీని రద్దుచేయాలని సుప్రీంకోర్టు రాజ్యాంగ బెం చ్ ఆదేశాలను తాము అమలుచేశామని ఆయన చెప్పారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులపై ఉన్నతస్థాయి కమిటీచేసిన సిఫార్సుల మేరకు హజ్ యాత్రకు సబ్సిడీలను నెమ్మదినెమ్మదిగా రద్దుచేయాలని ప్రభుత్వం కొత్త విధానాన్ని రూపొం దించిందని ఆయన అన్నారు. హజ్‌యా త్ర సబ్సిడీల్లో ఎక్కువ భాగం విమానయాన సంస్థ భరిస్తోంది. హజ్ యాత్ర సబ్సిడీల్లో ఎన్నో అంశాలున్నాయని, సబ్సిడీలనేవి కేవలం కంటితుడుపు చర్యలు మాత్రమేనని చాలామంది భావిస్తారు. ఈ యాత్రికులకు ఇచ్చే సబ్సిడీలో భాగంగా తిరుగు టికెట్‌ను 45వేల రూపాయలకు ఇస్తారని, న్యూ ఢిల్లీ నుంచి జెడ్డాకు టికెట్ వెల 30వేల రూపాయలు మాత్రమే ఉందని, ఇక హజ్ యాత్రికులకు లభించే సబ్సిడీ ఏముంది? విమానాల్లో వెళ్లే వారికి సబ్సిడీ ఇస్తున్నామని ప్రకటించడంలో అర్థమేమిటనేది ప్రశ్న. 2016–17లో హజ్ యాత్రకు కేంద్రం 450 కోట్లు కేటాయించింది. పదేళ్లలో దశల వారీగా సబ్సిడీలను రద్దుచేయాలని సుప్రీం కోర్టు ప్రకటించిన 2012 నుంచి సబ్సిడీ మొత్తం తగ్గుతూ వస్తోంది. వాస్తవానికి సబ్సిడీని రద్దుచేయాలని అఖిల భారత ముస్లిం–ఏ–ఇత్తేహాదుల్ ముస్లిమీన్ నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ ఎప్పటినుంచో డిమాండు చేస్తున్నారు. అదే మతానికి చెందిన ఆడపిల్లల చదువులు కోసం మరిన్ని పాఠశాలలను, హాస్టళ్ల ఏ ర్పాటు, ఇతర సామాజిక కార్యక్రమాల కు ఈ సబ్సిడీ మొత్తాన్ని ఖర్చుచేయాల ని ఆయన సూచించారు. హజ్ యాత్రి కులను తరలించడంలో ఎయిర్‌ఇండి యా గుత్తాధిపత్యాన్ని నిరోధిస్తే సమస్య పరిష్కారం కాగలదని ఒవైసీ తదితర ముస్లిం మేధావులు అభిప్రాయపడుతున్నారు. 'హజ్ యాత్రల కోసం తక్కువ రేట్లకు గ్లోబల్ టెండర్లను ఆహ్వానిస్తే మరింతమంది హజ్ యాత్ర చేసే అవకాశాలుంటా'యని ఒవైసీ చెబుతున్నారు. ఇదే సమయంలో కుంభ్ మేళా కు, ఇతర పండుగలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దమొత్తంలో నిధులు ఖ ర్చుచేయడం గమనార్హం. వివిధ హిం దూపండగలకు, తీర్థయాత్రలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చుచేస్తున్న ప్రజాధనానికి ప్రజల పరిశీలన నుంచి ప్రభుత్వాలు తప్పించుకున్నాయి. అలహాబాద్‌లో కుంభమేళా కోసం 2014లో 1500 కోట్లు కేంద్రం ఖర్చుచేయగా మ హారాష్ట్ర 2500 కోట్లు కేటాయించింది. సింహస్థ మహాకుంభ్ కోసం మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి వంద కోట్ల రూపాయలు కేంద్రం కేటాయించింది. 2016లో ఈ కుంభ్‌మేళ కోసం మధ్యప్రదేశ్ ప్రభుత్వం దాదాపు 4500 కోట్లు ఖర్చుచేసింది. ఇప్పుడు ఈ మొత్తాన్ని 5000 కోట్లకు పెంచాలని నిశ్చయించింది. హిమాలయాల ద్వారా టిబెట్‌లోకి సాగే కైలాస మానస సరోవర యాత్రకు కేం ద్రం చెప్పుకోదగిన మొత్తాన్ని ఖర్చుచేస్తోంది. కైలాస మానవసరోవర్ యా త్ర కోసం టిబెట్, చైనా వెళ్లే యాత్రికులకు ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ ప్రభుత్వం 50 వేల రూపాయలు మంజూరుచేసింది. ప్రస్తు త ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ఈ మొత్తాన్ని లక్ష రూపాయలకు పెం చారు. ఈ సహాయాలను కూడా న్యా యస్థానాలుగానీ, ప్రభుత్వాలుగానీ రద్దుచేస్తాయా? ఆంధ్రపదేశ్ ప్రభుత్వం కృష్ణ, గోదావరి పుష్కరాలకు, ఉత్తరాఖండ్ ప్రభుత్వం కన్వర్‌యాత్రకు, హర్యానా ప్రభుత్వం గీతాఫెస్టివల్‌కు ఖర్చుచేస్తున్నాయి. ఇన్ని ఖర్చులు చేస్తుండగా హజ్ యాత్రకు ఖర్చుచేసినంత మాత్రాన ప్రభుత్వ ఖజానా ఏమీ తరగిపోదు.



◆ **గౌరవ్ వివేక్ భట్నాగర్**
(ద వైర్ సౌజన్యంతో)

సినీరంగ సామ్రాజ్యంలో మకుటంలేని మహారాజుగా వెలు గొందిన 'నటరత్న' తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో రాజకీయ రంగప్రవేశం చేసి, తెలుగుదేశం పార్టీని స్థాపించి, నవమాసాల్లో అధికారంలోకొచ్చి, సంచలనం సృష్టించిన 'విశ్వవిఖ్యాత'. పౌరా ణిక, జానపద, సాంఘిక చిత్రాల్లో జీవించి, అవార్డుల రివార్డులకే వన్నెతెచ్చి దైవపాత్రల పోషణలో మరెవరూ తనకు సాటిరారని నిరూపించుకున్న 'నటసార్వభౌమ'. కోట్లాది అభిమానుల ఆరాధ్య దైవంగా దశాబ్దాలపాటు ధ్రువనక్షత్రంగా వెలుగొందిన 'యుగ పురుషుడు'. కంచుకంఠంతో అనర్గళ డైలాగులతో, వాగ్ధాటితో ఆంధ్రులను అలరింపజేసి ఆకట్టుకున్న 'కళాబ్రహ్మ'. తెలుగు చలన చిత్ర పరిశ్రమకు ప్రపంచ సినీరంగంలోనే విశేష ఖ్యాతినార్జించి పెట్టిన 'పద్మశ్రీ'. దేశభక్తిపూరిత చిత్రాలతో తెలుగు తెరపై కాంతులు విరజిమ్మిన 'అవతారపురుషుడు'. రాముడైనా, కృష్ణ డైనా, శివుడైనా, దుర్యోధనుడైనా, రావణుడైనా, కర్ణుడైనా, వివేకానందుడైనా, అల్లూరి సీతారామరాజైనా... ఇలా ఏ పాత్రనైనా సునాయాసంగా పోషించి




నేడు ఎన్టీఆర్ వర్ధంతి

తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక 'నందమూరి'

నటనకే భాష్యం చెప్పిన 'ధీరోధాత్తుడు'. అడవిరాముడైనా, కొండవీటి సింహమైనా, జస్టిస్ చౌదరైనా, బొబ్బిలి పులైనా, మేజర్ చంద్రకాంతైనా, పాపారాయుడైనా... అన్ని పాత్రలలో తెలుగు ప్రేక్షక హృదయాంతరంగాలను మెప్పించి ఒప్పించిన 'మేరు నగధీరుడు'. పాలనలో సమర్థత చూపి, ప్రజాస్వామ్యానికి ఊపిరులూది, బడుగు, బలహీనవర్గాల సంక్షేమ కాంక్షతో పాలనా వ్యవస్థలో తిరుగులేని సంస్కరణలు ప్రవేశ పెట్టిన 'మచ్చలేని చందమామ'. కొమ్ములు తిరిగిన రాజకీయ ఉద్దండులనే విస్మయపరచి, అటు సినీవినీలాకాశంలో, ఇటు రాజకీయ క్రీడలో ఎదురులేని స్టార్‌గా, లీడర్‌గా, లెజెండ్‌గా, వెండితెర వేల్పుగా, పొలిటికల్ లయన్‌గా పేరొందిన తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డ 'అన్న' నందమూరి తారక రామునికి శతసహస్ర వందనాలు..! అంద చందాలతో అశేష ప్రేక్షక లోకాన్ని అలరించిన 'అవతార పురుషుడు'. తెలుగు చలన చిత్రసీమలో ఏకైక 'మహాదిగ్గజం' ఎన్టీఆర్‌కు అర్పిద్దాం నీరాజనాలు..!! ఆయన నట నాజీవితం అపురూపం.. అద్భుతం.. అనిర్వచనీయం.. ఆదర్శవంతం.. ఆచరణీయం... ఆయన సినీప్రస్థాన పర్వం అఖిలాంధ్రుల హృదయాల్లో శాశ్వతం. అందుకే ఆ 'మహా మనీషి'కి ఇదే అక్షర నీరాజనం..!!!

◆ **ఎస్.వి.కె. ప్రసాద్**
నెల్లూరు.
9347104125


ఒక్క చాన్స్ ఇవ్వరూ!



కనివినీ ఎరుగని స్టైల్లో చారిత్రాత్మక కథను తెరకెక్కించే ప్రయత్నంపై మొదలైన వివాదం చినికి చినికి గాలివానలా మారింది. మనదేశంలో భావప్రకటన స్వేచ్ఛ ఉందా లేదా? అనే అనుమానాలను రేకెత్తించేలా, సినిమాలపై కూడా రాజకీయ పార్టీల పెత్తనమేంటనే అంశంపై సాగుతున్న వివాదంపై గురువారం సుప్రీంకోర్టు విచారించనుంది. ఈనేపథ్యంలో అసలు 'పద్మావత్' వివాదం ఏంటి, సినిమాను బ్యాన్ చేసిన రాష్ట్రాలేవి? వంటి అంశాలపై 'కుటుంబం'లో మరిన్ని వివరాలు...

పద్మావత్ @ 190 కోట్లు

సంజయ్ లీలా భన్సాలీ అంటేనే భారీ బడ్జెట్ చిత్రాలకు పెట్టింది పేరు. తన మార్కు స్పష్టంగా కనిపించేలా పీరియాడికల్స్ తీయడంపై ఫోకస్ పెట్టే భన్సాలీ, 190 కోట్ల రూపాయల బడ్జెట్‌తో నిర్మించిన ఈ సినిమా, అత్యంత ఖరీదైన కాస్ట్యూమ్స్, మేకప్స్, కిలోలకొద్దీ బంగారు, వెండి నగలతో సెల్యులాయిడ్‌పై మెరిసిపోయేలా తెరకెక్కించారు. సినిమా షూటింగ్ మొదలైన రోజునుంచీ ఈ సినిమా యూనిట్‌పై మాటల దాడితోపాటు.. భౌతిక దాడులు (భన్సాలీపై కూడా) సాగుతూనే ఉన్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ సినిమా రిలీజ్‌కు రాజపుత్రులు ససేమిరా అంటూంటే, సెన్సార్ బోర్డు సూచనతో 'పద్మావతి'ని 'పద్మావత్'గా పేరు మార్చి రిలీజ్‌కు సిద్ధం చేశారు. యూ/ఏ సర్టిఫికెట్‌తో ఐదు కట్లతో హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా ఈనెల 25న సినిమా రిలీజ్‌కు సెన్సార్ బోర్డు అనుమతించింది. అయినా పట్టువదలని రాజపుత్రులు దీన్ని కూడా అడ్డుకుంటామని హెచ్చరించడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది.



నాలుగు రాష్ట్రాల్లో బ్యాన్


బీజేపీ పాలిత రాష్ట్రాలైన రాజస్థాన్, గుజరాత్, హర్యానా, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్‌లో 'పద్మావత్'ను బ్యాన్ చేస్తున్నట్టు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. దీనిపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. హిందీ అత్యధికంగా మాట్లాడే ఈ రాష్ట్రాల్లో సినిమాను నిషేధిస్తే కలెక్షన్లకు పెద్ద దెబ్బ ఖాయం. భారీ బడ్జెట్‌తో నిర్మించిన సినిమా ఇన్ని రాష్ట్రాల్లో రిలీజ్ కాకపోతే నిర్మాతకు ఆర్థికంగా చాలా నష్టం కలుగుతుందనే భయంతో, అత్యున్నత ధర్మాసనం సుప్రీంకోర్టును చిత్ర నిర్మాత ఆశ్రయించేలా చేసింది.



ఆ సీన్లుంటే..

వివాదానికి ఆజ్యం పోసింది ఇదే

'ఆ సీన్లుంటే నేను రెచ్చిపోతా'నన్న రణవీర్ సింగ్ వ్యాఖ్యలతో వివాదం మరింత ముదిరింది. అంటే ఈ సినిమాలో ఖిల్జీకి, పద్మావతికి మధ్య ప్రేమాయణంను భన్సాలీ ఘాటుగా తెరకెక్కించినట్టు రణవీర్ వ్యాఖ్యలతో సుస్పష్టమైంది. ఇది కర్ణిసేన ఆగ్రహానికి ముడిపదార్థంగా మారింది. రియల్ లైఫ్‌లో దీపిక బాయ్‌ఫ్రెండ్ అయిన రణవీర్, రీల్‌పై మాత్రం అల్లాఉద్దీన్ ఖిల్జీ పాత్ర పోషిస్తున్నాడు. రాణి పద్మావతి అందం వర్ణించిన చిలక మాటలతో ఆమెను చూడకముందునుంచే మోహించిన ఖిల్జీ బారినుంచి తప్పించుకునేందుకు.. చివరికి




మంటల్లో దూకి ఆమె మరణించిందని చరిత్ర చెబుతుంటే, దీనికి విరుద్ధంగా వీరిమధ్య రొమాన్స్‌ను తెరకెక్కించారని దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీపై ఆరోపణలు వెల్లువెత్తాయి.

సెన్సార్ ఓకే కానీ..

కేంద్రం నియమించిన సెన్సార్ బోర్డు పెద్దలు 'పద్మావత్' రిలీజ్‌కు ఓకె చెప్పినా, బీజేపీ పాలిత రాష్ట్రాలు అభ్యంతరాలెందుకు చెబుతున్నాయి? అసలు ఈ అంశంపై ప్రధాని ఎందుకు సైలెంట్‌గా ఉన్నారు? కేంద్ర ప్రసార శాఖామంత్రి, స్వయంగా నటికూడా అయినా స్మృతి ఇరానీ ఈ విషయంపై నోరెందుకు మెదపడంలేదు? ఇవన్నీ ప్రస్తుతం మిలియన్ డాలర్ల ప్రశ్నలుగా మిగిలాయి. సినిమాల విడుదలను అడ్డుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందా? ఈ విషయంపై తాడో పేడో తేల్చుకునేందుకు 'పద్మావత్' నిర్మాతలు బుధవారం సుప్రీంకోర్టుకెక్కారు. సినిమా ప్రదర్శన రాష్ట్ర పరిధిలోని అంశంకనుక తమ రాష్ట్రాల్లో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు సినిమాపై బ్యాన్ విధించవచ్చనే వాదన ఓవైపు ఉంది. కానీ పార్లమెంటరీ ప్యానెల్, చరిత్రకారుల కమిటీ సినిమా విడుదలకు ఆమోదించింది అయినా రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుకోవడమంటే? పైపెచ్చు కేంద్రంలో, ఈ నాలుగు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నది బీజేపీనే! అయినా వివాదం సద్దుమణగలేదు. మరోవైపు సినిమా పేరు మార్చితే సరిపోతుందా అంటూ కర్ణిసేన నిలదీస్తోంది. కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథ్వాలే కూడా ఇదే ప్రశ్నించారు. ప్రస్తుతం పీరియాడిక్ సినిమాల ట్రెండ్ సాగుతుండగా, క్రిష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా రాణి లక్ష్మిబాయ్ జీవిత చరిత్ర– 'మణికర్ణిక' వంటి సినిమాలపై ఎటువంటి వివాదాలు లేవు, కానీ భన్సాలీ వంటి వారు తీసే చారిత్రక సినిమాలన్నీ పదేపదే వివాదాస్పదమవుతుండడం విశేషం. మొత్తానికి 'పద్మావత్'తో బీజేపీ వర్సెస్ బాలీవుడ్‌గా పరిస్థితి మారింది

మమ్మల్ని కించపరిస్తే..

చరిత్రను వక్రీకరిస్తూ, రాజపుత్ర సామాజిక వర్గానికి చెందిన రాణి పద్మావతి పాత్రను చిత్రీకరించడంపై ధ్వజమెత్తిన రాజపుత్రులు, తమ సామాజిక వర్గానికి చెందిన మహిళలను కించపరిస్తే సహించేది లేదని ఘాటుగా హెచ్చరించారు. అయినా సినిమా చిత్రీకరణ పూర్తై, విడుదలకు సిద్ధమైంది. దీంతో విడుదలను పదేపదే అడ్డుకునేందుకు సర్వం ఒడ్డుతున్న రాజపుత్ర సంఘం 'కర్ణిసేన' ఎట్టిపరిస్థితుల్లోనూ సినిమా ప్రదర్శనను అడ్డుకునితీరతామంటూ వీరంగం సృష్టిస్తున్నారు. చిత్ర దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ, చిత్రంలో రాణి పద్మావతి పాత్ర పోషించిన దీపిక పడుకున్ ముక్కు కోసిన వారికి, తల తెచ్చినవారికి కోట్ల రూపాయల నజరానాలంటూ కర్ణిసేన చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. దీంతో చిత్ర యూనిట్, సినిమా ప్రమోషన్‌ను మానుకుంది. తప్పని పరిస్థితుల్లో రంగప్రవేశం చేసిన భన్సాలీ, ఇందులో రాజపుత్ర సామాజిక వర్గాన్ని తాను అస్సలు కించపరచలేదని స్పష్టం చేశారు. సినిమా రిలీజ్‌కు ముందే కర్ణిసేన సభ్యులకు 'పద్మావత్'ను ప్రత్యేకంగా చూపించాల్సిందేనంటూ ఆందోళనకారులు చేసిన విజ్ఞప్తిపై భన్సాలీ స్పందించకపోవడం, రాజపుత్రులను మరింత రెచ్చగొడుతోంది.



కాంట్రవర్సీలకు కేరాఫ్

అద్భుతమైన కళాఖండంగా సినిమాలను తెరకెక్కించే సృజనాత్మక దర్శకుడిగా, క్రిటికల్లీ అక్లైమ్డ్ ఫిలిం మేకర్‌గా, నాలుగు నేషనల్ ఫిలిం అవార్డ్స్‌తోపాటు 10 ఫిలింఫేర్ అవార్డులు, పద్మశ్రీని కూడా సొంతం చేసుకున్నారు. అయినాకూడా ఈయనకు వివాదాలంటేనే మక్కువ ఎక్కువ. తెరమీదైనా, తెరవెనుకైనా ఈయన వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉంటారు. చూసేందుకు కూల్‌గా కనిపించే సంజయ్.. 'బాజీరావ్ మస్తానీ' సినిమాతో కూడా వివాదం సృష్టించగా, చివరికి ఈ చిత్ర కథ ఓ కల్పిత కథ అనే డిస్‌క్లైమర్ వేస్తామంటూ రాజీకి వచ్చి విడుదలై..బాక్సాఫీసులో కలెక్షన్ల వర్షం కురింపించ, బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ప్రియాంకా చోప్రా, కరీనా కపూర్, సల్మాన్ ఖాన్, కరణ్ జోహర్‌వంటి సినీ ప్రముఖులతో జగడాల్లో చిక్కుకున్న ఈయన్ను వివాదాలు వెన్నంటే ఉంటాయనే ముద్ర ఉంది.



లియోనియో రిసార్ట్స్ ఎండీ అరెస్టు

- చక్రవర్తి రాజుపై పలు కేసులు
- గతంలో బెంగళూరు సీబీఐ కేసు
- బ్యాంకుల నుంచి రూ. 650 కోట్ల రుణం

హైదరాబాద్, జనవరి 17: జంటనగరాల్లోనే అత్యంత ప్రముఖ రిసార్టులలో ఒకటైన లియోనియో రిసార్ట్స్ ఎండీ చక్రవర్తి రాజును పోలీసలు అరెస్టు చేశారు. ఆయన పలు బ్యాంకులను మోసం చేశారన్న ఆరోపణలున్నాయి. మొత్తం 11 బ్యాంకుల నుంచి రూ. 650 కోట్ల రుణం తీసుకున్నారని, కానీ బ్యాంకులను మోసం చేశారని తెలుస్తోంది. చెక్ బౌన్స్ కేసులు కూడా ఆయనపై ఉన్నాయని అంటున్నారు. ఇంతకుముందు 2015 సంవత్సరంలో చక్రవర్తి రాజు మీద బెంగళూరు సీబీఐ కేసు నమోదుచేసింది. తన పేరిట కేవలం 30 ఎకరాల స్థలం మాత్రమే ఉంటే.. వందల ఎకరాలకు యజమానిని అంటూ తప్పుడు పత్రాలు సృష్టించి మోసం చేసినట్లు ఆయనపై కేసు నమోదైంది. ఇక హైదరాబాద్‌లోని రిసార్ట్స్ అనుమతుల విషయంలో కూడా చక్రవర్తి రాజు మీద పలు ఆరోపణలు వినవచ్చాయి.

మీరేం చేశారు?

(మొదటి పేజీ తరువాయి)

చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థకు కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం సహకరించట్లేదని, కొత్త విద్యాసంస్థలు మంజూరు చేయడం లేదని ఢిల్లీలో జరిగిన సమావేశంలో కడియం చేసిన వ్యాఖ్యలపై లక్ష్మణ్ స్పందించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అక్షరాస్యతలో దక్షిణాదిలోనే అథమస్థానంలో, గ్రామీణ అక్షరాస్యతలో దేశవ్యాప్తంగా అట్టడుగుస్థానంలో తెలంగాణ ఉందని, ఇలాంటి పరిస్థితుల్లో నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోలేదని అన్నారు. మూడున్నర సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఒరగబెట్టిందేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 24,861 టీచర్ పోస్టులు ఖాళీలున్నాయని అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే ఆర్థికమంత్రి ఈటెల రాజేందర్ గారు అసెంబ్లీలో స్వయంగా ప్రకటించారని, ఆ పోస్టులు ఇప్పటికీ భర్తీ చేయలేదని అన్నారు. ఇదేనా మీ చిత్తశుద్ధి అని ప్రశ్నించారు. దాదాపు 40 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాల్సింది పోయి టీఆర్‌టీ ద్వారా 8,792 ఖాళీలు మాత్రమే భర్తీ చేస్తామంటే కోర్టు మొట్టికాయలు వేసిందని గుర్తు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య సమతుల్యంగా లేదనే నెపంతో దాదాపు ఐదు వేల పాఠశాలలను విలీనం చేసిన చరిత్ర ఈ ప్రభుత్వానిదని మండిపడ్డారు. కార్పొరేట్ విద్యావ్యవస్థకు ప్రభుత్వం కొమ్ము కాస్తోందని, అధికార పార్టీకి చెందిన నాయకులే కార్పొరేట్ విద్యావ్యవస్థలో భాగస్వాములుగా ఉన్నారని అందుకే 10 శాతం ఫీజులు పెంచుకునేందుకు అనుమతి ఇచ్చారని ఆయన ఆరోపించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వచ్చిన సువర్ణావకాశం 'ఇండియన్ సైన్స్ కాంగ్రెస్'ని నిర్వహించుకునే దుస్థితి లేదని చెప్పిన విద్యాశాఖ మంత్రి కడియం.. దానికి బాధ్యులు కాదా? అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 25శాతం బయోమెట్రిక్ విధానం తీసుకొస్తామని చెప్పుకున్న ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైందని అన్నారు. ''200కు పైగా ఇంజనీరింగ్ కాలేజీలు, 400కు పైగా డిగ్రీ విద్యా సంస్థలు మూతపడ్డాయి. ఐదో వంతు సర్కారీ స్కూళ్లు మూసివేశారు? మీకు చిత్తశుద్ధి ఉంటే ఇలా జరుగుతుందా?'' అని విమర్శించారు. కాంట్రాక్టు టీచర్లను, లెక్చరర్లను పర్మినెంట్ చేస్తామన్నా మాటలు, ప్రకటనకు మాత్రమే పరిమితమయ్యిందన్నారు. సమస్యల నిలయాలుగా గురుకులాలు మారుతున్నాయని విమర్శించారు. 60 శాతం అధ్యాపక, ఆచార్య, ఉపాధ్యాయ ఖాళీలున్నాయని, వాటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదని, ప్రభుత్వ పనితీరుకు ఇది అద్దం పడుతుందన్నారు. మూడున్నర సంవత్సరాల్లో ప్రాథమిక, ఉన్నత విద్య విషయాల్లో ఏనాడైనా అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేశారా? అని ప్రశ్నించారు. ఎంసెట్ సక్రమంగా నిర్వహించలేని దుస్థితి ఈ ప్రభుత్వానిదని విమర్శించారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న శ్రీహరి తన బాధ్యతను పూర్తిగా విస్మరించి, తన వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి కేంద్రంపై నెపం వేస్తున్నారన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే టీచర్ల పోస్టులు వెంటనే భర్తీ చేసి, నాణ్యమైన విద్యను అందించాలన్నారు

ఓటమి భయంతోనే పరోక్ష ఎన్నికలు..

పంచాయతీ రాజ్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేశారని, ఇప్పుడు హడావిడిగా ఎన్నికలు అంటూ గందరగోళం చేస్తున్నారని లక్ష్మణ్ పేర్కొన్నారు. ప్రతిపక్షాల సలహాలు, సూచనలు తీసుకోకుండా అధికారం ఉంది కదా అని ప్రభుత్వం ఇష్టానుసారంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. తండాలను, గూడాలను, గిరిజన ప్రాంతాలను పంచాయతీలుగా చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు ఆ హామీలు నెరవేర్చకుండా ఎన్నికలు నిర్వహిస్తామనడం దారుణమన్నారు. ఓడిపోతామనే నెపంతోనే పరోక్ష ఎన్నికలు పెడతామంటున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా బీజేపీ పోటీ చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. హజ్ యాత్రికుల సబ్సిడీ త్తివేయాలని గతంలో మాట్లాడిన అసదుద్దీన్, ఇప్పుడు మాట మారుస్తున్నారని, సబ్సిడీగా ఇస్తున్న 500 కోట్ల రూపాయలను ముస్లిం అమ్మాయిల చదువు కోసం ఖర్చు పెడతామని ఓ ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు.

మందకృష్ణను విడుదల చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహిస్తామని ప్రతినబూనారు. హక్కుల కోసం తెలంగాణలోని దళిత సంఘాలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ చేయాల్సిందేనని, ఇందు కోసం మందకృష్ణ చాలాకాలంగా పోరాడుతున్నారని పేర్కొన్నారు. మందకృష్ణపై అక్రమ కేసులను ఎత్తివేయాలని, ఆయన్ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని దళితులకు మూడు ఎకరాలు కాకుండా ఐదు ఎకరాలు ఉచితంగా ఇవ్వాలని కోరారు. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో దళితులపై దాడులు పెరిగిపోయాయని, అన్ని వర్గాల దళితులు ఈ దాడులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని సూచించారు. కాగా, మందకృష్ణను సినీ విమర్శకుడు కత్తి మహేశ్ కూడా జైలులో కలిశారు. తాను ఎమ్మార్పీఎస్‌కు సంపూర్ణ మద్దతు పలుకుతున్నట్లు ప్రకటించారు.

టాలీవుడ్‌కు ఐటీ షాక్!

8 మంది నిర్మాతల ఇళ్లు,ఆఫీస్‌లలో ఆకస్మిక సోదాలు

- ముందస్తు పన్ను కట్టకపోవడమే కారణం
- సోదాలు కావు.. సర్వే మాత్రమే
- బడా నిర్మాణ సంస్థల వాదన
- భారీ బడ్జెట్లతో సినిమా నిర్మాణం
- పన్ను చెల్లింపు అంతంతమాత్రం

హైదరాబాద్, జనవరి 17 (మనం ప్రతినిధి): వందల కోట్లు పెట్టి సినిమాలు నిర్మిస్తున్నా... తగినంతగా ఆదాయపన్ను కడుతున్నారా లేదా అన్న అనుమానంతో ఆ శాఖ అధికారులు ఎనిమిది మంది టాలీవుడ్ బడా నిర్మాతల ఇళ్లు, కార్యాలయాల్లో బుధవారం సోదాలు నిర్వహించింది. మూడేళ్లుగా అడ్వాన్స్ టాక్స్‌కు సంబంధించిన పత్రాలు సరిగా సమర్పించకపోవడమే ఈ సోదాలకు కారణమని విశ్వసనీయంగా తెలిసింది. సురేష్ ప్రొడక్షన్స్, హారిక అండ్ హాసిని, భవ్య క్రియేషన్స్, డీవీవీ క్రియేషన్స్, నార్త్ స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్, సీకే ఎంటర్‌టైన్‌మెంట్, వెంకటేశ్వర క్రియేషన్స్ ఆఫీసుల్లో బుధవారం ఐటీ సోదాలు జరిగాయి. అయితే నిర్మాణ సంస్థలు మాత్రం ఇవి ఐటీ దాడులు కావని... వాళ్లు కేవలం ఆదాయపన్ను సర్వే కోసమే వచ్చారని చెబుతున్నాయి. సంక్రాంతికి విడుదలైన జై సింహా, అజ్ఞాతవాసి నిర్మాణంలో ఈ బ్యానర్లన్నీ దాదాపుగా పాలుపంచుకున్నాయి. వీటిలో కొన్ని బ్యానర్లు ప్రత్యక్షంగా భాగస్వామ్యమవ్వగా మరికొన్ని డిస్ట్రిబ్యూషన్, ఫైనాన్స్ పరంగా వ్యాపార లావాదేవీల్లో పాలుపంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఐటీ సోదాలకు సంబంధించి అధికారిక సమాచారం తెలియాల్సి ఉంది.

నందమూరి బాలకృష్ణ హీరోగా పాతిక కోట్ల రూపాయల బడ్జెట్‌తో 'జై సింహా' చిత్రాన్ని నిర్మాత సి.కల్యాణ్ రూపొందించారు. కలెక్షన్స్ పరంగా చూసుకుంటే.. మొదటి వారంలోనే రూ. 25 కోట్లను వసూలు సిందన్నారు. దాంతోపాటు.. అదే సి. కళ్యాణ్ ఇప్పుడు వినాయక్, సాయిధరమ్ తేజ్‌ల కాంబినేసన్‌లో ఓ సినిమాను నిర్మిస్తున్నారు. ఇంకా, రానా హీరోగా హిస్టారికల్ సినిమా '1945' చిత్రాన్ని తెలుగులో ఆయనే నిర్మిస్తున్నారు. ఇది కాక తెలుగు, తమిళం, హిందీ భాషల్లో నిర్మితం కానున్న 'సంఘమిత్ర' సినిమాను తెలుగులో తానే విడుదల చేస్తానని సి.కల్యాణ్ ప్రకటించారు. దీంతో ఐటీశాఖ అధికారులు కన్ను సదరు నిర్మాతపై పడింది. ఐటీశాఖ అధికారులు సోదాలు చేస్తున్న సమయంలో నిర్మాత సి.కల్యాణ్ మాత్రం హైదరాబాద్‌లో లేరని సమాచారం. ఈ సంక్రాంతికి వచ్చిన మరో భారీ చిత్రం 'అజ్ఞాతవాసి'. ఈ చిత్రాన్ని వందకోట్లకు పైచిలుకు బడ్జెట్‌తో నిర్మించారని టాక్ వినపడింది. దానికి తగ్గట్టు 130 కోట్ల రూపాయల ప్రీ రిలీజ్ బిజినెస్ జరిగిందని కూడా సమాచారం రావడంతో నిర్మాత ఎస్.రాధాకృష్ణ ఆఫీసుపై కూడా ఐటీశాఖ సోదాలు జరిగాయని అంటున్నారు. మిగిలిన వాళ్లు కూడా ఈ మధ్య కాలంలో భారీగానే సినిమా వ్యాపారం చేశారని.. అయితే వీళ్లందరి నుంచి ఆ స్థాయిలో పన్ను రాబడి లేదని ఐటీ శాఖ వర్గాలు అంటున్నాయి. ఇంతకుముందు తమిళనాడులో కూడా అక్కడి సినీ పరిశ్రమ వర్గాలపై భారీ స్థాయిలో ఐటీ సోదాలు జరిగాయి.



ముప్పు.. ముంచుకొస్తోంది!


(మొదటి పేజీ తరువాయి)



వాడకం తగ్గించకపోవడం, రోజు రోజుకూ వ్యక్తిగత వాహనాల సంఖ్యను ఇబ్బడి ముబ్బడిగా పెంచేస్తుం డటం, హరిత ఇంధ నం జోలికి అస్సలు వెళ్లక పోవడం లాంటి చర్యల ఫలితంగానే ఈ విపరి ణామాలన్నీ సంభవించబో తున్నాయట. కంప్యూటర్ సి మ్యులేషన్ల ఆధారంగా భారతదేశంలోని కొన్ని ప్రాంతాలతో పాటు అమెరికా, ఆఫ్రికా దేశా లు, ఇండోనేసియా, మధ్య యూరప్‌లోని పలు ప్రాంతాలలో వరద రక్షణ చర్యలను మరింతగా మెరుగు పరచుకోవాలని హెచ్చ రించారు. ఈ ప్రాంతాలన్నింటిలో వర్షపాతం తీరు గణనీయంగా మారబోతోందని, దాని ప్రభావంతో వరదలు చాలా ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు.

ప్రపంచ వ్యాప్తంగా నదులకు సంభవిస్తున్న వరదల లాంటి ప్రకృతి విపత్తుల కారణంగా జరుగుతున్న నష్టం అధికంగా ఉంటోంది. మె రుగైన నదీ నిర్వహణ, భవన ప్రమాణాలను మెరుగు పరచుకోవడం, కాలువగట్లు పటిష్ఠం చేసుకోవడం లాంటి చర్యలను వెంటనే చేప ట్టాలని సైన్స్ అడ్వాన్సెస్ అనే పత్రికలో ప్రచురించిన కథనంలో జర్మన్ శాస్త్రవేత్తలు సూచించారు.

2040 నాటికల్లా ఆసియా ఖండంలో 10 శాతం అత్యంత తీవ్రమైన వరదల కారణంగా ప్రభావితమయ్యే ప్రజల సంఖ్య 7.6 కోట్ల నుంచి 15.6 కోట్లకు పెరుగుతుందని పోట్స్‌డామ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ క్లైమేట్ ఇంపాక్ట్ రీసెర్చ్ నిపుణులు తెలిపారు. ఉత్తర అమెరికా లో ప్రస్తుతం వరదలకు ప్రభావితమయ్యే ప్రజల సంఖ్య లక్ష మాత్రమే ఉండగా రాబో యే రెండు దశాబ్దాలలో ఇది పదిరెట్లు పెరిగి పది లక్షల మంది నష్టపోతారని హెచ్చరించారు. భవిష్యత్తులో జనాభా పెరుగుదల, తద్వారా పెరిగే గ్లోబల్ వార్మింగ్ వేగం లాంటివాటిని కూడా లెక్కిస్తే ఈ సంఖ్యలు మరింత ఎక్కువైనా ఆశ్చర్యపోనక్కర్లేదని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాలలో సైతం వరద ముప్పు ఎక్కువగానే ఉంటోందని, వాతావరణ మార్పులను నియంత్రించడానికి ఇప్పటికి కొన్ని చర్యలు చేపడుతున్నా.. ఇప్పటికే కొన్ని దశాబ్దాలుగా ఆయా ప్రాంతాలలో పేరుకు పోయిన గ్రీన్‌హౌస్ ఉద్గారాల వల్ల జరగాల్సిన నష్టం ఇప్పటికే జరిగిపోయిందని తెలిపారు. గ్లోబల్ వార్మింగ్‌ను 2 డిగ్రీల సెల్సియస్ (3.7 డిగ్రీల ఫారన్‌హీట్) కంటే దిగువ స్థాయిలో ఉంచడంలో వైఫల్యం వల్ల నదుల వరద ల నుంచి ప్రజలు తప్పించుకోలేరని శాస్త్రవేత్తలు ఘంటాపథంగా చెబుతున్నారు.



తలైవా.. తలెత్తలేడు

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 234 స్థానాల్లోనూ పోటీ చేస్తానని 'తలైవా' ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, ఇంకా పేరు పెట్టని ఆయన పార్టీ గెలుచుకోబోయేది కేవలం 33 స్థానాలేనని తాజా సర్వే ఒకటి తేల్చింది. ఆ మేరకు ఇండియాటుడే-కార్వీ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఈ అధ్యయనంలో.. రజనీ రంగంలో దిగడం వల్ల లాభపడేది డీఎంకే నాయకుడు స్టాలిన్ మాత్రమేనని స్పష్టం చేసింది. అలాగే తమిళనాడుకు కాబోయే ముఖ్యమంత్రి ఆయనేనని కూడా తేల్చిచెప్పింది. ఒకవేళ ఇప్పటికిప్పుడు మధ్యంతర ఎన్నికలు నిర్వహిస్తే రజనీ పార్టీకి కేవలం 16% ఓట్లు వస్తాయని అంచనా వేసింది. తమిళనాట 2011 మే నెల నుంచి ప్రతిపక్షంలో ఉన్న డీఎంకే.. ఈసారి మిత్రపక్షాలతో కలిపి 34% ఓట్లతో 130 స్థానాలు సాధించగలదని చెప్పింది. కాగా, 2016 ఎన్నికల్లో ఆ పార్టీ 98 సీట్లతో సరిపెట్టుకున్న విషయం తెలిసిందే.

అధికార అన్నాడీఎంకే నష్టపోతుంది

ఇప్పుడు ఎన్నికలు జరిగితే అన్నాడీఎంకే ఎక్కువగా నష్టపోతుందని అధ్యయనం పేర్కొంది. ఆ పార్టీకి 2016లో 41% ఓట్లతో 135 స్థానాలు రాగా.. ఇప్పుడు 26% ఓట్లతో 68 సీట్లు మాత్రమే వస్తాయని లెక్కవేసింది. ఇక ముఖ్యమంత్రి పదవికి సరైన అభ్యర్థి ఎవరన్న ప్రశ్నకు- తమిళ ఓటర్లలో అత్యధికులు స్టాలిన్‌వైపే మొగ్గు చూపారు. ఆయనకు ఏకంగా 50% ఓటర్ల మద్దతు కనిపిస్తుండగా రజనీకాంత్‌కు 17 శాతం మాత్రమే మద్దతు పలికారు. ప్రస్తుత డిప్యూటీ సీఎం పన్నీర్ సెల్వం 11%, సీఎం పళనిసామికి 5 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. పార్టీ పెడతానంటున్న మరో నటుడు కమల్‌హాసన్‌వైపు 4 శాతం, ఇటీవల ఆర్కేనగర్ ఉప ఎన్నికలలో నెగ్గి సంచలనం సృష్టించిన శశికళ బంధువు టీటీవీ దినకరన్‌వైపు 3 శాతం మాత్రమే ఓటర్లు మొగ్గుచూపడం గమనార్హం. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో జయలలిత జీవించి ఉన్నారు. అప్పట్లో డీఎంకే-అన్నాడీఎంకేల మధ్య ఓట్ల తేడా చాలా స్వల్పం కాగా, ఇప్పుడది భారీగా 15 శాతం వరకు కనిపిస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం మీద ప్రజల్లో వ్యతిరేకత తీవ్రంగా ఉందని, దానికితోడు తమ పార్టీకి ప్రజాదరణ బాగా పెరిగిందని డీఎంకే అధికార ప్రతినిధి, పార్టీ రాజ్యసభ సభ్యుడు టీకేఎస్ ఇళంగోవన్ అన్నారు. అన్నాడీఎంకే మాత్రం.. ఇప్పుడే సర్వే చేయడం చాలా తొందరపాటని, ఇలాంటప్పుడు క్షేత్రస్థాయిలో వాస్తవాలు బయటకు రావని అంటోంది.

వైసీపీ.. సినీగ్లామర్?



అమరావతి, జనవరి 17 (మనం ప్రతినిధి):

రాబోయే ఎన్నికలలో ఎలాగైనా ఏనుగు కుంభస్థలాన్ని కొట్టాలని ప్రయత్నిస్తున్న వైఎస్ఆర్‌సీపీ.. సినీ పరిశ్రమపై దృష్టిపెట్టింది. ఏ ఒక్క వర్గాన్నీ దూరం చేసుకోకుండా.. అందరినీ కలుపుకొంటూ ముందుకెళ్లాలని ఆ పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. పార్టీకి అండగా ఉన్న సీనియర్ నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరిరావును ఇటీవలే రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి కలిసి ఎవరెవరిని పార్టీలోకి తీసుకురావాలో చర్చించినట్లు తెలిసింది. వారిని పార్టీలోకి తీసుకొచ్చే బాధ్యతలను పరిశ్రమతో సంబంధాలున్న కొడాలి నాని, విజయచందర్‌లకు అప్పగించినట్లు చెబుతున్నారు. ఇన్నాళ్లుగా సినీ పరిశ్రమ చాలావరకు టీడీపీకి మద్దతుగా నిలిచింది. ఈసారి ఎన్నికల్లో జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కూడా బరిలోకి దిగుతుండటంతో.. టాలీవుడ్ నుంచి ఎక్కువ మంది ఎన్నికల బరిలోకి దిగేందుకు ఆసక్తి చూపించవచ్చని వినిపిస్తోంది. అయితే.. వాళ్లందరికీ ఎటూ అటు పవన్, ఇటు టీడీపీ అవకాశం ఇవ్వలేకపోవచ్చు కాబట్టి.. ముందుగానే ఆసక్తి ఉన్న సినీ ప్రముఖులను తమ పార్టీలోకి ఆహ్వానించడం మంచిదని ఒక నిర్ణయానికి వచ్చారని అంటున్నారు. కేరెక్టర్ ఆర్టిస్టుగా మంచి ప్రాచుర్యం ఉన్న హేమకు తూర్పుగోదావరి జిల్లాలో అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు. కాపు సామాజికవర్గానికి చెందిన ఆమె.. ఇప్పటికే కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభాన్ని కూడా కలిసి ఆశీస్సులు తీసుకున్నారని, ఆమె రాక దాదాపు ఖరారైనట్లేనని సమాచారం. హాస్యనటుడు పృథ్వీ కూడా వైఎస్ఆర్‌సీపీలోకి రావడానికి సుముఖంగా ఉన్నట్లు చెబుతున్నారు.

రెబల్‌స్టార్‌కు ఎంపీ టికెట్?

బీజేపీ సీనియర్ నాయకుడు.. కేంద్ర మాజీమంత్రి అయిన కృష్ణంరాజుకు పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీ టికెట్ ఇస్తామని వైఎస్ఆర్‌సీపీ నుంచి ఆఫర్ వచ్చినట్లు సమాచారం. ప్రభాస్ ఇమేజ్ ఎటూ ఉంటుంది కాబట్టి అది పార్టీకి ఉపయోగపడుతుందన్న ఆలోచనతో.. గతంలో నరసాపురం ఎంపీగా పనిచేసిన పెద్దాయనను తమ పార్టీలోకి చేర్చుకుంటే బాగుంటుందని అడుగులు వేస్తున్నారు. అయితే ఈ విషయంలో కృష్ణంరాజు మాత్రం ఇంకా వైఎస్ఆర్‌సీపీ వర్గాలకు ఎలాంటి హామీ ఇవ్వలేదని అంటున్నారు.

హరికృష్ణతో నాని భేటీ?

ఎన్టీఆర్ కుమారులలో ఒకరైన నందమూరి హరికృష్ణ చాలాకాలంగా చంద్రబాబు తీరుపై అసంతృప్తితో ఉన్నారు. పార్టీ వ్యవహారాల్లో కూడా ఆయన అంటీముట్టనట్లే వ్యవహరిస్తున్నారు. దీన్ని గమనించిన వైఎస్ఆర్‌సీపీ అధినేత.. కొడాలి నానిని రంగంలోకి దింపారు. హరికృష్ణను కలిసి ఆయనకు హిందూపురం అసెంబ్లీ టికెట్ ఆఫ ర్ చేశారని వైసీపీ నేత లు చెబుతున్నారు.

మహిళలకు పెద్దపీట



విశాఖపట్నం, జనవరి 17 (మనం న్యూస్ బ్యూరో):

మహిళా పారిశ్రామికవేత్తలను రాష్ట్రం ప్రభుత్తం ప్రోత్సహిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చే మహిళలకు అన్ని సౌకర్యాలు, రాయితీలు కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. విశాఖపట్నంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే ప్రపంచ మహిళా పారిశ్రామికవేత్తల సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లడం సంతోషకరమని అన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుం దని, తాను రాజకీయ రంగంలో ఉన్నా తన భార్య భువనేశ్వరి, కోడలు బ్రహ్మణి పారిశ్రామికవేత్తలుగా విజయవంతంగా రాణిస్తున్నారని చెప్పారు. ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు విశాఖజిల్లా ఆనందపురం మండలం గిరిజాలలో 50 ఎకరాలను కేటాయించామని చెప్పారు. త్వరలో జరగబోయే మంత్రివర్గ సమావేశంలో దీనికి సంబంధించి పూర్తి అనుమతులిస్తామని స్పష్టం చేశారు. సాంకేతిక, పారిశ్రామిక, ఆటోమొబైల్, టెక్స్‌టైల్ రంగాల్లో రాష్ట్రం ముందుందని, మిగిలిన రంగాల్లో గణనీయమైన ప్రగతిని సాధిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. విశాఖలో ఇప్పటికే రెండు పర్యాయాలు సీఐఐ సదస్సులు నిర్వహించామని, త్వరలో 50 దేశాల ప్రతినిధులతో మూడో సదస్సును నిర్వహించనున్నట్టు తెలిపారు.

సదస్సుకు విదేశీ ప్రతినిధులు

మూడు రోజుల పాటు జరిగే మహిళా సదస్సుకు సార్క్ సభ్య దేశాలైన బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, ఆఫ్ఘానిస్థాన్, శ్రీలంక, మాల్దీవుల నుంచి 40 మంది మహిళా ప్రతినిధులు హాజరయ్యారు. ఎగుమతి, దిగుమతి రంగాల్లో రాణించడం ఎలా.. విదేశాల్లో వ్యాపార అవకాశాలను చేజిక్కించుకోవడం ఎలా.. అన్న అంశాలపై చర్చలు జరుగనున్నాయి. సదస్సులో భాగంగా 'విత్' (ఉమెన్ ఎంటర్‌ప్రైన్యూర్ ఇంటర్నేషనల్ ట్రేడ్ అండ్ టెక్నాలజీ హబ్) పేరిట ఒక కేంద్రాన్ని విశాఖ పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేయనున్నారు. ఈ సదస్సులో మంత్రులు గంటా శ్రీనివాసరావు, అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ పట్టణాభివృద్ధి సంస్థ పునర్నిర్మించిన గురజాడ కళాక్షేత్రం ప్రారంభోత్సవానికి హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు లోపలికి వెళ్లకుండానే వెనుదిరిగారు. కళాక్షేత్రం లోపల శిలాఫలకాన్ని ఆవిష్కరించకుండానే బయట నుంచి వెళ్లిపోయారు. బయట ఉన్న గురజాడ విగ్రహానికి పూలమాల వేసి ఈ కార్యక్రమాన్ని అక్కడితో ముగించారు. తర్వాత మంత్రి అయ్యన్న పాత్రుడు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గతంలో గురజాడ కళాక్షేత్రంలో జరిగే సమావేశాలకు హాజరైనవారు ఆ తర్వాత పదవీచ్యుతులయ్యారనే సెంటిమెంటే ఇందుకు కారణమని టీడీపీ నేతలు వ్యాఖ్యానించారు.

మహిళా సదస్సులో పాల్గొనేందుకు విశాఖ వచ్చి.. ఇక్కడి నుంచి ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రికి విమానాశ్రయంలో పార్టీ నేతలు ఘనంగా స్వాగతం, వీడ్కోలు పలికారు. చంద్రబాబుకు మంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు ఎంవీవీఎస్ మూర్తి, పప్పల చలపతిరావు, కలక్టర్ ప్రవీణ్‌కుమార్, పోలీసు కమిషనర్ టి.యోగానంద్ తదితరులు స్వాగతం పలికారు.

విశాఖలో మహిళా పారిశ్రామికవేత్తల సదస్సులో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు వచ్చిన నేపథ్యంలో వేదికకు సమీపంలో మత్స్యకారులు ఆందోళనకు దిగారు. బీచ్‌లో మత్స్యకారులు పెద్ద ఎత్తున జలదీక్ష చేపట్టారు. దీక్షలో పుదుచ్చేరి మంత్రి కృష్ణారావు పాల్గొని.. వారికి సంఘీభావం తెలిపారు. మత్స్యకారులను ఎస్టీల్లో చేరుస్తామని టీడీపీ మేనిఫెస్టోలో పెట్టిందని, చంద్రబాబు స్వయంగా హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేర్చాలని కోరితే.. ఆయన తమ జాతిని అవమానించేలా మాట్లాడారని మత్స్యకార సామాజిక వర్గం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను ఎస్టీల్లో చేర్చాలని కోరుతూ మత్స్యకారులు కొన్ని రోజులుగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు.

కనురెప్పలూ గడ్డకట్టేలా!

- రష్యాలోని యకూటియాలో -67 డిగ్రీల ఉష్ణోగ్రత



మాస్కో, జనవరి 17: ఈ చిత్రంలో చూస్తున్న అమ్మాయి కనురెప్పలపై మంచు పేరుకుపోయి కనిపిస్తోంది? ఏమిటీ అనుకుంటున్నారా. నిజమే.. రష్యాలోని యకూటియాలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా మైనస్ 67 డిగ్రీలకు పడిపోయాయి. దాంతో ఆ ప్రాంతమంతా మంచు ఎడారిలా మారిపోయింది. ఈ చిత్రంలో చూస్తున్న అమ్మాయి అనస్తాసియా గ్రుజ్‌దేవా ఈ ఫొటో తీసుకున్నప్పుడు అక్కడ మైనస్ 50 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అనంతరం అక్కడ ఉష్ణోగ్రతలు ఒక దశలో మైనస్ 80 డిగ్రీలకు కూడా చేరుకుందట. తన కనురెప్పలు కూడా గడ్డకట్టిన ఫొటోను అనస్తాసియా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. రష్యా రాజధాని మాస్కోకు 5,300 కిలోమీటర్ల దూరంలో యకూటియా ఉంది. ఇక్కడ పది లక్షల మంది జీవిస్తున్నారు. శీతాకాలంలో ఈ ప్రాంతంలో 18 డిగ్రీల ఉష్ణోగ్రత నుంచి -40 డిగ్రీలు నమోదు అవతుందని, ఈసారి-80 డిగ్రీలకు పడిపోవడం ఇదే తొలిసారి అంటున్నారు.

సుఖోయ్‌లో నిర్మల!

జోధ్‌పూర్, జనవరి 17: భారత వాయుసేనకు చెందిన యుద్ధ విమానం సుఖోయ్-30 ఎంకేఐని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ పరీక్షించారు. బుధవారం నాడు జోధ్‌పూర్ ఎయిర్ బేస్ నుంచి మంత్రి సుఖోయ్ యుద్ధ విమానంలో ఆమె ప్రయాణించారు. సైనిక దళాల సమర్థతను, యుద్ధ సంసిద్ధతను పరీక్షించే క్రమంలో మంత్రి ఈ ప్రయాణం చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ క్రమంలో ఆమె మరో రికార్డును సృష్టించారు. ఈ యుద్ధ విమానంలో ప్రయాణించి పరీక్షించిన మాజీ రాష్ట్రపతులు ప్రతిభా పాటిల్, అబ్దుల్ కలామ్‌ల సరసన నిర్మల కూడా చేరారు. సుమారు అరగంట పాటు సాగిన ఈ ప్రయాణంలో రక్షణ మంత్రితో పాటు ఓ పైలట్ ఉన్నారు. సుఖోయ్‌లో ప్రవేశించే క్రమంలో పైలట్లు ధరించే జీ సూట్‌ను మంత్రి ధరించారు. యుద్ధ విమానాల్లో శక్తిమంతమైన సుఖోయ్‌కి అణ్వాయుధాలను మోసుకెళ్లే సామర్థ్యం ఉంది. శత్రు స్థావరాల్లోకి ఇది ఈజీగా చొచ్చుకుపోతుంది. రష్యాకు చెందిన సుఖోయ్ సంస్థ దీన్ని అభివృద్ధి చేయగా.. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ దీనిని నిర్మిస్తోంది. రక్షణ శాఖను చేపట్టిన మొదటి మహిళగా గుర్తింపు పొందిన నిర్మలా సీతారామన్ ఆర్మీ, వాయు, నేవీ బేస్‌లను తరచూ సందర్శిస్తూ త్రివిధ దళాల ఆపరేషన్స్‌ను సమీక్షిస్తున్నారు. రెండు రోజుల క్రితమే ఇండియన్ నేవల్ షిప్ విక్రమాదిత్యలోనూ మంత్రి విహరించిన విషయం తెలిసిందే!





మానవాళికే మహా ప్రవక్త

మహాత్మునికి ఇజ్రాయెల్ ప్రధాని నివాళి.. సబర్మతి ఆశ్రమ సందర్శనలో నెతన్యాహు

- బాపూ గదిలో రాట్నం తిప్పిన దంపతులు
- అహ్మదాబాద్ నుంచి అట్టహాసంగా రోడ్ షో
- 8 కిలోమీటర్ల దూరం జన స్వాగతం
- 50 వేదికలపై కళారూపాల ప్రదర్శన

అహ్మదాబాద్, జనవరి 17: మానవాళికి స్ఫూర్తినిచ్చిన మహా ప్రవక్తలలో మహాత్ముడు కూడా ఒకరని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహు నివాళి అర్పించారు. బుధవారం భారత ప్రధాని నరేంద్ర మోదీ అహ్మదాబాద్ నుంచి సబర్మతి ఆశ్రమందాకా నెతన్యాహు దంపతులను ఓపెన్ టాప్ జీపులో తీసుకెళ్లారు. అక్కడ గాంధీజీ నడయాడిన ఆశ్రమ ప్రాంగణాన్ని, ఆయన కుటీరం 'హృదయ్ కుంజ్'ను వారు సందర్శించారు. సుమారు 20 నిమిషాలపాటు గడిపిన అనంతరం ''మానవజాతికి స్ఫూర్తినిచ్చిన మహా ప్రవక్తలలో ఒకరైన మహాత్మాగాంధీ ఆవాస సందర్శన గొప్ప ఉత్తేజాన్నిచ్చింది'' అని అక్కడి సందర్శకుల పుస్తకంలో రాశారు. ఈ సందర్భంగా బాపూజీ గదిలోని రాట్నంపై నూలు వడికే ప్రయత్నం చేశారు. అటుపైన సబర్మతి నదీ ముఖద్వారంలో ఇటీవలే ముగిసిన 'ఉత్తరాయణ్' (మకర సంక్రాంతి) వేడుకలు, అందులో భాగంగా నిర్వహించే పతంగుల ఉత్సవం గురించి మోదీ వివరించారు. దీంతో వారు కొద్దిసేపు వినోదపూర్వకంగా గాలిపటాలను ఎగురవేసేందుకు యత్నించారు. దక్షిణాఫ్రికా నుంచి తిరిగివచ్చాక గాంధీజీ ఈ ఆశ్రమంలోనే ఎక్కువ కాలం నివసించారు. ఇక్కడినుంచే 1930లో ప్రసిద్ధ 'దండియాత్ర' (ఉప్పు సత్యాగ్రహం)ను ప్రారంభించిన ఆయన, స్వాతంత్ర్యం సిద్ధించేదాకా తిరిగి ఆశ్రమానికి రానని ఆనాడు ప్రతినబూనారు.





భారీ భద్రత మధ్య రోడ్ షో

ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో నెతన్యాహు, సారా దంపతులకు అపూర్వ స్వాగతం లభించింది. ఢిల్లీ నుంచి ఉదయం 10 గంటల ప్రాంతంలో అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విమానాశ్రయం చేరుకున్న అనంతరం భారీ భద్రత నడుమ వారు సబర్మతి ఆశ్రమంవరకూ ఓపెన్ టాప్ జీపులో ప్రదర్శనగా సాగారు. విశిష్ట అతిథులకు వినోదం కోసం 8 కిలోమీటర్ల ఈ మార్గంలో 50 సాంస్కృతిక వేదికలను ఏర్పాటు చేశారు. వివిధ రాష్ట్రాల కళాకారులు వీటిపై తమ కళా నైపుణ్యం ప్రదర్శించి వారిని అలరించారు. సుందరంగా అలంకరించిన రహదారి పొడవునా భారత, ఇజ్రాయెల్ పతాకాలు చేతబూని బారులుతీరిన ప్రజలు హర్షధ్వానాలతో వారిని స్వాగతించారు. సబర్మతి ఆశ్రమంలో గాంధీజీ గదిని, ఆయన వాడిన వస్తువులను ప్రధాని మోదీ వారికి చూపారు. గుజరాత్‌ను సందర్శించిన అంతర్జాతీయ నేతలలో నెతన్యాహూ మూడో దేశాధినేత. ఇంతకుముందు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ దంపతులు సబర్మతి నదీ ముఖద్వారంలో మోదీ ఆతిథ్యం స్వీకరించారు. ఆ తర్వాత నిరుడు సెప్టెంబరులో జపాన్ ప్రధాని షింజో అబె దంపతులు కూడా సబర్మతిదాకా ఓపెన్ టాప్ జీపులో ప్రయాణించిన సంగతి తెలిసిందే.

ముంబైలో నేడు ముమ్మర కార్యక్రమాలు

భారత్‌లో ఆరు రోజుల సుదీర్ఘ పర్యటనలో భాగంగా బెంజమిన్ నెతన్యాహు గురువారం ముంబై నగరం సందర్శిస్తారు. అక్కడ ఉదయం దిగ్గజ పారిశ్రామికవేత్తలు ఆనంద్ మహీంద్ర, అజయ్ పిరమాల్, ఆది గోద్రెజ్, ఐసీఐసీఐ బ్యాంకు ఎండీ-సీఈవో చందాకొచ్చర్ తదితరులతో అల్పాహార విందు స్వీకరిస్తారు. అనంతరం 'షలోమ్ బాలీవుడ్' కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమాలు ముగిశాక దక్షిణ ముంబైలోని తాజ్ హోటల్‌లో భారత-ఇజ్రాయెల్ వాణిజ్య సదస్సులో ప్రసంగిస్తారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కూడా ఈ సదస్సుకు హాజరవుతారు. అటుపైన నెతన్యాహు దంపతుల గౌరవార్థం ఇస్తున్న విందు సందర్భంగా ఫడ్నవీస్ ఆయనతో ముఖాముఖి భేటీ అయ్యే అవకాశాలున్నాయి. ఆ తర్వాత ముంబై ఉగ్రదాడి మృతులకు నెతన్యాహు నివాళి అర్పిస్తారు.





అమెరికాపై ప్రేమ.. నైపుణ్యం

- వలసదారులకు ఇవి తప్పనిసరి
- ఇంగ్లిషు బాగా మాట్లాడగలగాలి
- మెరిట్ ఆధారంగానే హెచ్-1బీ వీసా
- కొత్త విధానంపై ట్రంప్ యంత్రాంగం వెల్లడి



వాషింగ్టన్, జనవరి 17: అమెరికాపై ప్రేమ.. నైపుణ్యం.. అర్గళంగా ఇంగ్లిషు మాట్లాడగలిగే సత్తా ఉంటే ప్రపంచంలోని ఏ దేశం నుంచైనా యూఎస్‌కు వలస వెళ్లొచ్చు. మెరిట్ ఆధారంగా హెచ్-1బీ వీసా జారీ విధానంపై ట్రంప్ యంత్రాంగం రూపొందిస్తున్న ప్రతిపాదనలు ఇలానే ఉండబోతున్నాయని తెలుస్తోంది. ఈ విధానంతో భారత్ సహా పలు దేశాలకు చెందిన నిపుణులకు ఎంతో ఉపయోగకరమని ఇమిగ్రేషన్ సంస్థలు అభిప్రాయపడుతున్నాయి. వలసల విధానంలో సంస్కరణలు చేపట్టాలని ట్రంప్ సర్కార్ భావిస్తోంది. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న లాటరీ విధానానికి త్వరలో చరమగీతం పాడాలని అధ్యక్షుడు భావిస్తున్నారు. ఈ మేరకు ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదనలను సిద్ధం చేస్తోంది. 'అమెరికా, ఇక్కడి ప్రజలపై ప్రేమ.. మంచి ప్రతిభ, నైపుణ్యం ఉన్నవారు.. ఆంగ్ల భాషను అనర్గళంగా మాట్లాడేవారు.. మా విలువలకు అనుగుణంగా నిబద్ధతతో పనిచేసేవారు.. ఉండి.. మా జీవన విధానాన్ని అభిమానించే వారు.. ఏ దేశం వారైనా సరే వీసాలు పొందవచ్చు'' అని ట్రంప్ యంత్రాంగానికి చెందిన ఓ ఉన్నతాధికారి వెల్లడించారు.

ట్రంప్ ఆరోగ్యం భేష్

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని, ఆయనకు ఎలాంటి మానసిక సమస్యలూ లేవని వైట్‌హౌస్ ఫిజిషియన్ వెల్లడించారు. ట్రంప్ మానసిక సామర్థ్యంపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో వీటికి ముగింపు పలికేందుకు వార్షిక వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికయ్యాక వైద్య పరీక్షలు చేయించుకోవడం ఇదే తొలిసారి. ట్రంప్ సామర్థ్యంపై ఆయన సలహాదారులే ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఇటీవల ప్రచురితమైన ఓ పుస్తకంలో పేర్కొనడం దుమారం రేపింది. దీంతో తనకు కాగ్నిటివ్ టెస్టు నిర్వహించాలని ట్రంప్ తనను కోరినట్టు డాక్టర్ రోనీ జాక్సన్ చెప్పారు. ట్రంప్‌కు నిర్వహించిన అన్ని పరీక్షల్లో ఆయన పూరిపూర్ణ ఆరోగ్యంగా ఉన్నట్టు తేలిందని, అధ్యక్ష పదవిలో కొనసాగేంత వరకూ ఇలాగే ఉంటారని తెలిపారు. శుక్రవారం మిలటరీ వైద్యులు 3 గంటల పాటు ట్రంప్‌కు పరీక్షలు నిర్వహించినట్టు వెల్లడించారు. అన్ని పరీక్షల్లో నార్మల్‌గా ఉన్నట్టు తేలిందని, 30కు 30 స్కోరు వచ్చినట్టు తెలిపారు. కాగా అల్జీమర్ వంటి వ్యాధులతో బాధపడే వృద్ధులకు ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తారు.

లోయిర్ బెర్తులపై బాదుడే!


- పండగ సీజన్‌లో ప్రత్యేక మోత
- రద్దీలేనప్పుడు టికెట్లపై రాయితీ
- రైల్వే బోర్డుకు చార్జీల కమిటీ సిఫారసు
- అమోదిస్తే ప్రయాణికులపై భారమే



న్యూఢిల్లీ, జనవరి 17: రైలులో దూర ప్రయాణాలు చేసేవారు దిగువ బెర్తులను కోరుకుంటున్నారా? అలాగే.. పండగల సీజన్‌లో రైలులో ప్రయాణించాలనుకుంటున్నారా? అయితే మీ చేతి చమురు వదలాల్సిందే. ఎందుకంటే.. దిగువ బెర్తులు ఎంపిక చేసుకునేవారు, పండగల సీజన్‌లో ప్రయాణించే వారి నుంచి అధిక టికెట్ ధరలు వసూలు చేయాలని రైల్వే చార్జిల కమిటీ సిఫారసు చేసింది. ఒకవేళ వీటిని రైల్లే బోర్డు కనుక ఆమోదిస్తే ప్రయాణికులపై పెను భారం పడనుంది. ఎయిర్‌లైన్స్, హోటళ్ల తరహాలో రైల్వేలోనూ టికెట్ ధరలను పెంచాలని, ఇదే విధానాన్ని అవలంబించాలని కమిటీ సూచించింది. అలాగే, నిర్దిష్ట మార్గంలో అనుకూల సమయాల్లో నడిచే రైళ్లు, ప్రజాదరణ ఎక్కువగా ఉండే రైళ్లలోనూ చార్జీలను పెంచాలని సూచించింది. పండగల సీజన్‌లో టికెట్ ధరలు పెంచాలని, రద్దీ పెద్దగా లేని సమయాల్లో తక్కువ చార్జీలు వసూలు చేయాలని, అసౌకర్యంగా ఉండే సమయాల్లో గమ్యస్థానాలకు చేరే రైళ్లలోని ప్రయాణికులకు రాయితీలను ఇవ్వాలని సిఫారసు చేసింది.

21న పార్టీ ప్రకటన


- ఆరోజు నుంచి రాష్ట్ర పర్యటన: కమల్ హాసన్



చెన్నై, జనవరి 17: తన పార్టీపేరును ఫిబ్రవరి 21న రామనాథపురంలో ప్రకటిస్తానని, అదే రోజు నుంచి రాష్ట్రవ్యాప్త పర్యటన ప్రారంభిస్తానని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ప్రకటించారు. తన సొంత ఊరైన రామనాథపురంలో మొదలయ్యే యాత్ర.. మదురై, దిండిగల్, శివగంగ జిల్లాల మీదుగా సాగుతుందని, అది దశలవారీగా ఉంటుందని చెప్పారు. పార్టీ పేరుతో పాటు తమ విధానాలను కూడా అదేరోజు ప్రకటిస్తానని తెలిపారు. ప్రజల అవసరాలేంటి, వాళ్ల ఆశలు.. ఆకాంక్షలు ఏంటనే విషయాలను యాత్రలో తెలుసుకుంటానన్నారు. ఇది తిరుగుబాటు కాదు, గ్లామర్ కోసం జనాన్ని పోగుచేయడమూ కాదని స్పష్టం చేశారు. ప్రజలను నిజంగా అర్థం చేసుకోడానికి తనకు వచ్చిన అవకాశం మాత్రమేనన్నారు. మన దేశాన్ని, రాష్ట్రాన్ని సాధికారం చేయడానికి తనతో చేతులు కలపాలని.. అందరినీ త్వరలోనే కలుస్తానని కమల్ చెప్పారు.

హక్కులకు మరణ శాసనం!

- పౌరులను భయపెట్టే నిరంకుశత్వానికి దారి
- ఆధార్‌పై సుప్రీం కోర్టులో పిటిషనర్ల వాదన
- సంక్షేమ పథకాల లబ్ధి అర్హులకే చేరే మార్గం
- సామాన్యులకు ఇబ్బందులేవీ లేవు: సర్కారు
- కొనసాగాలి... డీఎల్ఏఐ అభ్యర్థన దరఖాస్తు



న్యూఢిల్లీ, జనవరి 17: పౌరుల విశిష్ట గుర్తింపునకు ఉద్దేశించిన ఆధార్‌ను 'మహా ఎలక్ట్రానిక్ గందరగోళ' వ్యవస్థగా పిటిషనర్లు అభివర్ణించారు. బుధవారం చీఫ్ జస్టిస్ దీపక్‌మిశ్రా నేతృత్వంలో న్యాయమూర్తులు ఎ.ఎం.ఖన్విల్కర్, ఎ.కె.సిక్రీ, డి.వై.చంద్రచూడ్, అశోక్ భూషణ్‌లు సభ్యులుగా ఉన్న రాజ్యాంగ ధర్మాసనం ఈ అంశంపై తుది విచారణ ప్రారంభించింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ వాదన వినిపించారు. ఆధార్ వ్యవస్థ దేశాన్ని 'నిఘా రాజ్యం' దిశగా తీసుకెళ్తుందని ఆయన ఆరోపించారు. 'వ్యక్తిగత గోప్యత' ప్రాథమిక హక్కును ఇది ఉల్లంఘిస్తున్నదని పేర్కొన్నారు. ఇది ''పౌర హక్కులకు మరణ శాసనం'' వంటిదని, 'ప్రజా రాజ్యాంగాన్ని ప్రభుత్వ రాజ్యాంగం'గా మార్చే ప్రయత్నంలో భాగమని స్పష్టం చేశారు. అలాగే పౌరులందరికీ ఆధార్‌ను తప్పనిసరిచేసే అధికారాన్ని సర్కారుకు కట్టబెట్టే 2016 నాటి చట్టాన్ని కూడా వ్యతిరేకించారు. ప్రజలను భయపెట్టి ప్రభుత్వ నిరంకుశత్వానికి దారితీసే మార్గంగా ఆధార్‌ను అభివర్ణించారు. వ్యక్తిగత జీవవైవిధ్య సమాచారాన్ని ఇవ్వడంపై ప్రజలకు నిర్ణయాధికార స్వేచ్ఛ లేకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. అయితే, ప్రభుత్వ వారి వాదనను తోసిపుచ్చుతూ ఆధార్‌తో ఒనగూడే ప్రయోజనాలను ఏకరవు పెట్టింది.

నేరగాళ్లకు సింహస్వప్నం: సర్కారు

ఆధార్‌తో వ్యక్తిగత గోప్యతకు భంగం కలుగబోదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ వ్యవస్థద్వారా సమ్మిళిత వృద్ధి, పేదల సాధికారత సాధ్యం కాగలవని రాజ్యాంగ ధర్మాసనం దృష్టికి తెచ్చింది. ఆధార్ వ్యవస్థ వల్ల సామాన్యులకు ఎలాంటి ఇబ్బందులూ లేవని తెలిపింది. పిటిషనర్ల వాదనలో వాస్తవం లేదని, వివిధ సంక్షేమ పథకాల్లో అర్హులు మాత్రమే లబ్ధి పొందడాన్ని ఆధార్ సులభతరం చేసిందని తెలిపింది. దేశంలో 76 కోట్ల బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానించామని, దీనివల్ల ఎలాంటి చిక్కులు తలెత్తలేదని వివరించింది. అక్రమార్జన చలామణీ (మనీ లాండరింగ్) ఉగ్రవాద చర్యలకు ఇది సింహస్వప్నంగా రూపొందినట్లు వాదించింది. ఆధార్‌లో బయోమెట్రిక్ వివరాలు తప్ప వ్యక్తుల ఇతర వివరాలన్నీ ఓటరు గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి ధ్రువీకరణ పత్రాల్లో ఉన్నవేనని తెలిపింది. ఇవి అన్ని వెబ్‌సైట్లలో లభ్యమవుతున్నాయని, ఆస్తుల క్రయవిక్రయాల్లో వేలిముద్రలు సేకరణ శతాబ్దం నుంచీ కొనసాగుతున్నదని గుర్తుచేసింది. డిజిటల్ గుర్తింపును చాలా దేశాలు భద్రత కోసం ఉపయోగిస్తున్నాయని, ఆధార్‌వల్ల నిరుపేదలకు అందాల్సిన ప్రయోజనాలు తప్పుదారిపట్టబోవని హామీ ఇచ్చింది. ఆధార్ భాండాగారంలోని పౌరుల వ్యక్తిగత సమాచార భద్రతకు ప్రత్యేక చట్టం తేవాలని నిర్ణయించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఆధార్‌ను అనధికారికంగా ఉపయోగించే వారిపై క్రిమినల్ కేసులు పెట్టేలా చట్టాన్ని రూపొందిస్తున్నట్లు పేర్కొంది. ఈ ముసాయిదాపై జస్టిస్ శ్రీకృష్ణ నేతృత్వంలోని కమిటీ త్వరలో నివేదిక ఇవ్వనుందని చెప్పింది. దేశ జనాభా 130 కోట్లు కాగా, ఇప్పటికే 119 కోట్ల మందికి ఆధార్ సంఖ్య జారీచేసినట్లు వెల్లడించింది. ఆధార్ అనుసంధానం తర్వాత నకిలీ గ్యాస్ కనెక్షన్ల తొలగింపు సాధ్యమైందని, దీనివల్ల ఖజానాకు రూ.57వేల కోట్ల మేర సబ్సిడీ ఆదా అయిందని తెలిపింది. అలాగే ఆధార్ తోడ్పాటుతో 80వేల మంది నకిలీ ఉపాధ్యాయులను గుర్తించినట్లు మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ కూడా పేర్కొంది. సబ్సిడీ బిల్లు తగ్గింపు, జాతీయ జనాభా రిజిస్టర్‌లో ద్విగుణ నమోదు తొలగింపు ప్రధాన లక్ష్యాలుగా ఆధార్ ప్రాజెక్టుకు యూపీఏ ప్రభుత్వం 2009-10లో శ్రీకారం చుట్టింది. అయితే, 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రధాని మోదీ జనాభా రిజిస్టర్‌ను పక్కనబెట్టి ఆధార్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. అంతేగాక పిల్లల విషయంలో ఐదేళ్లు నిండి వేలిముద్రలు, కనుపాపల గుర్తింపు లభించేదాకా ఆగే పద్ధతికి స్వస్తి చెప్పారు. నవజాత శిశువులకూ ఆధార్ జారీని తప్పనిసరి చేశారు.

ప్రైవేటు కంపెనీల సంఘం 'జోక్యం' అభ్యర్థన

ఆధార్ కొనసాగాలని కోరుతూ వివిధ ప్రైవేటు కంపెనీల సంఘం డిజిటల్ లెండర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (డీఎల్ఏఐ) 'అభ్యర్థన దరఖాస్తు' దాఖలు చేసింది. ఆధార్ వల్ల కలిగే సంక్షేమ ప్రయోజనాలను అందులో వివరిస్తూ- రాజ్యాంగ ధర్మాసనం తుది విచారణ ప్రారంభించే ముందు దరఖాస్తు సమర్పించింది. అయితే, దీన్ని విచారణకు స్వీకరించడంపై న్యాయమూర్తులు ఇంకా నిర్ణయం ప్రకటించ లేదు. మరోవైపు వ్యక్తిగత గోప్యత విషయంలో ఆధార్ ఎన్నడూ రాజీపడబోదని ఈ ప్రాజెక్టుకు తొలుత నేతృత్వం వహించిన నందన్ నీలేకని ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు. ప్రజలకు సాధికారత దిశగా ఇది తగిన 'గుర్తింపు' పరిష్కారమని ఆయన పేర్కొన్నారు. అయితే, ప్రభుత్వంతోపాటు ప్రైవేటు సంస్థలు కూడా వ్యక్తుల సమస్త సమాచారాన్ని ఒడిసిపట్టేందుకు ఆధార్ వీలు కల్పిస్తుందని విమర్శకులు పేర్కొంటున్నారు. వ్యక్తులేగాక వారి మిత్రులు, బంధువుల వివరాలు, ధన వినియోగ అలవాట్లు, ఆస్తుల సమాచారంసహా సర్వం నిల్వ చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సయోధ్యకు మరో యత్నం

- 'నలుగురి'లో ముగ్గురితో సీజే భేటీ
- అస్వస్థత.. జస్టిస్ చలమేశ్వర్ సెలవు
- 'లోయా కేసు' మరో ధర్మాసనానికి..

న్యూఢిల్లీ, జనవరి 17: సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, నలుగురు సీనియర్ జడ్జిల మధ్య తలెత్తిన సంక్షోభ పరిష్కారం దిశగా బుధవారం మరో ప్రయత్నం జరిగింది. ఈ మేరకు సీజేపై బహిరంగ ఆరోపణలు చేసిన 'ఆ నలుగురి'లో ముగ్గురు భోజన విరామ సమయంలో ఆయనతో సమావేశమయ్యారు. అయితే, సీజేపై ప్రధానంగా ఆరోపణలు గుప్పించిన జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అస్వస్థతవల్ల సెలవు పెట్టడంతో ఈ సమావేశంలో పాల్గొనలేదని న్యాయస్థానం వర్గాలు తెలిపాయి. కాగా, ఈ భేటీలో వారి మధ్య నడిచిన సంభాషణ గురించి ఎలాంటి వివరాలూ వెల్లడి కాలేదు. మంగళవారం ఈ నలుగురితో 15 నిమిషాలపాటు సమావేశమైన చీఫ్ జస్టిస్ 'అన్ని అంశాలపైనా' చర్చించారని కోర్టు వర్గాలు చెప్పిన సంగతి తెలిసిందే. అలాగే బుధవారం మరోసారి భేటీ అవుదామని ఆయన ప్రతిపాదించారు. అయితే, ముఖ్యమైన కేసుల విచారణకు ఉద్దేశించిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనాన్ని మంగళవారం ఏర్పాటు చేసిన సీజే- ఈ నలుగురిలో ఎవరికీ అందులో స్థానం కల్పించలేదు. ఈ పరిణామం నేపథ్యంలో జస్టిస్ చలమేశ్వర్ సెలవు పెట్టడం గమనార్హం. ఇక 2014లో అమిత్ షా (బీజేపీ ప్రస్తుత అధ్యక్షుడు) ఆరోపణలు ఎదుర్కొన్న సోహ్రబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును విచారించిన జడ్జి బి.హెచ్.లోయా అదే ఏడాది డిసెంబరులో హఠాత్తుగా మరణించారు. ఈ నేపథ్యంలో అమిత్ షాను నిర్దోషిగా ప్రకటించేందుకుగాను లోయాకు భారీ మొత్తంలో లంచం ఇవ్వజూపినా నిరాకరించినట్లు ఆయన సోదరి అనూరాధా బియానీ ఆరోపించారు. అయితే, లోయా మృతిపై విచారణ కోరుతూ సుప్రీం కోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. దీని విచారణ బాధ్యతను సుప్రీం కోర్టులో 10వ స్థానంలో ఉన్న జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనానికి సీజే ఇటీవల కేటాయించారు. ఈ పరిణామమే గత శుక్రవారం నలుగురు జడ్జిల తిరుగుబాటుకు దారితీసింది. ఈ పరిస్థితుల నడుమ సదరు కేసును 'సముచిత ధర్మాసనానికి బదిలీ చేయాల'ని ఆదేశాలిస్తూ అరుణ్ మిశ్రా బుధవారం ఆదేశాలిచ్చారు. మరోవైపు లఖ్‌నవ్ వైద్య కళాశాలకు అనుమతి కుంభకోణం కేసుకు సంబంధించి ఒడిసా హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ ఐ.ఎం.ఖుద్దూసీ బుధవారం ఢిల్లీలోని ఓ కోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసులో లంచం ఆరోపణలమీద అరెస్టయిన ఖుద్దూసీ ప్రస్తుతం బెయిలుపై ఉన్నారు. ఈ నేపథ్యంలో సదరు కుంభకోణానికి సంబంధించి తనకు, మరో ఇద్దరు వ్యక్తులకు మధ్య సాగిన సంభాషణ టేపులు మీడియా చేతికి చిక్కడంపై దర్యాప్తు కోరుతూ ఆయన పిటిషన్ వేశారు. ప్రత్యేక కోర్టు జడ్జి మనోజ్ జైన్ దీన్ని విచారణకు స్వీకరించి, ఈ నెల 22లోగా స్పందించాలని ఆదేశిస్తూ సీబీఐకి నోటీసులు జారీచేశారు.


• రజనీకాంత్

'బాహుబలి 2'ని అధిగమించిన '2.0'

రజనీకాంత్, శంకర్ కాంబినేషన్‌లో హై టెక్నికల్ వేల్యూస్‌తో, భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న చిత్రం '2.0'. వీరిద్దరి కలిసి చేసిన 'రోబో' చిత్రం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీంతో '2.0' చిత్రంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఏప్రిల్‌లో సమ్మర్ స్పెషల్‌గా రిలీజ్ కానున్న ఈ చిత్రం బిజినెస్‌పరంగా ఇప్పటి నుంచే రికార్డులు సృష్టిస్తోంది. కేరళలో ఈ సినిమా పంపిణీ హక్కులను ఓ సంస్థ రూ.16 కోట్లకు సొంతం చేసుకుందని సమాచారం. 'బాహుబలి 2' పంపిణీ హక్కులు రూ. 10.5 కోట్లకు అమ్ముడు పోయాయి. ఈ విషయంలో 'బాహుబలి 2' చిత్రాన్ని అధిగమించింది '2.0'. మొదట ఈ చిత్రాన్ని జనవరి 25న విడుదల చేయాలని భావించారు. గ్రాఫిక్ వర్క్ వల్ల ఏప్రిల్‌కి వాయిదా పడింది. సమ్మర్‌లోనే మహేష్ కొత్త సినిమా 'భరత్ అనే నేను', అల్లు అర్జున్ సినిమా 'నా పేరు సూర్య' చిత్రాలు కూడా విడుదల కాబోతుంది. ఈ రెండు సినిమాలతో పోలిస్తే '2.0' బిగెస్ట్ ప్రాజెక్ట్ అని చెప్పాలి. ఈ విషయంలో 'భరత్ అనే నేను', 'నా పేరు సూర్య' చిత్రాల నిర్మాతలు ఆందోళన చెందుతున్నారని సమాచారం.

పవన్ కల్యాణ్ 'చరిత్ర'

ఎన్నో భారీ అంచనాల మధ్య విడుదలైన పవన్‌కల్యాణ్ కొత్త సినిమా 'అజ్ఞాతవాసి' కంటెంట్ పరంగానే కాదు, కలెక్షన్ల పరంగానూ నిరాశపరచింది. ఈ నేపథ్యంలో పవన్‌కల్యాణ్ చెయ్యబోయే కొత్త సినిమాకి సంబంధించిన టైటిల్ ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆర్.టి.నేసన్ దర్శకత్వంలో ఎ.ఎం.రత్నం నిర్మించే చిత్రంలో పవన్ కల్యాణ్ నటిస్తారనే వార్త గత కొంతకాలంగా వినిపిస్తోంది. అయితే ఈ వార్తలో నిజం లేకపోలేదని తెలుస్తోంది. ఈ సినిమా కోసమే 'చరిత్ర' అనే టైటిల్‌ని కూడా రిజిస్టర్ చేశారని, ఆ టైటిల్‌నే ఖరారు చేస్తారని సమాచారం. 'అజ్ఞాతవాసి' కోసం ఎదురుచూసి నిరాశకు లోనైన అభిమానుల కోసం పవన్ కొత్త సినిమాని త్వరలోనే ప్రారంభించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ సినిమాతోపాటు సంతోష్ శ్రీన్‌వాస్ దర్శకత్వంలోనూ పవన్ సినిమా చేయనున్నారు. మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించే అవకాశం ఉంది.



అందరూ ఎంజాయ్ చేసేలా...

'నేను నా జీవితంలో జరిగే విషయాలను పాజిటివ్ కోణంలోనే చూస్తాను. దేవుడిపై భారం వేసి ఏది జరిగితే అది జరగని అని వదిలేస్తాను' అని అంటున్నారు హీరో అశిష్ రాజ్. వి.కె.ఎ. ఫిలింస్ బ్యానర్‌పై ఈయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఇగో'. సుబ్రహ్మణ్యం ఆర్.వి. దర్శకుడు. విజయ్ కరణ్, కౌశల్ కరణ్, అనిల్ కరణ్ నిర్మాతలు. ఈ సినిమా జనవరి 19న విడుదలవుతున్న సందర్భంగా హీరో అశిష్‌రాజ్ పాత్రికేయులతో మాట్లాడుతూ ''ఆకతాయి చిత్రం సిటీ బ్యాక్‌డ్రాప్‌లో జరుగుతుంది. అందులో నేను కాలేజ్ స్టూడెంట్ పాత్రలో కనపడ్డాను. 'ఇగో' సినిమా విషయానికి వస్తే..ఇందులో అమలాపురం యువకుడిగా కనపడతాను. నేను చిన్నప్పటి నుండి రాజమండ్రి, తిరుపతి తదితర ప్రాంతాల్లో తిరగడం వల్ల షూటింగ్ సమయంలో ఎక్కడా ఇబ్బంది పడలేదు. ఒరిజినల్ లోకేషన్స్‌లో షూటింగ్ చేశాం. ఈ సినిమాలో ఆంధ్ర యాసలో మాట్లాడతాను. అల్లరి చిల్లరిగా స్నేహితులతో తిరిగే నాకు... హీరోయిన్‌కు మధ్య టీజింగ్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. ఓ సందర్భంలో హీరోయిన్‌తో ఛాలెంజ్ చేసి సిటీకి వచ్చిన హీరోకి అక్కడ ఎలాంటి పరిస్థితులు ఎదురువుతాయనేదే సినిమా. దర్శకుడు సుబ్రహ్మణ్యంగారు చాలా క్లారిటీతో తనకు ఎలాంటి అవుట్‌పుట్ కావాలో దాన్ని నటీనటుల నుండి రాబట్టుకున్నారు. సినిమాకు సాయికార్తీక్‌గారు చక్కటి సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను అందించారు. తప్పకుండా సినిమా అందరూ ఎంజాయ్ చేసేలా ఉంటుంది. నా తదుపరి సినిమాకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. అన్నీ ఓకే కాగానే వివరాలను తెలియజేస్తాను'' అన్నారు.


• ఆశిష్ రాజ్

'తొలి ప్రేమ' ఆడియో


• వరుణ్‌తేజ్

వరుణ్ తేజ్ కథానాయకుడిగా ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పి పతాకంపై నిర్మితమవుతున్న చిత్రం 'తొలిప్రేమ'. రాశి ఖన్నా హీరోయిన్‌గా నటిస్తుంది. వెంకీ అట్లూరి దర్శకుడు. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మాత. ఈ సినిమాను ఫిబ్రవరి 9న విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సినిమా పాటలను జనవరి 20న విడుదల చేస్తున్నారు. నిర్మాత బివిఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ '''తొలి ప్రేమ' హదయానికి హత్తుకునే ప్రేమకథ. వరుణ్ తేజ్ కొత్త పాత్రలో కనపడతారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, నిన్నిలా నిన్నిలా చూశానే...అనే సాంగ్‌కు ప్రేక్షకుల నుండి చాలా మంచి స్పందన వచ్చింది. తమన్ సంగీతం అందించిన ఈ మూవీ సాంగ్స్‌ను జనవరి 20న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాం. అలాగే ఫిబ్రవరి 9న సినిమాను విడుదల చేస్తున్నాం'' అన్నారు.

క్రీడా నేపథ్యంలో...


• బెల్లంకొండ శ్రీనివాస్

ఒక్కడు సినిమా అంటే కబడ్డీ... సై అంటే రగ్బీ ఆటలే ప్రేక్షకులకు గుర్తుకొస్తాయి. కథలో ఈ క్రీడలు ముఖ్య భూమిక పోషించాయి. ఇప్పుడు అలాంటి క్రీడా నేపథ్యమున్న సినిమాలో నటించోతున్నారు యువ కథానాయకుడు బెల్లంకొండ శ్రీనివాస్. ప్రస్తుతం 'సాక్ష్యం' అనే యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు ఇది శ్రీవాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. దీని తర్వాత శ్రీనివాస్ క్రీడా నేపథ్యమున్న సినిమాలో నటిస్తారు. ఆసక్తికరమైన విషయమేమంటే.. ఈ సినిమాను దర్శకుడు ఓంకార్ తెరకెక్కిస్తారట. 'రాజుగారి గది', 'రాజుగారి గది2' వంటి హారర్ చిత్రాలతో దర్శకుడిగా మంచి పేరు సంపాదించిన ఓంకార్ ఈసారి భిన్నంగా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ సినిమా చేయబోతున్నారు మరి. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని సమాచారం.


• నవీన్

'ఊరంతా అనుకుంటున్నారు'

నవీన్ విజయ్ కృష్ణ కొత్త చిత్రం 'ఊరంతా అనుకుంటున్నారు'. రోవస్కైర్ ఎంటర్ టెన్మెంట్స్ యు అండ్ ఐ ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్స్‌పై శ్రీహరి మంగళంపల్లి, ఎ.పద్మనాభరెడ్డి సంయుక్తంగా నిర్మించనున్నారు. బాలాజీ సనాల దర్శకుడు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ జనవరి 22 నుంచి మొదలవుతుంది. ఇందులో అవసరాల శ్రీనివాస్ కీలకపాత్ర పోషించనున్నారు. లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను హీరో సాయిధరమ్ తేజ్ ట్విట్టర్ లో రిలీజ్ చేశారు. నవీన్ విజయ్ కృష్ణ, శ్రీనివాస్ అవసరాల, మేఘా చౌదరి, సోఫియా సింగ్, జయసుధ, అన్నపూర్ణమ్మ తదితరులు ముఖ్యపాత్రలు పోషించనున్న ఈ చిత్రానికి కథ: శ్రీరమ్య– శ్రీమంగలం, సంగీతం: కె.ఎం.రాధాకృష్ణ, సినిమాటోగ్రఫీ: జి.లింగబాబు, లైన్ ప్రొడ్యూసర్: శ్రీరమ్య గోగుల.

సినిమాటోగ్రాఫర్ డబ్ల్యు.బి.రావు మృతి



ప్రముఖ సినిమాటోగ్రాఫర్ డబ్ల్యు.బి.రావు మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న రావు మంగళవారం ముంబైలోని భారతీయ ఆరోగ్య నిధి హాస్పిటల్‌లో కన్ను మూశారు. 1987లో ముకుల్ ఆనంద్ దర్శకత్వంలో రూపొందిన 'ఇన్సాఫ్' చిత్రంతో సినిమాటోగ్రాఫర్‌గా పరిచయమైన డబ్ల్యు.బి.రావు 30 సంవత్సరాలపాటు అనేక సూపర్‌హిట్ చిత్రాలకు అందమైన సినిమాటోగ్రఫీని అందించారు. ఆయన చేసిన సినిమాల్లో హమ్, ఖుదా గవా, రంగీలా, రాజా హిందుస్తానీ, జుడ్వా, ధడ్కన్ చిత్రాలు ముఖ్యమైనవి. డబ్ల్యు.బి.రావు మృతి పట్ల బాలీవుడ్ ప్రముఖులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

బికినీకి రెడీ!


• త్రిదా చౌదరి

'సూర్య వర్సెస్ సూర్య' తర్వాత త్రిదా చౌదరి తెలుగులో నటిస్తున్న చిత్రం 'మనసుకు నచ్చింది'. ఈ సినిమాలో గ్లామర్ పాత్రలో మెప్పించడానికి త్రిదా సిద్ధమైంది. 'సినిమాలో ప్రతి పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంది. ప్రేమ, ఎమోషన్స్, విలువలతో పాత్రలను మంజులగారు డిజైన్ చేశారు. మనసుకు నచ్చింది సినిమాలో గోవాకు చెందిన అమ్మాయి నిక్కి అనే అమ్మాయి పాత్రలో కనపడతాను. ఈ సినిమాలో బికినీ వేసుకున్నాను. బికినీ వేసుకోవడానికి ఎలాంటి రూల్స్ పెట్టుకోలేదు' అంటూ త్రిదా చెప్పుకొచ్చింది. చాలా గ్యాప్ తర్వాత తెలుగు సినిమాలో కనపడుతున్నప్పటికీ తన అందచందాలతో కుర్రకారుని కట్టిపడేయడానికి ముందుకొచ్చింది ముద్దుగుమ్మ.

పోలీస్ బాస్ దీపికా




• దీపికా పదుకునే

బాలీవుడ్ అందాల భామ దీపికా పదుకునే నటించిన 'పద్మావత్' హిందీ చిత్రం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి అడుగడుగునా వివాదాలు చుట్టుముట్టడంతో దీపికా వార్తల్లో నిలిచింది. ఈ చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె ఇప్పటివరకూ పద్మావత్ పాత్ర వేషధారణలో భారీ ఎత్తున నగలు ధరించి, చీరకట్టులో కనిపించేది. కానీ, అందుకు భిన్నంగా ఈసారి దీపికా పదుకునే.. ఇలా పోలీసు దుస్తుల్లో మెరిసి అందరిని అలరిస్తోంది. అయితే ఖాకీ దుస్తుల్లో పోలీసు బాస్‌లా జీపుపై దర్జాగా కూర్చుని ఉన్న ఆమె ఫొటోలు ఇప్పుడు ట్విట్టర్‌లో వైరల్‌గా మారాయి. వైరల్ అయిన ఆ ఫొటోలలో పోలీసు యూనిఫాం ధరించిన దీపికా పదుకునే.. జీపు మీద స్టైల్‌గా కూర్చుని పోలీసు బాస్‌లా కనిపించింది. ఈ ఫొటోలను చూసిన ఆమె అభిమానులంతా ఫిదా అయిపోతున్నారు. ఇప్పటివరకూ పద్మావత్‌గా కనిపించిన దీపికా.. ఓ సంస్థకు సంబంధించిన ప్రకటన కోసమే ఇలా ఖాకీ దుస్తుల్లో రఫ్‌గా కనిపిస్తుందని బాలీవుడ్‌లో టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. ఖాకీ దుస్తుల్లో కనిపించిన దీపికా ఫొటోలను చూసిన నెటిజన్లంతా తెగ కామెంట్లు పెడుతున్నారు. కాగా, సంజయ్ లీలా భన్సాలి దర్శకత్వం వహించిన పద్మావత్ చిత్రం వివాదాల నడుమ ఈ నెల 25న విడుదల కానుంది.

మర్డర్ మిస్టరీగా 'సూపర్ స్కెచ్'

మర్డర్ మిస్టరీ బ్యాక్‌డ్రాప్‌లో నడిచే థ్రిల్లర్‌గా మా 'సూపర్ స్కెచ్'ను రూపొందించాం. పూర్తిగా స్క్రీన్‌ప్లే బేస్డ్ సినిమా ఇది అని దర్శకుడు రవి చావలి అన్నారు. ఈయన దర్శకత్వంలో శ్రీ శుక్ర క్రియేషన్స్ నిర్మిస్తోన్న చిత్రం 'సూపర్ స్కెచ్'. ఎరోస్ సినిమాస్ సమర్పణలో యూ అండ్ ఐ, ఫ్రెండ్స్ ఫిల్మ్ అకాడమీ సహకారంతో తెరకెక్కుతోంది. బలరామ్ మక్కల నిర్మాత. నర్సింగ్, ఇంద్ర, సమీర్ దత్త, కార్తీక్, చక్రి మాగంటి, అనిక, సుభాంగీ, సోఫియా (ఇంగ్లాండ్), గ్యారిటోన్ టోనీ (ఇంగ్లాండ్), బంగారాజు, బాబా కీలక పాత్రధారులు. దర్శకుడు రవి చావలి మాట్లాడుతూ ''ఒక పోలీసాఫీసర్, ఒక ఫారిన్ అమ్మాయి, నలుగురు క్రిమినల్స్ మధ్య జరిగే కథ ఇది. పోలీసును ముప్పుతిప్పలు పెట్టి, మూడు చెరువుల నీళ్లు తాగించిన క్రిమినల్స్ పాత్రలు ప్రధానంగా తెరకెక్కించాం. ప్రతి సెకనూ ఏమవుతుందోనని ఉత్కంఠభరితంగా సాగేలా టైట్ స్క్రీన్ ప్లే ఉంటుంది. ఎవరూ ప్రెడిక్ట్ చేయని విధంగా సాగే చిత్రమిది. హైదరాబాద్, విజయవాడ, బాపట్ల సూర్యలంక బీచ్, వికారాబాద్ ఫారెస్ట్‌లో షూటింగ్ చేశాం. 50 రోజుల్లో చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం ఎడిటింగ్ జరుగుతోంది. ఫిబ్రవరి ఆఖరున గానీ, మార్చిలోగానీ సినిమాను విడుదల చేస్తాం'' అని తెలిపారు.


• సోఫియా

నాబార్డు, హడ్కో ద్వారా నిధులు



- రెవెన్యూ లోటు కింద 7500 కోట్లు
- అరుణ్ జైట్లీని కోరిన చంద్రబాబు
- ఢిల్లీలో కేంద్ర మంత్రితో సీఎం భేటీ
- సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరు



అమరావతి, జనవరి 17 (మనం ప్రతినిధి): ఈఏపీ ద్వారా కాకుండా నాబార్డు, హడ్కో ద్వారా నిధులు ఇవ్వాలని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కోరినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. రెవెన్యూ లోటు కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.4 వేల కోట్లు మాత్రమే ఇచ్చారని, ఇంకా కేంద్రం నుంచి నిధులు రావాల్సి ఉందన్నారు. రెవెన్యూ లోటు కింద రూ.7500 కోట్లు ఇవ్వాలని జైట్లీని కోరానని తెలిపారు. ఢిల్లీలో అరుణ్ జైట్లీతో చంద్రబాబు సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు జైట్లీని ఆహ్వానించినట్టు చెప్పారు. ప్రత్యేక ప్యాకేజీ, రెవెన్యూ లోటు భర్తీ తదితర అంశాలపై ఆయనతో చర్చించానన్నారు. ప్రత్యేక ప్యాకేజీలో కేంద్రం 90 శాతం, రాష్ట్రం 10 శాతం నిధులను భరించాలని సీఎం అన్నారు. అలాగే రాష్ట్రంలో అసెంబ్లీ స్థానాల పెంపు అంశంపైనా చర్చించినట్టు చెప్పారు. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. అన్ని రాష్ట్రాలతో సమానంగా ఏపీ అభివృద్ధి చెందే వరకూ చేయూత ఇవ్వాలని కేంద్రమంత్రిని కోరినట్టు చంద్రబాబు చెప్పారు. గవర్నర్ మార్పుపై ముఖ్యమంత్రిగా తాను స్పందించనన్నారు. బీజేపీ ఎంపీ హరిబాబు ఇటీవల గవర్నర్ అంశంపై కేంద్రానికి రాసిన లేఖ ఆ పార్టీకి సంబంధించిన అంశమని స్పష్టం చేశారు. అంతకుముందు ఢిల్లీలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సు- 2018 సన్నాహక సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. సులభతర వాణిజ్యంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని, రాష్ట్రంలో ఉత్తమమైన మౌలికవసతులు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణలను అమలు చేస్తున్నామన్నారు. ఫైబర్ గ్రిడ్ ద్వారా 15 ఎంబీపీఎస్ వేగంతో ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ కనెక్షన్ ఇస్తున్నట్టు చెప్పారు. సింగపూర్ ప్రభుత్వం సైతం రాష్ట్రంతో కలిసి పనిచేస్తోందన్నారు. గ్రీన్ క్యాపిటల్ నిర్మాణం చేపడుతున్నామని, అమరావతి పెట్టుబడులకు అవకాశాలు ఉన్న నగరమని.. దేశంలో ఉత్తమ నగరంగా రూపొందించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రి సురేశ్ ప్రభు, పలు దేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు.



పండ్ల పక్వానికి కార్బైడ్ వాడొద్దు

- వాడితే క్రిమినల్ చర్యలు: దినేశ్ కుమార్

అమరావతి, జనవరి 17 (మనం ప్రతినిధి): కృత్రిమ పద్ధతిలో పండ్ల పక్వానికి కాల్షియం కార్బైడ్ వాడే వ్యాపారులపై చట్టప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్ హెచ్చరించారు. బుధవారం సచివాలయంలో ఆహార కల్తీ అంశంపై జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్బైడ్ వల్ల ప్రజల ఆరోగ్యానికి తీరని నష్టం కలిగిస్తోందని, వాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీనిపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరీక్ష ల్యాబ్‌లను మరింత బలోపేతం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విపత్తులను ఏ విధంగా ఎదుర్కొంటామో అదే రీతిలో వీటిని కూడా ఎదుర్కొనేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని దినేశ్ కుమార్ అన్నారు. కాగా వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పండ్లు పక్వానికి ఇథలీన్ చాంబర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామని ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య వివరించారు. విశాఖలో ఉన్న ల్యాబ్‌ను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు తిరుపతి, గుంటూరు తదితర ప్రాంతాల్లో ల్యాబ్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి బి. రాజశేఖర్, సమాచార కమిషనర్ ఎస్. వెంకటేశ్వర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళిగా సేవా కార్యక్రమాలు

- 22వ వర్ధంతి సందర్భంగా రక్తదానం: టీడీపీ

అమరావతి, జనవరి 17 (మనం ప్రతినిధి): టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు నివాళిగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి ఎ.వి.రమణ తెలిపారు. ఎన్టీఆర్ 22వ వర్ధంతి సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. అలాగే ఎన్టీఆర్ ఫోటో ఎగ్జిబిషన్ కూడా ఉంటుందన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, విజయవాడలోని రమేశ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కళావెంకట్రావు, మంత్రి నారా లోకేశ్ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని రమణ పిలుపునిచ్చారు.

ఈఎస్ఐ ఉత్తర్వులు రద్దు

- 2న అధికారులు హాజరు కావాలని..హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జనవరి 17 (మనం లీగల్ ప్రతినిధి): విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌లో దినసరి భత్యంపై పనిచేసే కార్మికులకు సంబంధించి ఈఎస్ఐ నిధులు జమచేయాలని ఆ సంస్థ ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు రద్దు చేసింది. కార్పొరేషన్‌లో పని చేస్తున్న స్వయం సహాయక సంఘాలు, పారిశుద్ధ్య కార్మికులకు ఈఎస్ఐ అమలు చేయాలన్న ప్రతిపాదనపై వివరణ ఇచ్చేందుకు ఫిబ్రవరి 2న ఈఎస్ఐ అధికారులు హైకోర్టుకు హాజరుకావాలని జస్టిస్ ఎస్వీ భట్ ఆదేశించారు. రెగ్యులర్ కాని కార్మికులకు కూడా ఈఎస్ఐ అమలు చేయాలని ఈఎస్ఐ అధికారుల ఆదేశాలను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ హైకోర్టులో సవాల్ చేసింది. దీనిని విచారించిన హైకోర్టు ఆ ఉత్తర్వులను రద్దు చేసి.. తదుపరి విచారణను వచ్చే నెల 2కు వాయిదా వేసింది.



ఆర్టీసీ బస్సు, కారు ఢీ.. ముగ్గురి మృతి


- ఇద్దరికి తీవ్ర గాయాలు.. కర్నూలు జిల్లాలో ప్రమాదం

నంద్యాల (క్రైం), జనవరి 17 (మనం న్యూస్): కర్నూలు జిల్లా పాణ్యం సమీపంలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు, కారు ఢీకొనడంతో ముగ్గురు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. మహానంది మండలం ఎం తిమ్మాపురం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ చంద్రమౌళి సెలవులపై ఇటీవలే స్వగ్రామానికి వచ్చారు. ఆయన తన భార్య, స్నేహితులతో కలసి మహేంద్ర లోగాన్ కారులో కర్నూలుకు బయలుదేరారు. పాణ్యం సమీపంలోని నూలు మిల్లు దగ్గర కారును, ఎదురుగా వేగంగా వస్తున్న కడప డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రమౌళి భార్య తోట పద్మావతి (30) అక్కడకక్కడే మృతి చెందగా.. చంద్రమౌళి, డ్రైవర్ రవి (32), స్నేహితులు హేమచంద్ర గౌడ్ (34), హరిప్రసాద్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హుటాహుటిన సమీపంలోని శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తీసుకువెళ్లాలని డాక్టర్లు సూచించారు. కర్నూలుకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో డ్రైవర్ రవి, హేమచంద్రగౌడ్ చనిపోయారు. చంద్రమౌళి, హరిప్రసాద్ పరిస్థితి విషమంగా ఉంది. కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

రైతు బజార్‌కు కొత్తరూపు

అన్నింటికీ 'మోడల్' మెరుగులు.. 86 రైతు బజార్ల ఆధునికీకరణ.. నియోజకవర్గానికొకటి ఏర్పాటు లక్ష్యం

- తొలుత 50 చోట్ల నిర్మాణానికి కసరత్తు
- ఒక్క 'పశ్చిమ'లోనే 34 చోట్ల ఏర్పాటు
- వీటన్నింటిలనూ శీతల గిడ్డంగులు!
- దిగుమతి చేసుకునే కూరగాయల నిల్వ
- రైతుల పంటలనూ ఉంచే యోచన



అమరావతి, జనవరి 17(మనం ప్రతినిధి): రాష్ట్రంలోని రైతు బజార్లు కొత్తరూపు సంతరించుకోబోతున్నాయి. ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధిలో భాగంగా ఆధునిక హంగులు అద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. అన్ని హంగులతో పదివేల జనాభాకు ఒక రైతు బజార్‌ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. రాష్ట్రంలో ప్రస్తుతం 13 జిల్లాలో 86 రైతు బజార్లు ఉన్నాయి. వీటిన్నంటినీ ఆధునిక సాంకేతిక విధానాలతో మోడల్ రైతు బజార్లుగా తీర్చిదిద్దటానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. మార్చి చివరికల్లా అన్ని రైతుబజార్లకు మోడల్ మెరుగులు దిద్దాలని నిర్దేశించింది. అలాగే రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో కనీసం ఒక్క మోడల్ రైతు బజారు చొప్పున ఉండేలా చూడాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా తొలుత రాష్ట్ర వ్యాప్తంగా 50 చోట్ల వీటిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే వీటిలో 34 రైతు బజార్లను ఒక్క పశ్చిమ గోదావరి జిల్లాకే కేటాయించింది. ఇక మిగిలిన 16 రాష్ట్రంలో అవసరమైన చోట ఏర్పాటు చేయాలని భావిస్తోంది. దీనికి సంబంధించిన పనులు చేపట్టేందుకు మార్కెటింగ్ శాఖ ఇప్పటికే రంగంలోకి దిగింది. అవసరమైన నిధులను కూడా మంజూరు చేసింది. వీటిని వీలైనంత త్వరగా పూర్తి చేయడం ద్వారా దళారీల బెడద తగ్గించి ఇటు రైతులకు, అటు వినియోగదారులకు నాణ్యమైన, ఉత్తమ సేవలను అందించేందుకు కసరత్తు చేస్తోంది. ప్రతి నియోజకవర్గంలో ఒక రైతు బజార్‌ను ఏర్పాటు చేసి కూరగాయల రైతులకు మద్దతు ధర అందించడంతో పాటు వినియోగదారులకు తాజా కూరగాయలు అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. స్థల లభ్యత ఆధారంగా ప్రతి నియోజకవర్గంలోనూ రైతు బజార్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. కృష్ణా జిల్లాలో ఇప్పటికే 17 రైతుబజార్లు వినియోగదారుల అవసరాలు తీరుస్తుండగా మరో ఐదు బజార్ల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అన్ని మోడల్ రైతుబజార్లలో సీసీ కెమెరాలు, కూరగాయల రేట్లు వినియోగదారులందరికీ కనిపించే విధంగా ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డులు, స్త్రీ, పురుషులకు ప్రత్యేకంగా మరుగుదొడ్ల సౌకర్యం, పూర్తిగా సిమెంట్ ఫ్లోరింగ్, ఆకర్షణీయంగా ఉండే విధంగా పెయింట్స్, బయో వ్యర్థాల నిర్వహణ విధానం, ప్రతి రైతుబజార్‌లో వైఫై సౌకర్యం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి రైతు బజార్‌లో వీలైతే క్యాంటీన్ సౌకర్యం, మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని మార్కెటింగ్ శాఖ కమిషనర్ శామ్యూల్ ఆనంద్ వెల్లడించారు.

కోల్డ్ స్టోరేజీతో రైతుకు అండ

రైతు కష్టాన్ని వృథా కానీయకుండా.. రైతు బజార్లలోనే శీతల గిడ్డంగులను ఏర్పాటు చేసేందుకు మార్కెటింగ్ శాఖ కసరత్తు చేస్తోంది. అలాగే మన రాష్ట్రంలో దొరకని కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుని రైతు బజార్లలోనే నిల్వ చేయాలని భావిస్తోంది. ముఖ్యంగా బంగాళదుంప, క్యారెట్, బీట్‌రూట్, బీన్స్, క్యాబేజీ తదితర కూరగాలయను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాలని యోచిస్తోంది. ప్రస్తుతం బంగాళాదుంపలను మధ్యప్రదేశ్, కోల్‌కత్తా నుంచి వ్యాపారులు ఎక్కువగా దిగుమతి చేసుకుంటారు. కానీ ఇవే కూరగాయలను ఆ రాష్ట్రాల కన్నా అతి తక్కువ ధరకు లభించే యూపీ, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల నుంచి భారీ ఎత్తున దిగుమతి చేసుకుని నిల్వ చేసే విధానంలో సాధ్యాసాధ్యాలను మార్కెటింగ్ శాఖ పరిశీలిస్తోంది. రాష్ట్రంలో రైతులు పండించిన కూరగాయలను ఈ కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ చేసుకునే విధంగా నిర్మాణం చేపట్టాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రైతు బజార్లలో రోజుకు ప్రతి రైతుకు దాదాపు 20 శాతం కూరగాయలు మిగిలిపోతున్నాయి. దీనితో చివరి క్షణంలో రైతులు వాటిని వచ్చిన కాడికి అమ్ముకుని ఇంటి దారిపడుతున్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారు. ఆకుకూరలు సాయంత్రానికి ఎండిపోతున్నాయి. ఎండిపోయిన సరుకను వినియోగదారులెవరూ కొనకపోయే సరికి... వాటిని అక్కడే పడేసి వెళ్లిపోతున్నారు. దీంతో కోల్డ్ స్టోరేజ్‌లను రైతుబజార్లలో లేదా వాటికి సమీపంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విషయంలో సహకారం అందించేందుకు వరల్డ్ వెజిటబుల్ సెంటర్‌తో మార్కెటింగ్ శాఖ అవగాహన ఒప్పందం చేసుకుంది. కాగా శీతలగిడ్డంగులు ఏర్పాటు చేస్తే వినియోగదారుల రద్దీని బట్టి ఏ సమయంలో ఎన్ని కూరగాయలు అవసరం అవుతాయో అన్ని మాత్రమే రైతులు గిడ్డంగి నుంచి బయటకు తీసుకువస్తారు. ఈ తాజా విధానం మూలంగా వ్యవసాయ ఉత్పత్తుల వృథాను అరికట్టి, రైతుతో పాటు, వినియోగదారునికి తాజా కూరగాయలు అందించడానికి వీలవుతుంది. అయితే గిడ్డంగుల నిర్వహణ వ్యయం, రైతులపై పడే భారం వంటి అంశాలపై మార్కెటింగ్ శాఖ కసరత్తు చేస్తోంది. వీటి అంచనాలపై ప్రభుత్వానికి నివేదిక అందించి... ఆనక తుది నిర్ణయం తీసుకోనుంది.


త్వరలో మెగా సీడ్ పార్కు

- త్వరితగతిన పనుల ప్రారంభం
- వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి
- గ్లైసెల్ నిషేధానికి నిర్ణయం



అమరావతి, జనవరి 17 (మనం ప్రతినిధి): గ్లైసెల్ వాడకంపై జూన్ నుంచి నవంబరు వరకు నిషేధించాలని నిర్ణయించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు. తర్వారా రాష్ట్రంలో అనుమతి లేని హెర్బిసైడ్ టాలరెంట్ కాటన్ పంట సాగును సమర్థవంతంగా నిలుపుదల చేయటానికి అవకాశం ఉండదన్నారు. బుధవారం ఆయన సచివాలయంలో వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను అయోవా యూనివర్సిటీ ప్రతినిధులు కలిశారు. మెగా సీడ్ పార్కు ఏర్పాటుకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదికను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అయోవా సహకారంతో రాష్ట్రంలో త్వరలో మెగా సీడ్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన పనులను త్వరితగతిన ప్రారంభిస్తామని సోమిరెడ్డి పేర్కొన్నారు. అయోవా సహకారంతో నంద్యాలలోని మహానంది కాలేజీలో ఫిబ్రవరిలో శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర అవసరాల దృష్ట్యా నాఫెడ్ ద్వారా 13 వేల టన్నుల మినుములను కొనుగోలు చేస్తామని ఆయన వెల్లడించారు. సుబాబుల ధరపై జీవోను విడుదల చేస్తామని, రాష్ట్రమంతటా ఒకే రేటు రూ. 4200 ఒకే ధరకు కొనుగోలు చేస్తామని మంత్రి సోమిరెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో వ్యవసాయ అనుబంధ రంగాల్లో 25.6 శాతం వృద్ధి రేటు నమోదైందని చెప్పారు. మామిడి, బొప్పాయి, నిమ్మ, టమాట, మిరప, పసుపు పంటల దిగుబడిలో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. వరి, వేరుశెనగ, మొక్కజొన్న ఉత్పత్తుల్లో రెండో స్థానంలో ఉందన్నారు. భూపరీక్షా కార్డుల పంపిణీలో వరుసగా రెండు సార్లు దేశంలో ప్రథమ స్థానంలో రాష్ట్రం నిలిచిందన్నారు. రాష్ట్రంలో రూ.171 కోట్ల వడ్డీ లేని రుణాలను, 8 లక్షల 30 వేల మందికి విడుదల చేశామన్నారు.

ప్రతి ఇంటికి కుళాయి



- రూ.6300 కోట్లతో మొదటి దశ పనులు
- నెలాఖరుకు మూడున్నర లక్షల వీధి దీపాలు
- త్వరితగతిన డంప్ యార్డుల నిర్మాణం
- అధికారులతో సమీక్షలో లోకేశ్ ఆదేశం

అమరావతి, జనవరి 17 (మనం ప్రతినిధి): ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీటిని అందించే పథకాన్ని త్వరలో ప్రారంభించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిధులు, బ్యాంకుల నుంచి నిధులు కలిపి రూ. 6,300 కోట్లతో వీలైనంత త్వరగా మొదటి దశ పనులు ప్రారంభించాలని సంబంధింత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ సుజల కార్యక్రమం ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను డ్యాష్‌బోర్డుకు అనుసంధానం చేయాలని సూచించారు. ఎన్టీఆర్ సుజల ద్వారా చేపడుతున్న క్లస్టర్ల నిర్మాణం మరింత వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17వేల ఓవర్‌హెడ్ ట్యాంక్‌లో సెన్సార్లు ఏర్పాటు చేసి నీటి నాణ్యతను పర్యవేక్షించాలన్నారు. పైలెట్ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి, రాష్ట్ర పరిస్థితులకు తగినట్టుగా టెక్నాలజీపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కలుషిత తాగునీటి ద్వారా ప్రజలు అనారోగ్యం పాలయ్యే సంఘటనలు ఇక మీదట ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. 157 గ్రామాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులకు కావాల్సిన టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, పనులు ప్రారంభించాలని సంబంధింత అధికారులను కోరారు. ఈ నెలాఖరు నాటికి మూడున్నర లక్షల వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అమర్చిన ప్రతి బల్బు సీసీఎమ్ఎస్ విధానం ద్వారా అనుసంధానం చేయాలని సూచించారు. డంప్ యార్డులు నిర్మాణం పూర్తయిన 355 గ్రామాల్లో ప్రతి ఇంటికి వెంటనే ఆర్ఎఫ్ఐడీ కార్డులు అమర్చాలన్నారు. అన్ని గ్రామాల్లో డంప్ యార్డుల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నేషనల్ రూరల్ అర్బన్ మిషన్‌లో భాగంగా మొదటి దశలో భాగంగా చేపడతున్న 5 క్లస్టర్లు (వెంకటాచలం, కంబాదూర్, సింగరాయకొండ, అరకు, కుప్పంలో) టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని అధికారులను లోకేశ్ ఆదేశించారు.

బీసీలకు తోడుగా ఉంటా

- చంద్రబాబు దారుణంగా మోసం చేశారు
- పాదయాత్ర ముగిశాక బీసీ గర్జన నిర్వహణ
- ఆ సభలో డిక్లరేషన్ చేస్తాం: వైఎస్ జగన్
- చిత్తూరు జిల్లాలో ప్రజా సంకల్పయాత్ర


చిత్తూరు, జనవరి 17: దివంగత నేత వైఎస్ఆర్ చూపిన బాటలోనే తాను కూడా బీసీలకు తోడుగా ఉంటానని వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. బీసీల అభ్యున్నతి కోసం వైఎస్ఆర్ ఒక్క అడుగు ముందుకు వేశారని, తాను ఇంకో రెండు అడుగులు ముందుకు వేస్తానని పేర్కొన్నారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా 64వ రోజు బుధవారం చిత్తూరు జిల్లా పాపానాయుడుపేటలో జరిగిన బీసీ సమ్మేళనంలో జగన్ పాల్గొన్నారు. ''గడిచిన నాలుగేళ్ల పాలనలో చంద్రబాబు బీసీలను దారుణంగా మోసం చేశారు. ఎన్నికలప్పుడు మాత్రమే బీసీ జపం చేసే ఆయన.. నాలుగు ఇస్త్రీ పెట్టేలు, నాలుగు కత్తెర్లు ఇచ్చి బీసీలను బాగుచేశామని చెప్పుకుంటారు. మేనిఫేస్టోలో ప్రతి కులానికి ఒక పేజీ పెట్టారు. గౌడ సోదరులు కనిపిస్తే వారి భుజాన ఉన్న ట్యూబ్ తన భుజంపై వేసుకొని ఫోజులు కొడతారు. చేనేత కార్మికుల ఇంట్లో దూరి పక్కనే కూర్చొని ఫొటోలు దిగుతారు. ఆ ఫొటోలతో ఎన్నికల ప్రణాళిక ప్రకటించారు. రజకులను ఎస్సీలుగా గుర్తించేం దుకు చర్యలు తీసుకుంటామని, బోయలను ఎస్టీల్లో చేరుస్తామని.. ఇలా ప్రతి కులానికి హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి ఊసే మర్చి పోయారు. ఇటీవల మత్స్యకారులు కొందరు చంద్రబాబు దగ్గరికెళ్లి ఎన్నికల హామీలపై నిలదిస్తే ఆయన.. 'ముఖ్యమంత్రినే అడుగుతావా? తాటతీస్తా.. ఖబడ్దార్' అని హెచ్చరించిన సంగతి మనందరం చూశాం. సాధ్యం కాని హామీలు ఇచ్చి చంద్రబాబు ప్రతి కులాన్ని మోసం చేశాడు. మొన్న అసెంబ్లీలో బోయలను ఎస్టీలుగా చేర్చుతూ తీర్మానం చేసి కేంద్రానికి పంపారు. తద్వారా నా పనైపోయిందని చేతులు కడుక్కున్నారు. ఏమీ జరగకముందే కేకులు కట్ చేస్తారు. మరో వర్గానికి ఫోన్లు చేసి ధర్నాలు చేయమంటారు. చిత్తూరు జిల్లాలోనే పెరిక బలిజ కులస్తులు 40 సంవత్సరాలుగా బీసీలుగా ఉన్న వారు సర్టిఫికెట్ అడిగితే ఇవ్వడం లేదు. అగ్ని కుల క్షత్రియులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా దిక్కులేదు. ఇదీ.. బాబు బీసీలను మోస గిస్తున్న తీరు'' అని జగన్ విమర్శించారు. పాద యాత్ర ముగిసిన తరువాత బీసీ గర్జన నిర్వహిస్తామని, ఆ సభలో బీసీ డిక్లరేషన్ చేస్తామని చెప్పారు. అందులో బీసీలకు ఏం చేస్తామన్నది మరింత స్పష్టంగా చెబు తా మని, మీరంతా తనకు తోడుగా ఉంటే చాలా కొద్ది సమయంలోనే మార్పును చూడబోతున్నామని వైఎస్.జగన్ అన్నారు.



టాప్ గైనర్స్ 17 జనవరి
35,081.82 బి.ఎస్.ఇ సెన్సెక్స్ 310.77

		%
584.75	యాక్సిస్ బ్యాంక్	4.65%
306.35	ఎస్‌బిఐ	3.44%
343.10	ఐసీఐసీఐ బ్యాంక్	2.68%
1152.25	ఇన్ఫోసిస్	2.61%
342.50	ఎస్ బ్యాంక్	2.58%
432.50	ఆదాని పోర్ట్స్	2.31%
1352.25	లార్సెన్ టూబ్రో	2.19%
266.65	ఐటీసీ	1.87%
2889.45	టీసీఎస్	1.35%
2489.40	డాక్టర్ రెడ్డీస్	1.13%





'బడ్జెట్‌లో విద్యారంగ కేటాయింపు పెంచాలి'

న్యూఢిల్లీ: రానున్న బడ్జెట్‌లో విద్యా రంగానికి కేటాయింపు పెంచాలని, ఉన్నత విద్యను జి.ఎస్.టి. నుంచి మినహాయించాలని పరిశ్రమల సంస్థ 'అసోచామ్' కోరింది. ఈ మేరకు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి అది ఒక లేఖ రాసింది. విద్యా సంస్థలపై ప్రభుత్వ పరంగా బాహ్య నియంత్రణ ఉంది. క్యాంపస్‌లలో ఉద్యమాలు తలెత్తుతాయేమోననే ఆందోళన ఉంది. ఈ పరిస్థితిలో ఉన్నత విద్యా సంస్థలు నూతన పన్ను భారాన్ని ఇముడ్చుకోగలిగిన స్థితిలో లేవు. అలాగని, ఫీజుల పెంపు ద్వారా దాన్ని బదలీ చేయగల స్థితిలోనూ లేవని 'అసోచామ్' పేర్కొంది. ''జి.ఎస్.టి. విధించిన తర్వాత, 2018 కేంద్ర బడ్జెట్ మొదటిది అవుతుంది. విద్యా రంగానికి సంబంధించి సర్వీస్ ట్యాక్స్‌లో గతంలో పదేపదే సవరణలు తెచ్చారు. ఆ వక్రీకరణలన్నింటినీ సరిదిద్దవలసిన సమయం ఆసన్నమైంది. ఉన్నత విద్యా సంస్థల లిస్టెడ్ సర్వీసులకు పన్ను రాయితీ తొలగిస్తూ చివరి సవరణను 2017 మార్చిలో తెచ్చారు. దాన్ని (ఆ సవరణను) వెంటనే ఉపసంహరించుకోవాల్సిన అవసరం ఉంది. ఉన్నత విద్యా సంస్థల పట్ల ఉన్న సమర్థించడానికి వీలుకాని వివక్షకు అంతం పలకవలసిన అవసరం ఉంది'' అని 'అసోచామ్' ఆ లేఖలో పేర్కొంది. విద్యా సంస్థల భవనాల నిర్మాణం, నిర్వహణ, మరమ్మతులకు పన్ను మినహాయింపు కల్పించాలని కోరింది. విద్యా రంగానికి జి.డి.పి.లో కనీసం 6 శాతం మొత్తాన్ని కేటాయించాలని కొఠారీ కమిషన్, ఇటీవలి కాలంలో సుబ్రమణియన్ కమిటీ (2016 నాటి జాతీయ విద్యా విధానం అనంతరం ఏర్పాటైంది) సిఫార్సు చేసిన సంగతిని 'అసోచామ్' ఈ సందర్భంగా గుర్తు చేసింది. నిపుణులు, ప్రజలు కూడా అదే అభిప్రాయంతో ఉన్నారని చెప్పింది. ఎడ్యుకేషన్ సెస్సు, సర్‌చార్జీల రూపంలో అదనపు రాబడులు సమీకరించుకుంటున్నప్పటికీ, కొంతకాలంగా విద్యా రంగంపై వాస్తవానికి ప్రభుత్వ వ్యయం దాదాపు 4 శాతం మించి ఉండడం లేదు. విద్యా రంగంలోని అన్ని స్థాయిల్లో ప్రభుత్వ వ్యయాన్ని పెంచవలసిన అవసరం ఇప్పుడు ఎంతో ఉందని 'అసోచామ్' సూచించింది.

సెన్సెక్స్ కొత్త రికార్డు



కోశ సంబంధ లోటు అదుపులో ఉండగలదనే ఆశాభావంతో మార్కెట్లలో ఉప్పొంగిన ఉత్సాహం సూచీలను గరిష్ఠ స్థాయిలకు చేర్చింది

ముంబయి: బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బి.ఎస్.ఇ) సున్నిత సూచి బుధవారం 310 పాయింట్లు లాభపడి రికార్డు స్థాయిలో 35,082 పాయింట్ల వద్ద ముగిసింది. ప్రభుత్వం ఇంతకుముందు అనుకున్నట్లుగా అదనంగా మార్కెట్ల నుంచి రూ. 50,000 కోట్లు కాక, రూ. 20,000 కోట్లు మాత్రమే సమీకరించనున్నట్లు ప్రకటించడంతో మార్కెట్‌లో ఉత్సాహం ఉరకలేసింది. అప్పును తగ్గించుకోవడం కోశ సంబంధ లోటును అరికట్టి, లక్ష్యానికి లోబడే నిర్వహించేట్లు చేయడంలో సహాయపడవచ్చు. బి.ఎస్.ఇ. (30 షేర్ల) సెన్సెక్స్ 310.77 పాయింట్లు లాభపడి, జనవరి 15 నాటి 34,843.51 పాయింట్ల గరిష్ఠ స్థాయి రికార్డును తిరగరాసి 35,081.82 పాయింట్ల వద్ద ముగిసింది.

ఇంట్రాడేలో అది జనవరి 15 నాటి 34,963.69 పాయింట్ల గరిష్ఠ స్థితిని మెరుగుపరచుకుని 35,118.61 పాయింట్ల శిఖర స్థాయిని తాకింది. అదే మాదిరిగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్.ఎస్.ఇ) 50 షేర్ల సూచి 'నిఫ్టీ' బుధవారం 88.1 పాయింట్లు లాభపడి జనవరి 15 నాటి 10,741.55 పాయింట్ల రికార్డును బద్దలుకొట్టి, 10,788.55 పాయింట్ల వద్ద ముగిసి కొత్త రికార్డును నెలకొల్పింది. బి.ఎస్.ఇ.లోని అన్ని రంగాల సూచీలు లాభపడ్డాయి. యంత్రాలు, యంత్ర పరికరాల సూచి అత్యధికంగా 1.59 శాతం లాభపడగా, బ్యాంకింగ్ (1.55 శాతం), పి.ఎస్.యు. (1.41 శాతం), ఐ.టి. (1.28 శాతం) లాభపడ్డాయి.

ఎఫ్.ఎఫ్.ఐ.ల కొనుగోళ్ళు

మార్కెట్‌లో లిక్విడిటీ పటిష్టంగా ఉంది. విదేశీ నిధులు నిరంతరంగా తరలివచ్చాయి. కొనుగోళ్ళు అవిచ్ఛిన్నంగా సాగాయి. కొన్ని కంపెనీల మూడవ త్రైమాసిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండడం కూడా ఆనందోత్సాహాలను పెంచింది. తాత్కాలిక డాటా ప్రకారం, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు మంగళవారం రూ. 693.17 కోట్ల విలువ చేసే షేర్లను కొనుగోలు చేయగా, దేశీయ మదుపు సంస్థలు నికరంగా రూ. 246.38 కోట్లు విలువ చేసే ఈక్విటీలను విక్రయించాయి.

ఉప్పొంగిన సెంటిమెంట్

కంపెనీలు ప్రకటించబోయే మూడవ త్రైమాసిక ఫలితాలు మెరుగ్గా ఉంటాయనే ఇన్వెస్టర్ల అంచనా కూడా దేశీయ సెంటిమెంట్ ఉత్సాహంగా నిలవడానికి కారణమైంది. ముఖ్యంగా గత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన క్వార్టరు ఫలితాలపై పెద్ద నోట్ల రద్దు ప్రభావం చూపింది. ఈసారి అటువంటిదేమీ లేకపోవడంతో కార్పొరేట్ ఫలితాలు మెరుగ్గా ఉంటాయని భావిస్తున్నారు. ''మార్కెట్లు ఈ వారంలో నూతన గరిష్ఠ స్థాయిలను తాకుతున్నాయి. మదుపరులు ఆ అవకాశాన్ని అందిపుచ్చుకుంటున్నారు. కొద్దిపాటి కొనుగోళ్ళతో మార్కెట్లో కొంత స్థిరత్వం కనిపిస్తోంది'' అని రెలిగేర్ సెక్యూరిటీస్ లిమిటెడ్‌లో రిటైల్ రిసెర్చ్ విభాగాధిపతి హితేశ్ అగర్వాల్ చెప్పారు. డాలరుతో రూపాయి మారకం విలువ మంగళవారం పడిపోవడంతో ఐ.టి. కంపెనీల షేర్ల ధరలు పెరిగాయి. అవి రాబడులకు అమెరికాపై ఎక్కువగా ఆధారపడి ఉండడం అందుకు కారణం.

బలపడిన రూపాయి

బుధవారంనాడు ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్‌లో అమెరికా డాలరుతో రూపాయి మారకం విలువ 25 పైసలు మెరుగుపడి రూ. 63.75గా నిలిచింది.

'అదనపు అప్పు రూ. 20 వేల కోట్లు చాలు'




న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంతకు ముందు అనుకున్నట్లుగా మార్కెట్ నుంచి అదనంగా రూ. 50,000 కోట్లుకాక, రూ. 20,000 కోట్ల రుణాన్ని స్వీకరిస్తే సరిపోతుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ బుధవారం తన ప్రణాళికను సవరించుకుంది. దీనితో గీటురాయిగా భావించే 10 ఏళ్ళ బాండ్ల ప్రతిఫలాలు 15 బేసిస్ పాయింట్లకు పైగా తగ్గాయి. ఈ మార్చితో ముగిసే 2017-18 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం అదనంగా రూ. 50,000 కోట్లు సమీకరించే అవకాశం ఉందని ఆర్థిక మంత్రిత్వ శాఖ గత నెలలో ప్రకటించింది. ''రెవిన్యూ రాబడులు, ఖర్చుల తీరుతెన్నుల ధోరణులను సమీక్షించిన తర్వాత, ఆర్థిక అవసరాలు తీరేందుకు ప్రభుత్వ సెక్యూరిటీల ద్వారా అదనంగా రూ. 20,000 కోట్లు సమీకరిస్తే సరిపోతుందని మదింపు చేయడం జరిగింది'' అని ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2017-18లో డేటెడ్ సెక్యూరిటీల ద్వారా మార్కెట్ నుంచి అదనంగా రూ. 50,000 కోట్లు సమీకరించనున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ డిసెంబర్ 27న ప్రకటించింది. ''రాబడులు, ఖర్చుల ధోరణిని పరిశీలనలోకి తీసుకుని ప్రభుత్వం అదనపు రుణ అవసరాలను పునఃసమీక్షించింది'' అని ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ చెప్పారు. కడచిన మూడు వేలంపాటలలోని రూ. 15,000 కోట్ల అదనపు రుణ స్వీకరణను కేంద్రం ఆమోదించలేదని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. మిగిలిన రూ. 15,000 కోట్లను రానున్న వారాలకు ఉద్దేశించిన నోటిఫైడ్ రుణ కార్యక్రమం నుంచి తగ్గిస్తామని తెలిపింది. అయితే, 2017-18 బడ్జెట్‌లో నిర్దేశించిన నికర రుణ కార్యక్రమాలలో ఎలాంటి మార్పూ లేదు. తీసుకునే అప్పును తగ్గించుకోవడం కోశ సంబంధ లోటును లక్ష్యం లోపలే అరికట్టగలగడంలో తోడ్పడవచ్చు. వర్తమాన ఆర్థిక సంవత్సరానికి డేటెడ్ సెక్యూరిటీల ద్వారా మార్కెట్ నుంచి రూ. 43,000 కోట్ల మేరకు రుణం స్వీకరించవలసి ఉంటుందని ప్రభుత్వం 2017-18 బడ్జెట్‌లో అంచనా వేసింది. జి.ఎస్.టి. నుంచి రెవిన్యూ వసూళ్ళు క్షీణించడం, పన్నులయేతర రాబడి తక్కువగా ఉండడంతో అనుకున్న రీతిలోనే కోశ సంబంధ లోటును అరికట్టగలమా అనే విషయంలో ప్రభుత్వం ఆందోళన చెందింది. ప్రభుత్వం 2017-18లో స్థూల రుణాలు రూ. 5.8 లక్షల కోట్ల మేరకు, నికర రుణాలు రూ. 4.23 లక్షల కోట్ల మేరకు ఉండగలవని బడ్జెట్‌లో పేర్కొంది. తాజా గణాంకాల ప్రకారం, కోశ సంబంధ లోటు లక్ష్యం 2017 నవంబరులో 2017-18 సంవత్సరపు బడ్జెట్ అంచనాను మించి 112 శాతంగా నమోదైంది. జి.ఎస్.టి. వసూళ్ళు తగ్గడం, ప్రభుత్వ వ్యయం అధికంగా ఉండడం దానికి ప్రధాన కారణం.

బెంగాల్‌లో రూ. 750 కోట్ల పెట్టుబడులు



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని హల్దియాలో కంపెనీకున్న వంట నూనెల శుద్ధి కర్మాగార ఉత్పాదక సామర్థ్యాన్ని రెండింతలు చేసేందుకు రూ. 750 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు అదానీ గ్రూప్ బుధవారం ప్రకటించింది. ''ఉన్న అవకాశాన్ని బట్టి'' పోర్టులు, వ్యవసాయం, విద్యుదుత్పాదన రంగాలలో పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీ చూస్తోందని అదానీ విల్మర్ (అదానీ గ్రూప్‌లో భాగం) మేనేజింగ్ డైరెక్టర్ ప్రణవ్ అదానీ చెప్పారు. ''అవకాశం లభిస్తే, ఇక్కడ బెంగాల్‌లో మేం ముంద్రా పోర్టు లాంటిదాన్ని ఏర్పాటు చేస్తాం. మేం పునరుత్పాదక ఇంధన వనరులు, విద్యుత్తు, ట్రాన్స్‌మిషన్ రంగాల్లో కూడా ఉన్నాం. మేం బెంగాల్‌లో ప్రత్యక్షంగా-పరోక్షంగా 4,500 ఉద్యోగాలు సృష్టించాం'' అని అదానీ ఇక్కడ జరుగుతున్న బెంగాల్ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్ 2018 (పెట్టుబడిదార్ల వార్షిక శిఖరాగ్ర సమావేశం) రెండవ రోజున చెప్పారు. వంట నూనెల శుద్ధి సామర్థ్యాన్ని రోజుకు 800 టన్నుల నుంచి 1600 టన్నులకు అదానీలు ఇప్పటికే ఐదేళ్ళ కాలంలో పెంచారు. ప్యాకేజింగ్ సామర్థ్యాన్ని కూడా 1200 టన్నుల నుంచి 1800 టన్నులకు పెంచుతున్నారు. వ్యవసాయ లాజిస్టిక్స్, గిడ్డంగుల నిర్మాణ, నిర్వహణ రంగాల్లో ఉన్న అవకాశాలను కూడా కంపెనీ అన్వేషిస్తోందని ప్రణవ్ అదానీ చెప్పారు.

వ్యవసాయ ఎగుమతులకు ఊతం



న్యూఢిల్లీ: భారతదేశం నుంచి వ్యవసాయ ఎగుమతులు 2017-18 సంవత్సరం ఏప్రిల్-అక్టోబర్ కాలంలో 18 శాతం వృద్ధి చెంది 21 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుకున్నట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సంతోష్ సారంగి చెప్పారు. అవి 2016-17 సంవత్సరంలో 5 శాతం మాత్రమే వృద్ధి చెందినట్లు ఆయన తెలిపారు. ఇండస్ ఫుడ్ పేరుతో రేపటి నుంచి భారతదేశపు మెగా అంతర్జాతీయ ఆహార, పానీయాల ట్రేడ్ షో మొదలవుతోంది. దీనిలో 400 మందికి పైగా ఎగ్జిబిటర్లు పాల్గొంటున్నారు. ఇది సుమారు 43 దేశాల నుంచి కొనుగోలుదార్లను ఆకర్షిస్తుందని భావిస్తున్నారు. కొత్త మార్కెట్లు, కొత్త ఉత్పత్తులను గుర్తించడం ద్వారా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఎగుమతులు పెంపొందించే లక్ష్యంతో ఉందని సారంగి చెప్పారు. తాము వ్యవసాయ ఎగుమతుల విధాన ముసాయిదా పత్రాన్ని తయారు చేస్తున్నామని, దానిపై ఈ అంశంతో సంబంధం ఉన్నవారి స్పందనలు కోరతామని, ఇందులో రాష్ట్రాలు కూడా పాలుపంచుకునేట్లు చేస్తామని ఆయన చెప్పారు. ఉన్నత స్థాయిలో ఆమోదాలు అవసరమైతేనే ఆ పత్రాన్ని కేంద్ర మంత్రివర్గం ముందు ఉంచుతామని చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు 2020 నాటికి (2015లో ఉన్న 31 బిలియన్ డాలర్ల నుంచి రెండింతలై) 60 బిలియన్ డాలర్లకు చేర్చడానికి మంత్రిత్వ శాఖ కృషి చేస్తోంది. రైతుల ఆదాయాన్ని 2020 నాటికి రెండింతలు చేయాలన్న ప్రధాన మంత్రి ఆశయ సాధనకు ఇది తోడ్పడుతుందని భావిస్తున్నారు.

హెచ్.యు.ఎల్‌కు పెరిగిన నికర లాభం



ముంబయి: వేగంగా అమ్ముడుపోయే వినియోగ వస్తువుల రంగ (ఎఫ్.ఎం.సి.జి) దిగ్గజం హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్.యు.ఎల్) 2017 డిసెంబరు 31తో ముగిసిన త్రైమాసికంలో, గత ఆర్థిక సంవత్సరం అదే కాలంలో కన్నా 28 శాతం పెరుగుదలను కనబరుస్తూ రూ. 1,326 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అంతర్లీనంగా అమ్మకాల్లో వృద్ధి 11 శాతంగా ఉంది. గత ఆర్థిక సంవత్సరం క్యూ 3లో రూ. 8,400 కోట్లుగా ఉన్న మొత్తం అమ్మకాలు ఈ ఆర్థిక సంవత్సరం క్యూ 3లో 4 శాతం పెరిగి రూ. 8,742 కోట్లుగా నమోదయ్యాయి. డిసెంబరు ''త్రైమాసికంలో మేం మరోసారి పటిష్ఠమైన పనితీరు కనబరచాం. విస్తృత ఆధారిత వృద్ధి వివిధ కేటగిరీలలో కనిపించింది. మార్జిన్లు మరింత మెరుగుపడ్డాయి. పరిశ్రమ మధ్యకాలిక అవకాశాలపై మేం సానుకూల దృక్పథంతో ఉన్నాం. మా కోర్ బ్రాండ్లలో, భవిష్యత్ కేటగిరీలను అభివృద్ధి చేయడంలో ఎక్కువ పెట్టుబడులు పెట్టడాన్ని కొనసాగిస్తాం. ఉత్పాదక సామగ్రి ద్రవ్యోల్బణానికి సంబంధించిన తొలి సంకేతాలు కనిపిస్తున్నాయి. ఉత్పాదక వ్యయం ఎక్కువ కాకుండా చూసే కార్యక్రమాలపై మరింతగా దృష్టి పెడతాం. పోటీనిస్తూనే, లాభదాయకతను నిలబెట్టుకునే విధంగా మా వ్యాపారాన్ని చైతన్యవంతంగా నిర్వహించుకుంటాం'' అని కంపెనీ చైర్మన్ హరీశ్ మన్వానీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వడ్డీ, పన్నులు, తరగుదల, రుణ విమోచన ఖర్చులకు ముందు ఆదాయాలలో వృద్ధి రేటు మార్జిన్ గతంతో పోలిస్తే 110 బేసిస్ పాయింట్లు పెరగడం వల్ల మార్జిన్ మెరుగుదల కొనసాగింది. అడ్వర్టయిజింగ్, అమ్మకాల ప్రోత్సాహక వ్యయాలను కంపెనీ పెంచింది. నవకల్పనకు ఆలంబనగా నిలిచేందుకు, మార్కెట్ అభివృద్ధి కార్యకలాపాలకు తగు మొత్తాలు వెచ్చించనుంది. ప్రభుత్వం 2017 నవంబరులో జి.ఎస్.టి.రేటును చాలా వాటిపై తగ్గించింది. ఈ కంపెనీ తయారు చేసే వివిధ వస్తువులపై కూడా జి.ఎస్.టి. 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గింది. కానీ, విధానంలో అకస్మాత్తుగా మార్పులు చేయడం వల్ల ఆ ప్రయోజనాన్ని కంపెనీ వినియోగదార్లకు బదలీ చేయలేకపోయింది. దీనికి సంబంధించి రూ. 119 కోట్ల అంచనా విలువను సి.బి.ఇ.సి.కి కంపెనీ వెల్లడించింది. ఆ మొత్తాన్ని ఉన్నదున్నట్లుగా ప్రభుత్వానికి చెల్లించడానికి కంపెనీ ముందుకొచ్చింది. ఈ మొత్తాన్ని రెవిన్యూగా గుర్తించలేదని, 2017 డిసెంబరు 31నాటికి దాన్ని అప్పుగా పద్దుల్లో చూపామని కంపెనీ తెలిపింది.

నేడు చమురు బ్లాకుల వేలం



న్యూఢిల్లీ: ప్రభుత్వం గురువారం 55 చమురు, సహజ వాయు అన్వేషణ బ్లాకులను వేలం వేయనుంది. మొదటి బిడ్ విడత కింద రికార్డు స్థాయిలో ఉన్న ప్రాంతాన్ని అది ఆఫరు చేస్తోంది. చమురు, సహజ వాయువు లభించడానికి అవకాశం ఉన్న ఈ రకం బ్లాకులను వేలం వేయడం ఎనిమిదేళ్ళ కాలంలో ఇదే మొదటిసారి. నూతన హైడ్రోకార్బన్ అన్వేషణ, లైసెన్సింగ్ విధానం (హెచ్.ఇ.ఎల్.పి) కింద సాగనున్న మొదటి వేలం ఇది. దీనికింద కంపెనీలు ఆ బ్లాకుల రూపురేఖలను తమ ఇష్టం వచ్చిన విధంగా నిర్ణయించుకోవచ్చు. దేశంలో చమురు, సహజ వాయు అన్వేషణ సాగవలసిన ఉన్న ప్రాంతం సుమారుగా 2.8 మిలియన్ చదరపు కిలోమీటర్ల మేరకు ఉంది. ఆ ప్రాంతంలో తమకు ఇష్టం వచ్చిన చోట కంపెనీలు అన్వేషణ మొదలుపెట్టవచ్చు. హెచ్.ఇ.ఎల్.పి. ఓపెన్ యాకరేజ్ లైసెన్సింగ్ విధానాన్ని తీసుకొచ్చిందని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ (డి.జి.హెచ్) డైరెక్టర్ జనరల్ అటను చక్రబర్తి చెప్పారు. ప్రస్తుతం ఏ ఉత్పత్తి లేదా అన్వేషణ లైసెన్సు కింద లేని ప్రాంతంలో ఎక్కడైనాసరే చమురు, సహజ వాయువు పడుతుందనుకున్నచోట అన్వేషణ సాగించేందుకు ఆసక్తి వ్యక్తపరుస్తూ లేఖలు (ఇ.ఓ.ఐలు) సమర్పించడానికి ఈ లైసెన్సింగ్ విధానం కంపెనీలకు వీలు కల్పిస్తోంది. ఏ బ్లాకులు లేదా ప్రాంతాలకు ఇ.ఓ.ఐ.లు వచ్చాయో వాటిని వేలానికి పెడతారు. ఆ ప్రాంతాన్ని మొదటగా ఎంచుకున్న వ్యక్తి లేదా సంస్థకు 5 సానుకూల మార్కులు లభిస్తాయి. ''ఇ.ఓ.ఐ.లకు గత ఏడాది జూలైలో తలుపులు తెరిచాం. నవంబరు 15తో గడువు ముగిసేనాటికి 57 బ్లాకులకు ఇ.ఓ.ఐ.లు వచ్చాయి. వాటిని పరిశీలించి, నిషిద్ధ మండలంలోని ప్రాంతాలను, అతివ్యాప్తిని తొలగించిన తర్వాత, 55 బ్లాకులు మిగిలాయి. వాటిని రేపు వేలానికి పెడుతున్నాం'' అని చక్రబర్తి చెప్పారు. ఈ 55 బ్లాకుల మొత్తం ప్రాంతం 59,282 చదరపు కిలోమీటర్లు. ''ప్రస్తుతం చమురు, సహజ వాయు అన్వేషణ సాగుతున్న 1,02,000 చదరపు కిలోమీటర్ల ప్రాంతంతో పోలిస్తే ఇది చాలా గణనీయమైనది. రేపటి విడత ప్రారంభంతో, చమురు, ఇంధన వాయువు అన్వేషణ సాగుతున్న ప్రాంత వైశాల్యం 50 శాతం పెరుగుతుంది'' అని ఆయన చెప్పారు. గత ఏడాది నవంబరు నాటికి అందిన 57 బిడ్లలో 41 బిడ్లు ప్రభుత్వ యాజమాన్యంలోని చమురు, సహజ వాయు సంస్థ (ఓ.ఎన్.జి.సి), వేదాంత లిమిటెడ్‌కు చెందిన యూనిట్ కైర్న్ ఇండియాల నుంచి వచ్చాయి. ఒక విడతలో ఒక ప్రాంతం కోసం ప్రైవేటు సంస్థ హిందూస్థాన్ ఆయిల్ ఎక్స్‌ప్లొరేషన్ కంపెనీ (హెచ్.ఓ.ఇ.సి) బిడ్ సమర్పించింది. చమురు, సహజ వాయు అన్వేషణకు 2.8 మిలియన్ చదరపు కిలోమీటర్ల వైశాల్యంలోని అవక్షేప బేసిన్‌లను తెరవడం వల్ల దేశంలో చమురు, సహజ వాయు ఉత్పత్తి పెరుగుతుందని, దిగుమతులపై అతిగా ఆధారపడడం తగ్గుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఏప్రిల్ మొదటి వారానికి బిడ్లు అందుతాయని, జూన్ నెలాఖరుకు వాటిని ప్రదానం చేయవచ్చని భావిస్తున్నారు. చమురు, సహజ వాయు అన్వేషణకు 2000 సంవత్సరం నుంచి ఇంత వరకు 256 బ్లాకులను ఆఫరు చేశారు. కడపటి విడత బిడ్డింగ్ 2010లో చేటుచేసుకుంది. వీటిలో 254 బ్లాకులు కేటాయించారు. కానీ, చమురు పడే అవకాశాలు ఏమంత లేకపోవడంతో దాదాపు 156 బ్లాకులలో అన్వేషణను ఇదివరకే విరమించుకున్నారు.

గాయత్రి ప్రాజెక్ట్స్‌కు రూ. 923 కోట్ల ఆర్డరు

న్యూఢిల్లీ: నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్.హెచ్.ఏ.ఐ) నుంచి ఒడిశాలో రూ. 923 కోట్ల విలువ చేసే రెండు రోడ్డు నిర్మాణ ప్రాజెక్టుల ఆర్డర్లను గాయత్రి ప్రాజెక్ట్స్ కైవసం చేసుకుంది. వాటిలో ఒకటి రూ. 529 కోట్ల విలువ చేసేదికాగా, రెండోది రూ. 394 కోట్ల విలువ చేసే ప్రాజెక్టు. ఒడిశాలో ఎన్.హెచ్.-42లో కటక్-అంగుల్ మధ్య నాలుగు లేన్‌ల రహదారి పునరావాస, ఉన్నతి మొదటి ప్రాజెక్టు కాగా, రెండోది ఒడిశాలో ఎన్.హెచ్.-23లో రాజమండ-బార్కోటి సెక్షన్ నాలుగు లేన్‌ల రహదారి నిర్మాణానికి సంబంధించింది. ఈ ప్రాజెక్టులను ఇంజనీరింగ్, కొనుగోళ్ళు, నిర్మాణం (ఇ.పి.సి) ప్రాతిపదికన అమలు చేయనున్నట్లు కంపెనీ తెలియజేసింది. గాయత్రి ప్రాజెక్ట్ షేర్ ధర బి.ఎస్.ఇ.లో 1.5 శాతం లాభపడి రూ. 215.95 వద్ద కోట్ అవుతోంది.



జలచరాలతో విహారం

లక్షద్వీప్... పేరులోనే లక్ష ఉంది. గూగుల్ వ్యూలో చూస్తే లెక్కపెట్టలేనన్ని ద్వీపాలు కనిపిస్తాయి. కానీ అన్ని దీవులు ఉండే అవకాశం లేదు. పచ్చదనాన్ని రంగరించుకున్న నీలం రంగులో సముద్రం, వెండి వెన్నెల లేకపోయినా సరే... తెల్లగా మెరుస్తామంటున్న తెల్లని ఇసుక తిన్నెలు, దట్టంగా అల్లుకున్న సుగంధద్రవ్యాల వృక్షాలు, స్థానిక జాలరుల సంప్రదాయ జీవనశైలి, పర్యాటక శాఖ అభివృద్ధి చేసిన అంతర్జాతీయస్థాయి హాలిడే రిసార్టులతో కనువిందు చేస్తున్న ఈ ప్రదేశాన్ని వర్ణించడానికి మాటలు చాలవు. ఒక్కో దీవిలో పర్యటిస్తూ ఇక ఈ దీవిని చూసింది చాలనిపించి ఫెర్రీ ఎక్కి మరో దీవిలోకి అడుగుపెడితే అక్కడ పర్యాటకులు వాటర్ సర్ఫింగ్‌కి సిద్ధమవుతుంటారు. ఇలా జలచరాలతో విహరించడం ఎలాగో ఈ వారం పర్యాటకంలో తెలుసుకుందాం..

లక్షద్వీప్‌లోని జలచరాలతో విహరించడానికి చాలా ఉత్సాహం చూపుతుంటారు పర్యాటకులు. నిజానికి అగ్నిపర్వతం బద్దలైనప్పుడు ఏర్పడిన ముక్కలు ఈ లక్షద్వీప్ దీవులు అని పుస్తకాల్లో చదువుతుంటాము. అరేబియా సముద్రంలో ఆఫ్రికా – ఆసియా ఖండాల వ్యాపార మార్గంలో ఉన్నాయి లక్షద్వీప్ దీవులు. పోర్చుగీసు నావికుడు వాస్కోడిగామా భారత తీరాన్ని చేరింది కూడా ఈ దీవుల మీదుగానే. వీటి పేరు లక్షదీవులు... అనే కానీ మనదేశంలోని యూనియన్ టెరిటరీల్లో చిన్నది ఇదే. భూభాగం అంతా కలిపితే విస్తీర్ణం 32 చదరపు కిలోమీటర్లకు మించదు. ఒక మోస్తరు పెద్ద దీవులు 36 ఉన్నప్పటికీ పది దీవులే జనావాసాలు. పది సబ్ డివిజన్‌లతో ఒకే ఒక జిల్లా ఇది. జనాభా పది దీవుల్లో కలిసి 65 వేలకు మించదు. స్థానికుల్లో ఎక్కువ శాతం మలయాళీలే. అధికార భాష కూడా మలయాళమే, మినికోయ్ దీవిలో నివసించే వాళ్లు మాత్రం మహిల్ భాష మాట్లాడుతారు. ఇది మాల్దీవుల్లో




మాట్లాడే భాష. ఈ దీవి మిగిలిన దీవుల సమూహానికి దూరంగా విసిరేసినట్లు ఉంటుంది. ఇక్కడి ప్రజల జీవనశైలి మిగిలిన దీవులకు భిన్నంగా ఉండదు, కానీ భాష వేరు.

లక్షద్వీప్ దీవుల్లో మనుష్య సంచారం లేని చిన్న చిన్న దిబ్బల్లాంటివి లెక్కలేనన్ని ఉంటాయి. కొన్ని దీవుల్లోకి పగడాల వేటగాళ్లు మాత్రమే అడుగుపెడుతుంటారు. ఈ కేంద్రపాలిత ప్రాంతానికి రాజధాని కరావట్టి దీవి. లక్షద్వీప్ దీవుల్లోని స్థానికులకు చేపల వేట, కొబ్బరి తోటల సాగు, కొబ్బరి పీచు తీయడం ప్రధాన వృత్తులు. అత్యంత ఖరీదైన 'ట్యూనా ఫిష్' ఇక్కడి నుంచి పెద్దమొత్తంలో ఎగుమతి అవుతుంది. ఇప్పుడు పర్యాటకం పెద్ద పరిశ్రమ అయింది. కొన్ని దీవులను పూర్తిగా టూరిస్టు రిసార్టులు, వాటర్ స్పోర్ట్స్ కోసమే డెవలప్ చేశారు. ఇలాంటి దీవుల్లో నివసించేవాళ్లంతా పర్యాటకశాఖ ఉద్యోగులే.

వలయాకారంగా ఉండే పగడపు దీవుల్లోకి విహారానికి వెళ్లడం అనే ఆలోచన జానపద సినిమాను తలపిస్తుంటే, సముద్రపు నీటి లోపలికి దూసుకెళ్లే స్కూబా డైవింగ్‌ను తలుచుకుంటేనే కళ్లు మెరుస్తాయి. సముద్రజీవరాశులను దగ్గరగా చూడడానికి పెద్దవాళ్లు ట్యూబ్‌లో వెళ్లి సంతోషపడుతుంటే... యూత్ మాత్రం అంతరిక్ష చోదకుల్లాగ ఒళ్లంతా కప్పేసే వాటర్‌ప్రూఫ్ దుస్తులు ధరించి, ఆక్సిజన్ మాస్క్ తగిలించుకుని, కళ్లకు స్విమ్మింగ్ గాగుల్స్ పెట్టుకుని జలచరాల్లా నీటిలో చక్కర్లు కొడుతూ ఆనందిస్తుంటారు. అగట్టి, బంగారం దీవుల్లో స్కూబా డైవింగ్ స్కూళ్లున్నాయి.

నీటి మీద అలలతో పోటీ పడుతూ ఎగిరి గంతులేయడాన్ని టెలివిజన్ ప్రోగ్రామ్‌లో చూసి ఆనందించడమే తప్ప స్వీయానుభవం లేని వాళ్లకు అలలతో ఆడుకోవాలనే సరదాతోపాటు కొంచెం భయం కూడా వేస్తుంది. కానీ ఇక్కడి ట్రైనర్లు 'సర్ఫింగ్ బోర్డు మీద ఎలా నిలబడాలి, అల వస్తున్న దిశకు అనుగుణంగా ఎలా కదలాలి...' వంటి ప్రాథమిక విషయాల్లో శిక్షణనిచ్చి నీటి మీదకు పంపిస్తారు. పొరపాటున నీటిలో పడిపోయినా వెంటనే బయటకు తీసుకొస్తారు.



తమాషా ఏమిటంటే... ఒకసారి పట్టుతప్పి నీటిలో పడిపోయిన వాళ్లు బయటకు వచ్చి 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకుని ఒడ్డున కూర్చొరు. కొంచెం తేరుకోగానే మళ్లీ నీటిలోకి పరుగులు తీస్తారు. ఆశ్చర్యకరంగా రెండోసారికి ఒడుపు తెలిసిపోయి అలలతో గెంతులేస్తుంటారు. మరో దీవిలోకి అడుగుపెడితే అక్కడ కొంతమంది పర్యాటకులు కేయాకింగ్(తెడ్డు పడవ)తో గాలికంటే వేగంగా నీటి మీద సాగిపోతుంటారు. ఇంతమంది ఇన్ని సాహసోపేతమైన ఆటలు ఆడుకుంటూ సముద్రాన్ని తలకిందులు చేస్తున్నప్పటికీ నీరు స్వచ్ఛంగా ఉంటుంది. అగట్టి, అమిని, అండ్రాట్, బిత్రా, చెట్లాట్, కాడ్మాట్, కాల్పెనీ, కరావట్టి, కిల్టాన్, మినికోయ్... ఈ దీవులన్నింటినీ ఒక రోజులో చుట్టేయవచ్చు.

సముద్రంలో ఎన్ని రకాల జీవరాశులుంటాయో కదా! అని చూస్తే చేపలు రకరకాల ఆకారాల్లో కనిపిస్తాయి. చేపల్లో ఇన్ని రకాలుంటాయా అని ఆశ్చర్యపోవడం మన వంతైతే సెప్టెంబరు నుంచి డిసెంబర్ మధ్యలో వచ్చిన పర్యాటకులకు షార్క్ చేపలు కూడా హలో చెప్తాయి.

అరేబియా సముద్రంలో దుర్భిణీ వేసి వెతికితే తప్ప కనిపించని ఈ దీవుల్లో మనిషి సంచరించిన ఆనవాళ్లు క్రీ.పూ 1500 నాటికే ఉన్నాయి. బుద్ధుని జాతక కథల్లో ఈ దీవుల ప్రస్తావన ఉంది... అంటే



అప్పటికే ఇక్కడ మనుషులు నివసించారనే అనుకోవాలి. ఈ కథలన్నీ పుక్కిటి పురాణాలు అని కొట్టిపారేద్దామంటే చరిత్ర అధ్యయనానికి ప్రామాణిక గ్రంథం 'పెరిప్లస్ ఆఫ్ ద ఎరిత్రియన్ సీ' కూడా దీనినే నిర్ధారించింది. ఆ తర్వాత మధ్యయుగం నాటికి ఈ దీవులను చోళులు పాలించారు. కాలానుగుణంగా బ్రిటిష్ పాలనను రుచి చూసి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సర్దార్ వల్లభాయ్ పటేల్ మన జాతీయ జెండా ఎగురవేయడంతో ఇండియాలో భాగమేనని ఖరారయ్యాయి ఈ దీవులు. స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దానికి కేంద్రపాలిత ప్రాంతంగా స్థిరపడింది ఈ దీవుల సమూహం.


చేరుకునే మార్గం

మొదటగా హైదరాబాద్ నుంచి కేరళకు చేరుకోవాలి. అక్కడి నుంచి లక్షద్వీప్‌కు దగ్గరగా ఉన్న తీరం కేరళలోని కొచ్చి నగరం. కొచ్చి నుంచి అగట్టి దీవికి ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో విమాన సర్వీసులు నడుస్తున్నాయి. అగట్టి ద్వీపంలో దిగిన తర్వాత ఇతర దీవులకు వెళ్లడానికి హెలికాప్టర్, ఫెర్రీ, షిప్, మిషన్‌బోట్ సౌకర్యం ఉంటుంది. దీవిలోపల తిరగడానికి ఆటోరిక్షాలు, క్యాబ్‌లు ఉంటాయి. రైలు మార్గం... కొచ్చి వరకు రైల్లో వెళ్లి అక్కడి నుంచి విమానం లేదా షిప్లో లక్షద్వీప్ చేరాల్సి ఉంటుంది.

ఎక్కడ ఉండాలి?

సీషెల్స్ బీచ్ రిసార్టు, ఐలాండ్ హాలిడే హోమ్, లక్షద్వీప్ హోమ్‌స్టే, కోరల్ ప్యారడైజ్, కాడ్మట్ బీచ్ రిసార్టు వంటివి చాలా ఉన్నాయి. ఒక రోజుకు ఐదు వందల రూపాయలు వసూలు చేసే గెస్ట్ హౌస్ల నుంచి ఐదు వేలు చార్జ్ చేసే రిసార్టుల వరకు ఉన్నాయి.

ఈ ప్రదేశం కేరళకు దగ్గరగా ఉండడంతో ఆ ప్రభావం ఆహారం మీద కూడా ఉంటుంది. కొబ్బరి వాడకం ఎక్కువ. వంటల్లో సుగంధద్రవ్యాల వినియోగమూ ఎక్కువే. రెస్టారెంట్లలో ప్రధానమైన మెనూలో సీఫుడ్ రకాలు ఎక్కువగా కనిపిస్తాయి. శాకాహారం కూడా దొరుకుతుంది. కేరళ నుంచి టిన్డ్ ఫుడ్



వస్తుంది.

చూడాల్సినవి: హజ్రత్ ఉబాయిదుల్లా సమాధి, కరావట్టి మసీదు, కరావట్టి అక్వేరియం, బుద్ధిస్ట్ ఆర్కియోలాజికల్ మ్యూజియం, ట్యూనా క్యానింగ్ ఫ్యాక్టరీ ప్రధానమైనవి.


సాహసాలు: కామత్ ఐలాండ్‌లో కానోయింగ్, యాచింగ్, కాయాకింగ్, స్నోర్కెలింగ్, విండ్ సర్ఫింగ్, వాటర్ స్కీయింగ్, స్కూబా డైవింగ్ వంటి చాలా రకాల వాటర్ స్పోర్ట్స్ ఉన్నాయి.

ఉల్లాసమైన ప్రయాణం



ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరిపైనా మానసిక ఒత్తిడి పెరుగుతోంది. ఈ ప్రభావం శరీరంపై పడుతుంది. లక్ష్యం చేరాలన్న ఆశతో విపరీతమైన ఒత్తిడి పెంచుకుంటే ఆ ప్రభావం మెదడు, ఇతర శరీరభాగాలపైనా పడుతుంది. అంతేకాదు, మానసిక ప్రశాంతత లేకుంటే చుట్టూ ఉన్నవారితో ఆప్యాయంగా మాట్లాడలేరు అంటున్నారు నిపుణులు. ఒత్తిడి తగ్గించుకునేందుకు రోజూ నడక, వ్యాయామం చేస్తే మంచిదని సూచిస్తున్నారు. వాటితోపాటు దూరప్రాంతాలకు విహారయాత్రలకు వెళితే మంచి ఫలితం ఉంటుందని సూచిస్తున్నారు. అలా వెళ్లే సమయంతో ఎదురయ్యే సమస్యలను అధిగమించడంపైనా దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. ఉదాహరణకు ప్రయాణంలో భాగంగా వినియోగించే వాహనాలు, రోడ్డుమార్గాలను ఓ కంట కనిపెట్టాలి. ఒకవేళ గుంతల రోడ్లపై ప్రయాణించాల్సి వస్తే తీవ్రమైన వెన్ను, మెడ సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు వెన్నునొప్పితో బాధపడుతుండగా, కార్లలో వెళ్లేవారు మోకాళ్ల నొప్పులతో అవస్థపడుతుంటారు. బాధ నుంచి విముక్తి కోసం తర్వాత ఆస్పత్రుల చుట్టూ తిరుగాల్సిన పరిస్థితి. మెడ, నడుము, మోకాళ్లకు పట్టీలు వేసుకుని, కొత్తకొత్త మెడిసిన్ తెగ వాడేస్తూ ఉంటారు. అలాకాకుండా, వాహనాలపై ప్రయాణించాల్సి వస్తే మధ్యమధ్యలో కాసేపు ఆగి, విశ్రాంతి తీసుకుంటే కొంత ఉపశమనం దొరుకుతుంది. ప్రయాణాల్లో వెన్నుపూస నిటారుగా ఉండేలా కూర్చుంటే సరిపోతుంది. గతుకుల రోడ్డుపై వెళ్తున్నప్పుడు వేగాన్ని కాస్త తగ్గిస్తే మంచిది. ఇలా చేస్తే ప్రకృతి అందాలను మనసారా ఆస్వాదించొచ్చు కూడా..

రాజభవనమే.. మ్యూజియం!



కేరళ రాష్ట్రానికి చెందిన కృష్ణాపురం ప్యాలస్ ''కాయంకులం'' రాజ కుటుంబానికి నివాస స్థలంగా ఉండేది. 18వ శతాబ్దంలో ఈ ప్యాలెస్‌ను పాలించిన ''అనిజం తిరునాళ్ మార్తాండ వర్మ'' ట్రావెన్‌కోర్ రాజవంశానికి చెందినవారు. నేడు ప్యాలెస్ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ ఆధీనంలో ఉంది. ప్యాలెస్‌లో ప్రధానంగా పరిశీలించాల్సింది భవన నిర్మాణ శైలి. విలక్షణంగా కనిపించే ప్యాలెస్ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. వాలి ఉన్నట్లు కనిపించే పైకప్పులు, ఇరుకైన కారిడార్లు, కిటికీలకు నిలువుగా ఏటవాలు పైకప్పుతో కన్యాకుమారి పద్మనాభపురం రాజభవనాన్ని పోలి ఉంటుంది. ప్రస్తుతం ఈ రాజభవనం మ్యూజియంగా సేవలు అందిస్తోంది. ఇందులో అనేక కళాఖండాలు, రాజ కుటుంబం ఉపయోగించిన వస్తువులు ప్రదర్శిస్తారు. మ్యూజియం ప్రధాన ఆకర్షణలలో ''గజేంద్ర మోక్షం'' ఒకటి. ఇది కేరళలో అతి పెద్ద కుడ్యం. ''గజేంద్ర మోక్షం'' అంటే అర్థం ''ఏనుగుకు కలిగిన మోక్షం''. ఇది హిందూ మత పురాణాల నుంచి తీసుకున్న కుడ్యం. ఇక్కడ చూడవలసిన వస్తువులలో మరో ముఖ్యమైనది కయంకులం కత్తి. ఇతర ఆయుధాల కంటే ఇది మరింత ప్రమాదకరమైనది. దీని రెండు భుజాలూ బాగా పదునుగా ఉంటాయి. బుద్ధ మండపం అనే హాలులో బుద్ధుని అరుదైన విగ్రహం కనిపిస్తుంది. అలప్పుజ చెరువుల నుంచి వెలికితీసిన నాలుగు విగ్రహాలలో ఇది ఒకటి. మ్యూజియం ఇతర ప్రదర్శనలలో భాగంగా ట్రావెన్‌కోర్ రాజ కుటుంబీకులు ఉపయోగించిన సంస్కృతంలో బైబిల్ కాపీని, నూనె దీపాలు, సూక్ష్మ సంఖ్యలు, పాత్రలకు ఇతర అంశాలకు సంబంధించిన వస్తువులు చూడవచ్చును.

మనం స్పోర్ట్స్
గురువారం, 18 జనవరి, 2018
www.manamnews.com

వాటమ్మా.. వాటీజ్ దిస్సమ్మా...



సౌతాఫ్రికా పర్యటనకు ముందు టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ, కోచ్ రవిశాస్త్రి ప్రగల్భాలు పలికారు. స్వదేశంలోనే కాదు విదేశాల్లోనూ ఇదే జోరు కొనసాగించే సత్తా ఉందని కోహ్లీ చెప్పగా.. మునుపటి భారత జట్ల కంటే ఇది ఎంతో ఉత్తమమైందని, చరిత్ర సృష్టించడం మీరే చూస్తారని శాస్త్రి అన్నారు. దీంతో నిజంగానే కోహ్లీ సేన సౌతాఫ్రికాలో ఏదో అద్భుతం చేయబోతోందని అందరూ ఎదురు చూశారు. వీరిద్దరి సంకల్ప బలంగా బాగానే ఉన్నప్పటికీ ఆచరణ లోపం కనిపించింది. భారత బౌలర్లు మాత్రం చెప్పింది చేసి చూపించారు. ప్రత్యర్థి జట్టును ముప్పతిప్పలు పెట్టి తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. కానీ బ్యాట్స్‌మెన్ ఎవ్వరూ బౌలర్లకు అండగా నిలవలేదు. తక్కువ లక్ష్యాన్ని సాధించడంలోనూ విఫలమయ్యారు. మరి ఆనాటి ప్రగల్భాలు ఏమయ్యాయి? సొంత గడ్డపైనే పులులా? విదేశీ గడ్డపై పిల్లులా?

వాటమ్మా.. వాటీజ్ దిస్సమ్మా...

రెండో టెస్టులోనూ కోహ్లీ సేన ఓటమి.. మరోసారి బ్యాటింగ్‌లో విఫలం

- బూడిదలో పోసిన పన్నీరైన బౌలర్ల శ్రమ
- 2-0తో సిరీస్ సౌతాఫ్రికా కైవసం..
- 24న జొహన్నెస్‌బర్గ్‌లో చివరి టెస్టు
- మూడు మ్యాచ్‌ల సిరీస్

సెంచూరియన్: చారిత్రక విజయాన్ని సాధించేందుకు ఐదో రోజు మరో 252 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో మిడిలార్డర్‌కు చెందిన ముగ్గురు బ్యాట్స్‌మెన్ తొలి గంటలోనే అవుటైతే టెస్టుల్లో టాప్ ర్యాంక్ జట్టుగా బరిలోకి దిగిన టీమిండియా ఆటగాళ్ల సంకల్పం, ఆలోచనా తీరును ఏమని అర్థం చేసుకోవాలి. సౌతాఫ్రికాతో ఇక్కడ జరిగిన రెండో టెస్టు మ్యాచ్ ఐదు రోజు జరిగిన ఘటన ఇది. చివరికి టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో 151 పరుగులకు ఆలౌట్ కావడంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను సౌతాఫ్రికా ఎదురులేని జట్టుగా 2-0తో కైవసం చేసుకుంది. చివరి రోజు బుధవారం నాటి ఆటలో అరంగేట్ర బౌలర్ లుంగి ఎంగిడి (6/39), కగిసొ రబాడ (3/47) స్టార్లుగా నిలిచారు. 2 గంటల 16 నిమిషాల్లో పని పూర్తి చేశారు. వీరిద్దరి క్రమశిక్షణతో కూడిన బౌలింగ్‌కు భారత బ్యాట్స్‌మెన్ వద్ద సమాధానం లేకపోయింది.

ఒకరి తర్వాత ఒకరుగా అవుటవుతున్నా వికెట్లను నిలుపుకుని డ్రా కోసం శ్రమించాలన్న జ్ఞానం ఏ ఒక్కరిలోనూ లేకపోయింది. నాలుగో రోజు సాయంత్రమే కెప్టెన్ విరాట్ కోహ్లీ పెవిలియన్ చేరుకున్నాడు. ఐదో రోజు టీమిండియాను గెలిపిస్తారన్న చిన్న ఆశ క్రీజులో ఉన్న చెటేశ్వర్ పుజారా, పార్థీవ్ పటేల్ భుజస్కందాలపై పడింది. కోట్లాది మంది భారతీయుల ఆశలను నిలబెట్టేందుకు ఈ ఓవర్ నైట్ బ్యాట్స్‌మెన్ కనీసం తొలి సెషన్ అంతా క్రీజులో ఉండాల్సింది. కానీ బుధవారం ఆట ప్రారంభమైన 16 నిమిషాలకే పుజారా అనవసరమైన మూడో రన్‌కు పోయి రనౌటయ్యాడు. దీంతో టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ల పతనం ప్రారంభమైంది. రోహిత్ శర్మ కొంత మేరకు ప్రతిఘటించాడు. కానీ అతను వన్డే తరహాలో ఆడడం కోహ్లీకి, మేనేజ్‌మెంట్‌కు చికాకు తెప్పించింది. రోహిత్‌తో కలిసి మహ్మద్ షమీ చాలా సేపు క్రీజులో ఉండడం ఆశ్చర్యమేసింది. వీరిద్దరూ ఎనిమిదో వికెట్‌కు 54 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. ఇండియా ఇన్నింగ్స్‌లో ఇదే అతి పెద్ద భాగస్వామ్యం.

అంతేకాదు టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో రోహిత్ తర్వాత 28 పరుగులు చేసిన షమీ రెండో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్‌కు ఈ మాత్రం కూడా ఆలోచన లేకపోవడం బాధించింది. అయితే లంచ్ విరామానికి ముందు చివరి ఓవర్లో రబాడ వేసిన బంతిని హుక్ షాట్ ఆడి ఫైన్ లెగ్‌లో ఉన్న డివిలియర్స్ చేతికి రోహిత్ చిక్కాడు. మరికాసేపటికి ఎంగిడి బౌలింగ్‌లో షమీ వెనుదిరిగాడు. ఈ సిరీస్‌ను కోల్పోయామన్న బాధకంటే టెస్టుల్లో నంబర్ వన్ జట్టు చివరి రోజు ఆడిన తీరు కోట్లాది మంది భారతీయులను తీవ్రంగా బాధించింది. లుంగి ఎండిగి వేసిన బంతి వికెట్లకు దూరంగా వెళుతుంటే దాన్ని కూడా ఆడబోయి హార్దిక్ పాండ్యా అవుటయ్యాడు. రోహిత్ శర్మకు అండగా నిలిచేందుకు పంపించిన రవిచంద్రన్ అశ్విన్ కూడా తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించలేకపోయాడు. లుంగి బౌలింగ్‌లోనే అశ్విన్ కీపర్ డికాక్‌కు సునాయాస క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు.

ఈ మొత్తం ఎపిసోడ్‌లో ఏ ఒక్కరిలోనూ మ్యాచ్ గెలవాలన్న పట్టుదల గానీ, కనీసం డ్రా చేసుకుని పరువు కాపాడుకోవాలన్న ఆలోచన కానీ కనిపించలేదు.

చేతులు కాలాక...

చేతులు కాలాక ఆకులు పట్టుకుని ఏం లాభం అన్న చందంగా ఉంది కోహ్లీ సేన పరిస్థితి. రెండో టెస్టు మ్యాచ్‌కు ముందు మాజీలు కొన్ని సూచనలు చేశారు. శిఖర్ ధావన్, రోహిత్ శర్మలను పక్కన పెట్టి కేఎల్ రాహుల్, రహానేలను తుది జట్టులోకి తీసుకోమని చెప్పారు. తొలి టెస్టు ఓటమి నేపథ్యంలో వెల్లువెత్తిన విమర్శలకు తలొగ్గిన కెప్టెన్ కోహ్లీ, కోచ్ రవిశాస్త్రి తూతూ మంత్రంలా రాహుల్‌ను జట్టులోకి తీసుకున్నారు. కానీ తొలి టెస్టు మ్యాచ్ ఆరంభంలోనే మూడు వికెట్లు తీసిన భువనేశ్వర్ కుమార్‌ను ఎండో టెస్టుకు పక్కన పెట్టడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. పోనీ రోహిత్ ఈ మ్యాచ్‌లోనైనా బాగా ఆడాడా అంటే అదీ లేదు. కోహ్లీ ఒక్కడే సెంచరీ చేసినంత మాత్రాన టెస్టు మ్యాచ్‌లు గెలవలేం. బౌన్సీ పిచ్‌లపై ప్రత్యర్థి సవాల్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే మంచి వ్యూహ రచన కావాలి. మంచి మాటలను పెడచెవిని పెట్టే వాళ్లకు ఇలాంటి ఫలితాలు తప్పవు. ఇప్పుడు తప్పును తెలుసుకున్నా సిరీస్ చేజారిన తర్వాత చేసేదేం లేదు. మూడో టెస్టుకు భువనేశ్వర్, రహానేలను తీసుకున్నా ఒరిగేదేమీ లేదు ఆత్మసంతృప్తి తప్ప.

టెస్టు షెడ్యూల్

72 పరుగులతో సౌతాఫ్రికా గెలుపు	తొలి టెస్టు కేప్‌టౌన్
135 పరుగులతో సౌతాఫ్రికా గెలుపు	రెండో టెస్టు సెంచూరియన్

మూడో టెస్టు జొహన్నెస్‌బర్గ్
జనవరి 24 నుంచి 28 వరకు



రెండు ఇన్నింగ్స్‌ల్లో రనౌటైన భారత తొలి క్రికెటర్‌గా పుజారా

ఒకే మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో రనౌటైన భారత తొలి క్రికెటర్‌గా చెటేశ్వర్ పుజారా రికార్డుల్లోకెక్కాడు. సౌతాఫ్రికాతో సెంచూరియన్‌లో జరిగిన రెండో టెస్టు మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో పరుగులు ఖాతా ప్రారంభించకుండానే రనౌటైన పుజారా (0) రెండో ఇన్నింగ్స్‌లో 19 పరుగులు చేసి రనౌటయ్యాడు. రెండు ఇన్నింగ్స్‌లలో రనౌట్ కావడం టెస్టు క్రికెట్‌లో ఇది 25వసారి. చివరిసారిగా 2000 సంవత్సరంలో వెల్లింగ్టన్‌లో జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో స్టీఫెన్ ఫ్లెమింగ్ ఇలా రెండు ఇన్నింగ్స్‌ల్లో రనౌటయ్యాడు. ఈ జాబితాలో హన్సీ క్రోనే, మర్వన్ అటపట్టు, ఆడమ్ పరోరె, ఇయాన్ హీలీ, మార్క్ టేలర్ కూడా ఉన్నారు.

ఇలాంటి పిచ్‌ను ఎందుకు తయారు చేశారో అర్థం కావడం లేదు: షమీ



రెండో టెస్టుకు ఉపఖండం లాంటి పిచ్‌ను సౌతాఫ్రికా ఎందుకు తయారు చేసిందో అర్థం కావడం లేదని టీమిండియా పేస్ బౌలర్ మహ్మద్ షమీ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో 287 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో నాలుగో రోజు టీమిండియా 35 పరుగులకు 3 వికెట్లు కోల్పోయిన సంగతి తెలిసిందే. 'ఈ పిచ్‌పై బంతి స్లోగా వెళుతుందని ఊహించ లేదు. ఇప్పటి వరకు విదేశీ పిచ్‌లపై ఇటువంటి స్లో, లో బౌన్స్ పిచ్‌ను చూడలేదు. ఈ పిచ్ తయారు చేసేటప్పుడు వాళ్ల మనసులో ఏముందో అర్థం కావడం లేదు. ఏది ఏమైనా వాళ్ల తయారు చేసిన పిచ్‌పైనే ఆడాలి. పరిస్థితులు ఇద్దరికీ ఒకేలా ఉన్నాయి. ఆరంభం నుంచి పిచ్ చాలా స్లోగా ఉంది. చివరి రోజు వరకు అలాగే కొనసాగింది' అని షమీ అన్నాడు.

స్కోరుబోర్డు

సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 335
టీమిండియా తొలి ఇన్నింగ్స్: 307
సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 258

ఇండియా రెండో ఇన్నింగ్స్ (ఓవర్‌నైట్ స్కోరు 35/3): పుజారా రనౌట్ 19, విరాట్ కోహ్లీ ఎల్‌బిడబ్ల్యూ (బి) ఎంగిడి 5, పార్థీవ్ పటేల్ (సి) మోర్కెల్ (బి) రబాడ 19, రోహిత్ శర్మ (సి) డివిలియర్స్ (బి) రబాడ 47, హార్దిక్ పాండ్యా (సి) డికాక్ (బి) ఎంగిడి 6, అశ్విన్ (సి) డికాక్ (బి) ఎంగిడి 3, మహ్మద్ షమీ (సి) మోర్కెల్ (బి) ఎంగిడి 28, ఇషాంత్ నాటౌట్ 4, బుమ్రా (సి) ఫిలాండర్ (బి) ఎంగిడి 2; ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం 50.2 ఓవర్లలో 151 ఆలౌట్; వికెట్ల పతనం: 4-49, 5-65, 6-83, 7-87, 8-141, 9-145, 10-151. బౌలింగ్: ఫిలాండర్: 10-3-25-0, రబాడ: 14-3-47-3, ఎంగిడి: 12.2-3-39-6, మోర్కెల్: 8-3-10-0, మహరాజ్: 6-1-26-0.



టీమిండియాకు 'లుంగీ' డాన్స్

సెంచూరియన్‌లో జరిగిన రెండో టెస్టు మ్యాచ్‌లో సౌతాఫ్రికా అరంగేట్ర బౌలర్ లుంగి ఎంగిడి తొలి మ్యాచ్‌లోనే 6 వికెట్లు తీసి రికార్డు సృష్టించాడు. అంతేకాదు టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో కోహ్లీ సేనను లుంగి డాన్స్ చేయించాడు. నాలుగో రోజు ఆటలో తొలుత కేఎల్ రాహుల్, విరాట్ కోహ్లీలను పెవిలియన్ పంపిన ఎంగిడి ఐదో రోజు ఆటలో హార్దిక్ పాండ్యా, ఆర్ అశ్విన్, మహ్మద్ షమీ, బుమ్రా వికెట్లను తీసి సౌతాఫ్రికి విజయంలో కీలకపాత్ర పోషించాడు.

నిర్లక్ష్యానికి మూల్యం చెల్లించారు

ఈ సిరీస్‌లో ముఖ్యంగా కీలకమైన రెండో టెస్టు మ్యాచ్‌లో కోహ్లీ సేన నిర్లక్ష్యం అడగడుగునా కనిపించింది. బౌలర్లు ఎంతో కష్టపడి ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేస్తుంటే.. బ్యాట్స్‌మెన్ మాత్రం నిర్లక్ష్యంగా ఆడారు. ఒక్కరంటే ఒక్కరు బాధ్యతగా ఆడినట్టు కనిపించలేదు. బయటికి పోతున్న బాల్స్‌ను ముట్టుకుని అవుటయ్యారు. ఫుట్‌వర్క్ సరిగా ఉపయోగించక వికెట్ల ముందు దొరికిపోయారు. ఇక ఫీల్డింగ్ విషయానికొస్తే చాలా క్యాచ్‌లు.. చేతిలోకి వచ్చిన వాటిని చేజార్చారు. కెప్టెన్ కోహ్లీతో సహా అందరూ తప్పులు చేశారు. చివరి రోజు ఆ నిర్లక్ష్యం పరాకాష్టకు చేరుకుంది. ఒకవైపు వికెట్లు పడుతుంటే ఏ ఒక్కరు కూడా నిదానంగా ఆడేందుకు ప్రయత్నించలేదు. డ్రా చేసుకునేందుకు ఒక్కరు కూడా ఆలోచించలేదు. డిఫెన్స్ సరిగా ఆడలేకపోయారు అందామనుకుంటే.. హిట్టింగ్ కూడా చేయలేకపోవడం బాధాకరం.



ఖాతూన్‌కు సహాయం చేయండి

ఐఏఓకు పీసీఐ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: పారా పవర్‌లిఫ్టర్ సకిన ఖాతూన్‌తో పాటు పురుష లిఫ్టర్ జైదీప్‌కు సహాయం చేయమని ఇండియా ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ)కు విజ్ఞప్తి చేస్తూ పారాలింపిక్స్ కమిటీ ఆఫ్ ఇండియా (పీసీఐ) లేఖ రాసింది. ఈ ఏడాది ఏప్రిల్ 4 నుంచి 15వ తేదీ వరకు గోల్డ్ కోస్ట్‌లో కామన్వెల్త్ గేమ్స్ జరగనున్నాయి. ఈ పోటీలకు సకిన, జైదీప్ పేర్లను నిర్వాహక కమిటీకి (ఓసీ) పంపడంలో పీసీఐ నిర్లక్ష్యం చేసింది. ఇప్పుడు సహాయం చేయాల్సిందిగా ఐఓఏను కోరుతోంది. కామన్వెల్త్ గేమ్స్‌కు అర్హత సాధించేందుకు 2015 సెప్టెంబర్ 1 నుంచి 2017 అక్టోబర్ 31 వరకు సమయం ఉండింది. అయితే వరల్డ్ చాంపియన్‌షిప్‌లో సకిన, జైదీప్‌ల ప్రదర్శనను ఓసీ పరిగణనలోకి తీసుకోలేదు. ఎందుకంటే సచిన్ 50కిలోల కేటగిరిలో పాల్గొన్నప్పటికీ ఆమె స్పష్టమైన బరువును ఎత్తలేదు. అయితే గ్లాస్గోలో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్య పతకాన్ని, ఆల్మటిలో జరిగిన ఆసియన్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో రజత పతకాన్ని సకిన్ గెలిచింది.

జపాన్‌ను చితగ్గొట్టిన భారత్

- నాలుగు దేశాల హాకీ టోర్నీ

తారంగ (న్యూజిలాండ్): దిల్‌ప్రీత్ సింగ్, అరంగేట్ర ఆటగాడు వివేక్ సాగర్ ప్రసాద్ రెండేసి గోల్స్ చేయడంతో నాలుగు దేశాల ఆహ్వానిత పురుషుల హాకీ టోర్నీలో భాగంగా బుధవారమిక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో భారత జట్టు 6-0తో జపాన్‌ను చితగొట్టింది. దిల్‌ప్రీత్ (35, 45 నిమిషాల్లో), వివేక్ (12, 28)లతో పాటు రూపిందర్ (7), హర్మన్‌ప్రీత్ సింగ్ (41) కూడా గోల్స్ చేశారు. ఈ మ్యాచ్‌లో భారత జట్టు ఆరంభం నుంచి ఆధిపత్యం ప్రదర్శించింది. దీంతో 7వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ లభించింది. దీన్ని హర్మన్‌ప్రీత్ గోల్‌గా మలచలేకపోయాడు. కానీ ప్రత్యర్థి ఆటగాళ్లు ఇతడిని దారుణంగా అడ్డుకోవడంతో రెఫరీ పెనాల్టీ స్ట్రోక్ ఇచ్చారు. రూపిందర్ గోల్ చేయడంతో ఇండియా 1-0తో నిలిచింది.



రొనాల్డీన్హో రిటైర్మెంట్

బ్రెజిల్: బార్సిలోనా స్టార్ ప్లేయర్, వరల్డ్ కప్ గెలిచిన బ్రెజిల్ జట్టు సభ్యుడు రొనాల్డీన్హో ఫుట్‌బాల్ కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. పారిస్ సెయింట్-జెర్మైన్ మాజీ ఆటగాడు, బార్సిలోనా స్టార్, బ్రెజిల్ జట్టులో కీలక సభ్యుడు, 37 ఏళ్ల రొనాల్డీన్హో 2002 వరల్డ్ కప్‌లో కీలకపాత్ర పోషించాడు. చివరిసారి 2015లో ఫ్లుమినెన్స్‌తో ఓ ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడాడు. ఇక రొనాల్డీన్హో ఏమాత్రం ఫుట్‌బాల్ ఆడడని, ఫుట్‌బాల్ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటాడని అతని సోదరుడు, ఏజెంట్ రాబర్టో అసిస్ తెలిపాడు. 'ఫుట్‌బాల్‌కు రిటైర్మెంట్ ఇచ్చేశాడు. తర్వాత మేము ఇతర కార్యక్రమాలను చేపట్టనున్నాం. ముఖ్యంగా ఈ ఏడాది ఆగస్టులో రష్యాలో జరగనున్న వరల్డ్ కప్ తర్వాత బ్రెజిల్, యూరప్, ఆసియాలలో కొన్ని ఈవెంట్స్‌ను నిర్వహించనున్నాం' అని అసిస్ అన్నాడు. రొనాల్డీన్హో బ్రెజిల్ జట్టుకు 97 మ్యాచ్‌లు ఆడి 33 గోల్స్ చేశాడు.

మూడో రౌండ్‌లో నాదల్

వోజ్నియాకి కూడా • ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్ శ్లామ్

మెల్‌బోర్న్: వరల్డ్ నంబర్ వన్, స్పెయిన్ బుల్ రాఫెల్ నాదల్ ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్ శ్లామ్ టెన్నిస్ టోర్నీలో మూడో రౌండ్‌కు చేరుకున్నాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో 6-3, 6-4, 7-6 (7-4)తో అర్జెంటీనాకు చెందిన లియోనార్డో మయెర్‌ను వరుస సెట్లలో ఓడించాడు. గతేడాది టోర్నీ ఫైనల్లో రోజర్ ఫెదరర్ చేతిలో ఓటమిపాలైన నాదల్ మూడో రౌండ్ మ్యాచ్‌లో డమిర్ దుమర్‌తో ఆడతాడు. ఇది తనకు చాలా ముఖ్యమైన విజయమని.. ప్రత్యర్థి చాలా గట్టివాడని మ్యాచ్ అనంతరం నాదల్ అన్నాడు. ఇక మహిళల సింగిల్స్ విషయానికొస్తే.. రెండో సీడ్ కరోలిన్ వోజ్నియాకీ మ్యాచ్ గెలిచేందుకు చెమటోడ్చాల్సి వచ్చింది. రెండో రౌండ్ మ్యాచ్‌లో వోజ్నియాకీ 3-6, 6-2, 7-5తో జన ఫెట్‌పై పోరాడి గెలిచింది. 119వ ర్యాంక్‌లో ఉన్న ఫెట్ తొలిసారి గ్రాండ్ శ్లామ్ టోర్నీలో మెయిన్ డ్రాకు అర్హత సాధించింది. ఇదిలావుంటే ఆస్ట్రేలియన్ ఓపెన్ మాజీ జూనియర్ చాంపియన్, ఉక్రెయిన్‌కు చెందిన 15 ఏళ్ల క్వాలిఫయర్ మార్టా కాస్ట్యుక్ మూడో రౌండ్‌కు చేరుకుని సంచలనం సృష్టించింది. రెండో రౌండ్ మ్యాచ్‌లో కాస్ట్యుక్ 6-3, 7-5తో ఆస్ట్రేలియాకు చెందిన వైల్డ్ కార్డ్ ఎంట్రీ ప్లేయర్ ఒలివియా రొగోవ్‌స్కాను వరుస సెట్లలో ఓడించి ఇంటికి పంపింది. 521వ ర్యాంక్ ప్లేయర్‌గా ఈ టోర్నీకి ప్రవేశించిన కాస్ట్యూక్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో మూడేసి సెట్లు ఆడి దాదాపు 6 గంటల పాటు మైదానంలో గడిపింది. తొలి రౌండ్ మ్యాచ్‌లో 25వ సీడ్ పెంగ్ షువాయ్‌ను కాస్ట్యూక్ చిత్తు చేసిన సంగతి తెలిసిందే. తొలి రౌండ్‌లో వీనస్ విలియమ్స్‌ను ఓడించిన బెలిండా మెనిక్‌కు వోజ్నియాకి మాదిరి అదృష్టం కలిసిరాలేదు. రెండో రౌండ్ మ్యాచ్‌లో బెలిండా 1-6, 3-6తో థాయ్‌లాండ్‌కు చెందిన లుసిక కుమ్‌కుమ్ చేతిలో ఓటమిపాలైంది. నాలుగో సీడ్ ఎలినా స్విటోలినా కూడా మూడో రౌండ్‌కు చేరుకుంది. రెండో రౌండ్ మ్యాచ్‌లో ఎలినా 4-6, 6-2, 6-1తో చెక్ రిపబ్లిక్‌కు చెందిన కటెరిన సినియకోవాపై గెలిచింది. మరో మ్యాలో కటెరినా బోండరెంకో 6-2, 6-3తో 15వ సీడ్ అనస్తసియా పవ్ల్యుచెంకోవాను ఓడించి మూడో రౌండ్‌కు చేరుకుంది. మరో మ్యాచ్‌లో ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ జెలెనా ఒస్టాపెంకో 6-3, 3-6, 6-4తో డువాన్ యింగ్‌యింగ్‌ను ఓడించింది.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id. manamtelugudaily1@gmail.com.